

23-2-62



సంధ్యాసమయం:

ఫొటో: ఎ. వి. వి. నరసింగరావు (కర్నూలు)

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!



ఇండియా

మధుర స్మృతులతో
మరపురాని ప్రయాణానుభవాలు!
బహు పసందైన శాశ్వత స్మృతి చిహ్నాలు
బహుళార్థ సాధక ప్రణాళికలు!
ఇంద్రజాలంలా కన్నుల విందుచేసే ప్రాచీన నృత్యకళాఖండాలు!
ఇంద్రధనుస్సులా వెల్లివిరిసిన వివిధ వర్ణాల ప్రకృతి దృశ్యాలు!

డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం
భారత ప్రభుత్వము

భారతప్రభుత్వపు టూరిస్టు ఆఫీసులు:
బొంబాయ్ • కలకత్తా • ఢిల్లీ • మద్రాస్ • ఆగ్రా
ఔరంగాబాద్ • బెంగుళూరు • భోపాల్ • కొచ్చిన్
జయపూర్ • వారణాసి

(DA 61/700)

ఉత్తరాలు

ముఖచిత్రం

9—2—62 సంచిక ముఖచిత్రం చాలా ఆకర్షించింది. కాని ఒక చిన్న సందేహం. నేటి యువకులందరూ (క్రొత్తగా పెళ్లయినవారు) అటువంటివారేనా! అసలు ఆ ముఖచిత్రంయొక్క భావమేమిటి?

రూపాకుల మధుసూదనరావు (నిజామాబాదు)

* * *

ఏమండోయ్! 9—2—62 సంచిక ముఖచిత్రం ఎవరండి? సంచిక చూచిన వెంటనే ఈ వారం పత్రిక కొన్నాను. చాలా బాగుంది. ఎప్పుడు ఇటువంటి బొమ్మలు వేయాలని కోరుచున్నాను.

డి. హరిరావు (రాయచోటి)

* * *

ఈమధ్య మా అభిమాన పత్రిక ఆంధ్రపత్రిక వార పత్రికలో బొమ్మలు వేస్తున్న "సరాగం" అమ్మాయో, అబ్బాయో సెలవిస్తారా చాలా బాగా వేస్తున్నారు.

కడలి విజయలక్ష్మి (రాజమండ్రి)

బాగావేస్తే అదేచాలు.

చదువుల్రావు

2—2—62 వారపత్రికలో చదువుల్రావు, స్నేహితుడు తన కొత్త వాచిని పెట్టుకున్నాడని అందుకు నీళ్ళలోకి దూకానని చెప్పాడు. కాని ఈవారం తన పాత వాచీ పాడయిపోయిందని చెప్పాడు. ఇలా చెప్పించటంలో సత్యమూర్తిగారి ఉద్దేశ్యం నాకు తెలియుటంలేదు.

కుమారి అవంతి భరద్వాజ్ (సికిందరాబాదు)

* * *

సత్యమూర్తిగారి కార్టూన్లు చాలా బాగుంటున్నాయి. ఒక సందేహం! చదువుల్రావు ప్రక్కన ఎప్పుడూ పెద్దబొట్టుతో, రెండు జడలతోవుండే ఆ అమ్మాయి ఎవరండి?

బి. మల్లిక (హైదరాబాదు)

ఏమో!

కార్టూన్

నా అభిమాన నటి ప్రమీల, కాదు కాదు దేవికగారి కర్టూన్యను చాల చక్కగా వేసిన బాపుగారికి నా కృతజ్ఞతను తెలియజేయుటకు నేను సంతసించుచున్నాను. చివర వారి వాక్యం "ప్రతిభ ఉంటే పేరు తెచ్చుకోడం అవలీల" అన్నది చాల బాగా వ్రాశారు.

డి. సత్యనారాయణ (కాకినాడ)

* * *

నా అభిమాన నటి అయిన దేవికగారి కర్టూన్ చాల చక్కగా వేసిన బాపూగారికి నా కృతజ్ఞతను తెలియజేయుటకు నేను ఎంతయో సంతసించుచున్నాను.

కె. ప్రభావతి (బాన్సువాడ)

* * *

నిజం చెప్పాలంటే బాపుగారి సినీ కార్టూన్లు మా పత్రిక కొక ప్రత్యేకత. ఈ వారం పత్రికలో సినిమా నాయిక దేవికను బాపుగారు మరీ అంత నిండుగా చక్కగా చిత్రించింది చూసి మా కృతజ్ఞతలు మీకు తెలియజేయకుండా ఉండలేక పోతున్నాం. ప్రచురించినందులకు మీకూ, శ్రీ బాపు గారికి మా సంతోష పూరిత ధన్యవాదములు

టి. ప్రేమ్‌కుమార్, వి. వి. స్వామి (ఆలూర్)

* * *

బాపుగారు కార్టూన్యను ద్వారా దేవికగారిని పరిచయం చేసినందుకు చాల సంతోషించితిని. "ప్రతిభ ఉంటే పేరు తెచ్చుకోడం అవలీల" అని వ్రాశారు. అందరికీ అంతే. ఇదీ మరీ బాగుంది.

యస్. తిరుపతిరావు (పర్లిసారథి)

* * *

తెనాలిరామకృష్ణలో శ్రీకృష్ణదేవరాయలుగా, సీతారామ కళ్యాణములో రావణాసురుడుగా, మాయా బజారులో కృష్ణుడుగా, సంపూర్ణ రామాయణంలో రాముడుగా, వీరి నటన పరాకాష్ఠ నందుకొన్నది, "కలిసి ఉంటే కలదు సుఖం", "చిరంజీవులు", "పిచ్చి పుల్లయ్య", "తోడుదొంగలు", చిత్రాలలో వీరి నటన నేను మరువలేను. సాటిలేని మేటి నటుడైన శ్రీ ఎన్. టి. రామారావుగారిని కార్టూను ద్వారా పరిచయం చేసినందుకు మిమ్మల్ని అభినందించకుండా ఉండలేక పోతున్నాను.

కాజ వెంకట హేమలత (తెనాలి)

* * *

నా అత్యంతాభిమాన నటుడు శ్రీ నయనానంద మూర్తి రామారావు కార్టూను, దానికి సమకూర్చిన ట్యూను చాలా బాగా ఉన్నాయి. చిత్రకారుడు బాపూ గారికి నా అభివందనములు.

డి. సత్యమూర్తి (విజయనగరం)

భూగర్భంలోనికి సాహసయాత్ర

ముందు '80 రోజులలో భూప్రదక్షిణం' వ్రాసి మాకెంతో వినోదాన్ని, విజ్ఞానాన్ని, ఆనందాన్ని అందించిన రచయిత శ్రీ జూల్సువెర్న్‌గారికి నాయొక్క హృదయపూర్వక కృజ్ఞతాభివందనములు

ఎ. రంగనాథరావు (నిర్మల్)

* * *

కథలు

యజ్ఞంపెట్టి పద్మగారు వ్రాసిన "సువర్చలా—సుబ్బారావు" కథ పాత పక్కీలో నడిచినా బాగుంది. కాని, పద్మగారు బొత్తిగా "వెధవ గుమస్తా గిరైనా దొరకదా" అని వ్రాయటం బాగా లేదు. గుమాస్తాల విలువలను తెలుసుకుని ఇటుపైన సరిగ్గా వ్రాస్తారని ఆశించుచున్నాను.

యం. యల్. యన్ శర్మ (భిలాయి)

* * *

జంట రచయితలు క్రొవ్వి రామమోహనశాస్త్రి, బుర్రా వెంకటాయశర్మగార్ల "ముక్కుపొడి, డొక్కు సైకిలు" కథ బ్రహ్మాండంగా ఉంది. రచయితలకు మా అభినందనలనందచేయ ప్రార్థన.

యం. బలరామస్వామి (జబల్‌పూర్)

* * *

"ముక్కుపొడి—డొక్కు సైకిలు" ఈమధ్య వచ్చే కథల్లో ఒక నూతనత్వం కన్పిస్తూంది—పైగా చిలకమర్తి వారి గణపతి—గురజాడవారి గిరీశం—మొక్కపాటి వారి పార్వతీశం వాళ్లకుమల్లే తెలుగు వాళ్ల హృదయాల్నుండి తప్పించుకోలేనంతగా "నవ్య ప్రియ రామన్న పంతుల్ని" ఆయన డొక్కు సైకిల్ని రచనలో చిత్రీకరించిన కథకులు శ్రీయుతులు క్రోవి రామమోహనశాస్త్రి—బుర్రా వెంకటాయశర్మ గార్లకు మీ పత్రిక ద్వారా నా అభినందన లందజేయ కోరుచున్నాను.

వేములూరి నాగేంద్రాజీ (రాజమండ్రి)

* * *

'చంపకం—చీరచెంగూ' — 'పంకజం—పమిటికొంగూ'—లాగా ఏమిటండీ ఈ 'ముక్కుపొడీ—డొక్కు సైకిలూ! 'సువర్చలా—సుబ్బారావూ'నూ! ఏం బా'లేదు! పైగా—

రమణారావు (రాజమండ్రి)

* * *

"ముక్కుపొడి—డొక్కు సైకిలు" కథ చాలా హాస్యముగానుండి చాలా బాగున్నది. ఇందులో సైకిల్ను పోయినప్పుడు ఆయన ఆత్రత వర్ణనాతీతము. రచయితకు నా అభినందనలు.

ఓరుగంటి సుబ్రహ్మణ్యము (బలిజిపేట)

* * *

ఆంధ్రసచిత్ర వారపత్రికలో చవుకబారు కాగితం వాడటం చాలా బాధాకరంగా ఉంటోంది.

టి. ఎస్. రామారావు (విజయనగరం)

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో అప్పుడప్పుడు 'నేపా' కాగితం వాడుతున్నందుకు అసంతృప్తి వెల్లడిస్తూ కొందరు పాఠకులు ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఈ కాగితం తెల్లగా లేకపోయినా విదేశాలనుంచి దిగుమతిఅయ్యే కాగితంకంటే ఖరీదైనది! అయినప్పటికీ ప్రభుత్వ విధానాన్ని అనుసరించి ఈ కాగితం కొంత వాడి తీరవలసివస్తున్నది. ఈవిషయమై మేము చేయగలిగినదేమీ లేదని మనవి చేస్తున్నాము.

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

విషయానుక్రమణిక

శుక్రవారం : *23-2-62*

ప్లవనం॥మాఘమాసం బ॥ చవితి

సంపుటము : 54 సంచిక : 25

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

విడిప్రతి : 25 న. పై

సంవత్సర చందా : 13-0-0 రు.

*


ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

★

ముఖచిత్రం — ప్రీతి




లోకంపోకడ



"నిన్న మనం పేదవారం; ఈవేళ ధనవంతులం."
"ఏమిటి సంగతి? గుర్రప్పందాల్లో కలిసొచ్చిందా!"
"అబ్బే! అది కాదు. ధనవంతుడైన అభ్యర్థి ఇచ్చిన రూపాయిలు వంచీ పుచ్చుకుని నా అభ్యర్థిత్వం ఉపసంహరించుకున్నానంతే."


ఎన్నికలదైవానికి
భక్తులశ్రద్ధాంజలి!
జన సంఘం
ఓటరు
ఓటు
స్వతంత్ర
పి.ఎస్.పి
కాంగ్రెస్
ఈ బొమ్మను విదేశీయులు నడిపారు
సింహళ ప్రభుత్వం
కుట్ర
దుష్ట సహవాసం
స్వార్థపరులు
నేపాల్ మహారాజు
సలహాదారులు
స్వతంత్ర విపినం
అందరికీ స్వేచ్ఛ
రాజాజీ: ఇక్కడ కంట్రోల్సు, పర్మిట్సు, లైసెన్సులు లేవు—
అందరూ స్వేచ్ఛా జీవులే
ఓటరు: మరి పెద్దపులుల మాటేమిటో?



నైజీరియా రహదార్ల మంత్రి శ్రీ అకిన్ ఫాసిల్ ఇటీవల న్యూఢిల్లీ వచ్చినప్పుడు ఉపరాష్ట్రపతి డా॥ ఎస్. రాధాకృష్ణన్‌ను కలుసుకున్నారు.

ప్రజలను బెదరగొట్టిన జ్యోతిష్కులకు 'గ్రహదోషం': ఇరుకునపడ్డ భారత-నేపాల్ సంబంధాలు

శ్రీకృష్ణ

ఇంతవరకూ మనమందరం సజీవులంగా ఉండి హైందవ జ్యోతిషశాస్త్రవేత్తలను అప్రతిష్ఠపాలు చేసిన భగవంతుణ్ణి కీర్తిస్తున్నాం. కొన్ని పత్రికలు—ముఖ్యంగా ఢిల్లీనుంచి వెలువడుతున్నవి—ప్రజల్ని భయ కంపితులనుచేసేవార్తలు, వ్యాసాలు ప్రచురించి దేశానికి ఎంత అపచారం చేశాయో తేలిపోయింది. ఈ ప్రచారంవల్ల తాత్కాలికంగా ఆ పత్రికల ప్రతులు అదనంగా కొన్నివేలు అమ్ముడుపోయి ఉండవచ్చునుగాని, అణుయుగంలో కూడా భారతీయులు చరిత్రకు పూర్వం దశలోనే ఉన్నారని నాగరిక ప్రపంచాని కంతటికీ స్పష్టమైపోయింది.

భారత రాజధానీ నగరానికి సంబంధించిన విషయాలు మాత్రమే నేను మనవి చేస్తున్నాను. ఎనిమిది గ్రహాలు మకరరాశిలో ప్రవేశించగానే భయంకరమైన భూకంపం వస్తుందని జ్యోతిష్కులు చెప్పి ఉండటంచేత, అంతకు కొన్ని వారాలు ముందుగానే నగర సౌధాలలో రెండు మూడు అంతస్థులలో నివసిస్తున్నవారు ఆ రెండు రోజులు గూడారాలలో ఉండటానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అందరి ముఖాలలోను భయం, ఆందోళన తాండవించాయి.

అయినప్పటికీ వ్యాపారం మామూలుగానే సాగిపోయింది. జనం జ్యోతిష్కుల మాటలు పూర్తిగా నమ్మలేదో, విధి వ్రాతకు తల వొగ్గారో తెలియదుగాని హోటళ్ళు, క్లబ్బులు కిటకిటలాడుతూనే ఉన్నాయి.

1947 లో భారతదేశం స్వాతంత్ర్యం పొందింది లగాయతూ అంతకుమునుపు ఎన్నడూ లేనంతగా జ్యోతిష్కులకు గిరాకీ పెరిగింది. రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌కు జ్యోతిషమంటే వల్లమాలిన అభిమానం. వారం వారం వారు ఉజ్జయినినుంచి జ్యోతిష శాస్త్ర సాహిత్యం తెప్పించి పఠిస్తారు. కేంద్ర మంత్రివర్గంలో నెహ్రూ, కృష్ణమీనన్ మినహా హిందూమంత్రులందరూ జ్యోతిష శాస్త్రానికి దాసులంటే అతిశయోక్తి కాదేమో! పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి డా. గోపీచంద్ భార్గవా సిబ్బందిలో ఒక జ్యోతిష్కుడు కూడా ఉండేవాడు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. సంపూర్ణానంద్ స్వయంగా జ్యోతిష్కుడు.

ఇంతకుమునుపే నేను మనవి చేసినట్టు జ్యోతిష్కులు ఇప్పుడు రెండు చేతులా సంపాదిస్తున్నారు. శ్రీ నెహ్రూ తరువాత ఎవరు ప్రధానమంత్రి అవుతారో కూడా వీరు నిక్కచ్చిగా తేల్చి చెప్పేస్తున్నారు!

అష్టగ్రహకూటమి సందర్భంలో వచ్చిన జోస్యాలే పరికించండి. ఈ జోస్యాలు ఏమైతేనేమిగాని పలువురు బ్రాహ్మణులు మాత్రం నాలుగు డబ్బులు చేసుకున్నారు. వందలాది డబ్బాల ఆవునెయ్యి బస్తాలకొద్దీ సన్నబియ్యం, ఇతర ఆహార పదార్థాలు గ్రహాలపేరు చెప్పి అగ్నిహోత్రుడికి ఆహుతి చేశారు. ఇలా వృథా అయిన సొమ్ముకొన్నికోట్లని టూకీగా అంచనా వేయవచ్చు.

—62వ పేజీ చూడండి



"పక్కింటి అబ్బాయి— బంగారుతండ్రి — అహ...పక్కరూములో అబ్బాయి—బంగారు తండ్రి" అని పైటను సరిదిద్దుకుంది కాత్యాయిని కూతిలో చాద వేస్తూ.

"ఎంత మంచివాడని నమ్మకం లేకపోతే నాన్న— అదే మీ నాన్న—రూము — పరాయి మగకుర్రాడికి ఇస్తారు ?" అందామె మనస్సు.

"హబ్బ — ఎంత మంచి కేమాత్ర ఇదేం మంచి బాబూ—గదమంచి ?—రూములో చేరి పదిరోజుల పైద్దయినా, చప్పుడంలేదు. ఎప్పుడూ పిడువద్ద గుడితలుపుల్లా తలుపులు వేసుకుని కూర్చోవాలా—"

కాత్యాయిని చాదలో నీరు బిందెలో పోసి, బిందెతో, వంటింటికేసి నడిచింది.

"అతని మంచి విష్ణేంచెప్పింది, తలుపులు వేసుకు కూర్చుంటే నీకేం."

"కాదూ" అందామె మనస్సుకు సమాధాన పరచలేక. బిందె వంటింట్లో దించి, సెరట్లోకి వచ్చి ఆ రూమువంక మరొక్కసారి చూసింది.

తలుపులు వేసి ఉన్నాయి !!

.... అబ్బాయ్—పెద్దక్కపూర్వమే — అవగా, తెలవడామునే లేచి, స్నానాదులు ముగించుకుని, అటు, అటూ యిటూ తచ్చాడక, ఆ రూములో నువ్వే తలుపులేసుకుని కూర్చోవాలి .... రాత్రి గమ్ముగ యింటికి చేరాలి. ఆలస్యంగా, రాకూడదు. బంధుమిత్ర—మిత్ర మిత్రులూ, స్నేహిత, పోరులూ —వారి కేకలు వెళ్ళేదు. ఏ కాకిలా, బుద్ధిగా ఉంటానన్నావు కనుక రూము ఇచ్చాను. కనుక ఆ కాకిలానే ఉండాలి. లేదా—ఉద్యానం, పైగా అద్దె, నువ్వు యిచ్చిన బజానా తిరిగి రాదు .... అని అతను చేరేనాడు తనతండ్రి అన్న మాటలూ, ఆ మాటలకు అతని నవ్వూ, వినయతా, ఆమెకు గుర్తుకు వచ్చాయి.

"పాపం" అనుకుంది ఆమె.

"ఏమేవ్ అమ్మడూ! నాన్నగారు పిలుస్తున్నా" అన్న కేకతో, ఈ లోకంలోకి వచ్చి, [illegible] కిలో కుచ్చిళ్ళు విదిలించుకుని, "వస్తు వస్తు" అని ఇంట్లోకి వెళ్ళింది.

హాల్లో అడుగు పెట్టంగానే, దశరథరామయ్య గారు "ఏం, అమ్మడూ—లాభంలేదు" అన్నాడు టూకీగా.

"వచ్చే నాన్నా" అని నవ్వుకుంటూ కాత్యాయిని పుస్తకాల మేటు ముందు వేసుకుని కూర్చుంది. దశరథరామయ్యగారు దినపత్రిక చేతో పుచ్చుకుని "కానీ" అన్నారు. కాత్యాయిని తెలుగుపుస్తకం తెరుస్తూ "ఏది ఏమైనా అతగాని కిరీటి, పట్టు తగదు. ముమ్మాటికీ" అనుకుంది. రామయ్యగారు పేపరు చాటునుంచి "ఏతామ్మడూ—ఏవి—అలా బెల్లంకొట్టిన రాయిలా కూర్చున్నావు—కానీ — తెలుగుపద్యం అప్పచెప్పు". అనేసి, మళ్ళా పత్రికలో నిమగ్నుడయ్యాడు. కాత్యాయిని — గమ్మున తెలుగుపుస్తకం తీసి తండ్రి వొళ్ళో పెట్టింది.

"ఊఁ" అన్నాడు రామయ్యగారు.

"అప్ప .... అప్ప కమింపుమప్ప ...."

"ఊఁ—ఊఁ"

"అప్పు కమింపుమప్ప—తగ దబ్బ ...."

"ఊఁ—ఊఁ—కానియ్."

"తగదబ్బడు గా .... తగ దబ్బడు గాడిద .."

[illegible] రామయ్యగారు ఉలిక్కిపడి, కుర్చీ విరిగి పక్కలయ్యలో పడ్డారు.

"ఓసి, వెకిలిపిల్లా ! అబ్బడు గాడిద—ఏవిటే— అప్పిచ్చువాడు వైద్యుడు—అక్కట్లు" అని మళ్ళీ నవ్వారు.

తప్పు గ్రహించిన కాత్యాయిని ముక్కర గిల్లుకుందామని—చెయ్యి పైకెత్తింది—కానీ ముక్కర ఆ స్థానంలో లేదు. దొడ్లో తిరుగుతోంది. హఠాత్తుగా— అవి నాలుక కరుచుకోపోయింది .... అది లేదు !

"పరేలే—లెక్కలు తియ్యి" అన్నారు రామయ్య గారు నవ్వుతూ.

వానా అవస్థలూ పడి, నాలుగు పావు గంటల్లో ఆనాటి ప్రయివేటు ముగించుకుని, నాలుగు మెతుకులు తిని, మ్యాటినీకు .... ఆ రూమువైపు చూసుకుంటూ .... వెళ్ళింది. వెళ్ళిన ఓ గంట కల్లా తిరిగి వచ్చేసింది.

"అదేవిటే—అమ్మడూ— అప్పుడే వచ్చావ్. సినిమా వచ్చిపోయిందా ?" అంది జానకమ్మగారు [illegible].

"ఏదీ, లేదమ్మా. ఇవాళ ఎవరో పోయారు పాపం— అందుకని—శెలవు" అంది ఆమె.

.."హయ్యో పాపం ! పోన్లే. ఇంట్లో కూర్చుని— చదువుకో—నే నలా మారయ్యగారింటికెళ్ళొస్తా" అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

కాత్యాయిని పుస్తకాలు అలమరలో పడేసి కుర్చీలో కూర్చుంది. కళ్ళు గింగిరాలుతిరిగాయి.

"[illegible]" అందామె మనస్సు.

కాత్యాయిని [illegible] కుర్చీలోంచి లేచి బయటికి వచ్చింది. [illegible] అలానే వింటూ ఆలోచించి, [illegible] ఆ రూము తాళం [illegible] "క్క్" [illegible]. తలుపుకి ఆనుకుంటూ ఉన్న కిటికీ [illegible] నడిచింది. పై తలుపులు వారేసి ఉన్నాయి. తలుపులు తీసి, విశాలాక్షి అయ్యి మునివేళ్ళమీద నించుని, లోపలకు చూసింది.


[illegible] రూము, మధ్యలో నవారు—మీద ఏవేవో .... గొట్టాలూ, వైర్లూ, గందరగోళంగా ఉన్న సామానులూ, బ్యాటరీ సెట్టూ ...."

"రేడియో యింజనీరు గామోసు !" అందామె మనస్సు.

ఇంతలో 'హస్క్' అన్న కేకతో వీధితలుపు తెరవబడింది. ఆమె తలుపులేసి ఉత్తరాలు అంది పుచ్చుకుంది. "కుక .... టి .... కూడా .... [illegible]"—[illegible] అనుకుంటూ [illegible] చూసింది. ఇంతలో [illegible]

—[illegible]





ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడులో "సంజీవబాలికల వసతిగృహా"నికి మంత్రి శ్రీమతి మసూమా బేగం ఇటీవల శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, మంత్రి శ్రీ అల్లూరి కూడా చిత్రంలో ఉన్నారు.

గుండానపడిన ఎన్నికలపీర్లు: ప్రతిపక్షాలు బలపడి కాంగ్రెసు మెజారిటీ తగ్గిపోయే ప్రమాదం

కౌండిన్య

రాష్ట్రంలో ఎన్నికల కార్యక్రమం ఆఖరు ఘట్టంలోపడింది. మొదటిజట్టు 96 నియోజకవర్గాలలో ఈ 19 వ తేదీన పోలింగు పూర్తి అయింది. వివిధ పక్షాలు ప్రచారం జోరుగా సాగించినా, పోలింగ్ ధోరణిలో మాత్రం ఆ జోరు అంతగా కన్పించడంలేదు. 1955 ఎన్నికలలో ఆంధ్ర శాసన సభకు మొత్తం 87 లక్షల 24 వేల వోట్లు, 57 ఎన్నికలలో తెలంగాణాలో (శాసన సభ స్థానాలకు మాత్రం) 36 లక్షల 3 వేల వోట్లు పోలయ్యాయి. కాంగ్రెస్‌కు ఆంధ్రలో 40% తెలంగాణాలో 47% వోట్లు లభించాయి. కమ్యూనిస్టులకు కూడా స్థానాలు అట్టే రాకపోయినా ఆంధ్రలో 27 లక్షలు, వచ్చాయి. మరి ఈసారి ఆంధ్ర తెలంగాణాలో 55, 57 ఎన్నికలలో పోలైనన్ని వోట్లు పోలు కాకపోవచ్చు. వోట్లు ఎంత తక్కువ పోలైతే, కమ్యూనిస్టుపార్టీకి అంత లాభం, కాంగ్రెస్ సహా తతిమ్మా పార్టీలకు అంత దెబ్బ.

ఈసారి ఎన్నికలలో బహుముఖ పోటీ ప్రధానమైనది. మొత్తం 300 నియోజక వర్గాలలో ముఖా ముఖి పోటీలున్న స్థానాలు నాలుగో వంతు కూడాలేవు. త్రిముఖ పోటీలు 97 చోట్ల, చతుర్ముఖ పోటీలు 53 చోట్ల, పంచముఖ పోటీలు 33 చోట్ల ఉన్నవి. 16 స్థానాలలో అరేసి మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మూడు నియోజక వర్గాలలో—బ్రాహ్మణతర్ల, బాపట్ల, ముషీరాబాద్—ఒక్కొక్కదానిలో ఏడుగురు పోటీ పడుతున్నారు. సరాసరి పోటీలున్న నియోజకవర్గాలు చాలామటుకు కాంగ్రెస్ గెల్చుకునే అవకాశం ఉంది. ఇటువంటివి స్వతంత్రపార్టీ కాంగ్రెస్‌పార్టీ మధ్య పోటీ గలవి. రాయలసీమలో 15 ఉన్నవి. 29 చోట్ల కాంగ్రెస్ స్వతంత్ర కమ్యూనిస్టు పార్టీలు పోటీ చేస్తున్నాయి. మరో 11 చోట్ల కాంగ్రెస్, స్వతంత్రపార్టీ స్వతంత్ర అభ్యర్థులు, పోటీలో ఉన్నారు. ఈ త్రిముఖ పోటీలలో చాలామటుకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోయేవే.

ఈరకంగాఉన్న పోటీల స్వరూపాన్నిబట్టి, ఆయా జిల్లాల్లో స్థానికంగా పార్టీల బలా బలాలనుబట్టి, ఏపార్టీకి ఎన్నిస్థానాలు లభిస్తాయి అన్నదే

53—వ పేజీ చూడండి

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!

ఈవారం సినీవిహారం

మధుమూర్తి



రాజలక్ష్మి ప్రొడక్షన్స్‌వారి 'ఖైదీ కన్నయ్య'లో కాంతారావు, రాజసులోచన.

ఒక చిత్రం విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడినపిమ్మట ఆ చిత్రనిర్మాత మరొక కొత్త చిత్రాన్ని తయారుచేయటానికీ, తిరిగి రంగంలో ప్రవేశించటానికి సాధారణంగా ఆరునెలలకంటె ఎక్కువకాలం పట్టదు. ఈ ఆరునెలలూ కథను ఎన్నుకోవటానికి, ఆ కథను ఈవిధంగా చెప్పాలని దృశ్యాలదండను నిర్ణయించుకోటానికి, ఆ దృశ్యాలను మాటల తీరులో నడిపించటానికి దొర్లిపోతాయి. ఆ తరువాత పాత్రధారుల ఎన్నిక, వారి తీరిక, వీటినిబట్టి స్టూడియోలో సెట్స్ నిర్మాణం ఏర్పాట్లూ అన్నీ జరిగి కాల్‌షీట్ పుచ్చుకునేసరికి పైనచెప్పిన గడువు పూర్తవుతుంది.

ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ నిర్మాత అనుమోలు వెంకట సుబ్బారావు "భార్యా భర్తలు" చిత్రం విజయవంతమైనపిమ్మట పదకొండు నెలలు దొర్లిన తరువాతగాని, నాల్గవ చిత్రాన్ని నిర్మాణానికి పైన చెప్పిన సన్నాహాలన్నిటిని పూర్తి చేయలేకపోయాడు. దీనికి కారణం ఏమిటో కనుక్కోవాలనీ, కొత్త చిత్రంలోని తారాబలం, సాంకేతికబలం వివరాలు, తెలుసుకోవాలనే ఆతురతతో వారి కార్యాలయానికి వెళ్ళాను.

నే ననుకున్నట్లుగానే కొత్త చిత్రం సన్నాహాల ఆలస్యానికి ప్రబలమైన కారణం ఉందని తెలిసింది. "భార్యాభర్తలు" చిత్రం విజయవంతం కావటానికి ముఖ్యమైన అంశం ఆ చిత్రగాథలోని రవ్వంత కొత్తదనం. ఈ కొద్దిపాటి కొత్తదనాన్ని వెండితెరకు అందించటంలో వారు అనుసరించిన ప్రాథమికమైన పంథాకు ఆదిలోనే అవాంతరాలు వచ్చాయి. ఇవి ప్రాంతీయ సెన్సారు అధికారినుంచి వచ్చినవి.

సెన్సార్ సనాతన దృక్పథం

అమ్మాయిలవెంటపడే అబ్బాయికి ఒక మంచి అమ్మాయి భార్య అయినపిదప అతనికి పాఠం చెబుతుంది. ఇది ఆ కథలోని కొత్త. అమ్మాయిల వెంటపడే అబ్బాయి అని ఒకపాత్రను పరిచయం చేయటానికి ఆ చిత్రంలో ఒక పాటనే ఆధారంగా చేసుకున్నారు. ఆ పాట చిత్రీకరణకే కత్తెర పడింది. ఈ పూర్వానుభవంతో ఈసారి తాము ఎన్నుకున్న కథని, కథనం వివరాలను నిర్మాత, దర్శకుడు, కవి కలసి సెన్సార్ అధికారికి చూపించారు. ఆ కథలో ఒక కొత్తదనం ఉంది. ఒక అమ్మాయి ఒక అబ్బాయి వలలోపడి మోసపోతుంది. ఫలితం అందుకుంటుంది. ఈ సంఘటన పనికిరాదన్నారు సెన్సార్‌వారు. అంచేత నిర్మాత తిరిగి మరొక కథను ఎన్నుకుని, మళ్ళీ మాటలు వ్రాయించి, కథనం పూర్తిచేసుకునేసరికి పైన చెప్పిన ఆరు నెలల గడువుదాటి రెండో ఆరునెలల గడువు పూర్తికి వచ్చింది.

సహజత్వానికి మారుపేరు కొత్తదనం. అటువంటి కొత్తదనం చొరబడకుండా ఉండడానికి మన ప్రాంతీయసెన్సార్ అధికారి కంకణం కట్టుకున్నట్లు కనబడుతున్నది. మన నిర్మాత లెవరూ అవినీతి గొప్పదని చిత్రాల్లో ప్రబోధం చెయ్యరు. చెడు ఏదో చెప్పకుండా, దాని దుష్ఫలితాలేవో సూచించకుండా మంచిని పెంచటం, పాఠం చెప్పటం సాంఘిక చిత్రాలకు, ఈకాలం చిత్ర గాథలకు అసాధ్యం.

హిందీ చిత్రాలలో ఏక్—హి—రాస్తా, తలాక్ ధూల్ కా ఫూల్ చిత్రాలు, గాథలు గొప్పగా ఉన్నాయంటే కారణం ఆ కథలలో ఈనాటి అనాచారాలూ, వాటి ఫలితాలూ చూపటంవల్లనే! అయితే ఆ చిత్ర నిర్మాతలకు సెన్సార్ నిబంధనలు వేరుగాను, మన ప్రాంతీయ సెన్సార్ షరతులు వేరుగానూ ఉన్నాయేమో ననిపిస్తుంది. అది నిజంకాదు. నిబంధనలను అమలుపరచే మన సెన్సార్ అధికార బృందానికి కొంత సనాతనవర్గం వాసనలు పోలేదని తేలుతుంది. రుక్మాంగదుడు ఇద్దరు భార్యలను కట్టుకోవడం "బిగమీ చట్టా"నికి విరుద్ధమని వాదించటంనుంచి పాండవు లైదుగుర్ని కట్టుకున్న ద్రౌపదికి కూడా ఒక నీతినీ, చట్టాన్నీ అంటకట్టితే సాంఘిక చిత్రాలతోబాటు పౌరాణిక చిత్రాలను కూడా వెండితెరకు అనువదించ నవసరంలేదనిపిస్తుంది!!

—49 వ పేజీ చూడండి



అమృతకళా ప్రొడక్షన్స్‌వారి 'ఇద్దరు కొడుకులు'లో బి. సరోజాదేవి.

హరి వంశము

హారిత శివశర్మ

సాందీపనిపర్వం - 49

ఆ తరువాత కాశీమహారాజు ఎంతయోకాలము బ్రతుకలేదు. ఆ బ్రతికిన కొన్నిరోజులు ఆయన సుఖపడలేదు. తనకు అల్లుడుకానున్న పౌండ్రకుడు అవమానించినది శ్రీకృష్ణవాసుదేవునికాదు; తన్ను అన్న అభిప్రాయ మొకటు ఆయనలో బాగుగా నెలకొని పోయినది. అది మొదలు ఆయన ఎవ్వరితోడను మాటలాడలేదు. ఆత్మదుహితతో మాట్లాడుట యన్న గూడ నాయనకు సిగ్గైనది. ఆమె జీవితమును తాను వికటముగా బంధించివైచినాడు. ఆమెహృదయ మెచ్చటనున్నదో! తాను ఆమెను పౌండ్రకునకు ఇత్తునన్నమాట అనివేసినాడు. అది తిరుగుటకు వీలులేని మాట. జీవితమున ఎన్ని కష్టములనైన భరించవచ్చునుగాని, అనినమాటనుండి తిరిగిపోయినాడన్న అపప్రథ నరకమునకన్న హీనమైనది. సత్యమును తప్పినవానిని ఎవ్వరును గౌరవించరు. మర్యాదచేయరు. మరి ఇప్పుడు తన కుమార్తెకు మనస్సు తెలియనివాడు, భర్తయన్న సంగతి యేమో యెరుగనివాడు, తాను ఆమెను పౌండ్రకున కిత్తునని వాగ్దానము చేయుట తగిన పనియా? అది సత్యశబ్దవాచ్యమనిపించుకొనునా! సుదక్షిణ తన కుమార్తె కావచ్చును. కాని ఆమె తావా! ఆమె ఇష్టమును శాశించుటకు తానెవ్వరు? అట్లు శాసించుట యహంకారమగునుగాని సత్యపథమగునా! మహారాజునకు నేమియు తోచలేదు. ఆయన సుదక్షిణకు కబురు పంపినాడు. శ్రీకృష్ణదేవునకు అవమానము జరిగినప్పటినుండియు, ఆమెకు ఎవ్వరి మొగము చూచుటయన్నను కష్టముగా నున్నది. ఆమెస్థితి ఇప్పుడు జబ్బుపడి లేచినట్లున్నది. ఎంత మరిచిపోదమన్నను ఆ జరిగిన అవమానము నామెను మరిచిపోగలుగుటలేదు. ఆమె పౌండ్రకునితో నిప్పు డసలు మాటలాడ్డటయేలేదు. ఎప్పుడైన పౌండ్రకు డామె మందిరమునకువచ్చి పల్కరించినచో, తానై స్వయముగా ప్రత్యుక్తికరించుటలేదు. చెలులతో ఆయనకు చెప్పవలయు సమాధానము చెప్పి, వారిచేత చెప్పించుచున్నది. ఇది అతనికి మనఃక్లేశహేతువగుటలేదు. ఉల్లాస హేతువగుచున్నది. అట్టి సందర్భములలో నాత డామెతో ఇట్లనుటయు గలదు:

'సుదక్షిణే! నీవు ఈ విచిత్ర వైఖరిని వహించుటయు నాకు ఉల్బణముగా నున్నది. మరి నీవు ఎంత విచారించినను ఆ యాదవుడు మన కొంపలకు రాడు. వానికి తగినశాస్తి చేసితిని. వాని యందమునుచూచి నీవు సమ్మోహితవగుచుంటివి. అది నాకు ఇష్టము కాదు. అతడు నిన్ను భగిని అనినాడుకదా! మరి నిన్ను చూచినచో అతనియందు విరహముతో కొట్టుకొని పోవుచున్నట్లు కన్పించుచున్నావు. విచిత్రమేమనగా కొందరు మగవారికిగూడ నతనిని చూచినయట్లే యుండునట! అతనివెంట రాలేదుగాని, సాందీపని యాశ్రమమున మరియు ఇద్దరు యాదవులున్నారు. ఉద్ధవుడని; సాత్యకియని. అందులో ఉద్ధవుడుగూడ ఈ శ్రీకృష్ణయాదవుని స్త్రీవలె ప్రేమించుచున్నట్లు విన్నాను. ఇది యేమో విచిత్రము."

అని పౌండ్రకుడు నవ్వినాడు. సుదక్షిణ అన్నది:

"స్వామి! తమరు ఎప్పుడైనా తమ యాత్మను చూచుకొన్నారా ?"

"ప్రతిదినమును చూచుకొనుచునే యున్నాను."

"అవును పగటి వేషమును గూడ కట్టుచున్నారు! తమకు ఆ వేషములు వేయుటతక్క మరియొక్కటి తెలియదు. నా కెందుకు? నేను పోవుచున్నాను."

సుదక్షిణ బయలుదేరినది. అంతకుముందే తండ్రి కబురుపంపియుండెను. ఇంతలో ఈయన ఇట్లు వచ్చెను. ఇట్లు మాట్లాడెను. ఆమెకు అతని మనస్సే విచిత్రమనిపించినది. శ్రీకృష్ణదేవుని చూచినచో ఈయనకు ఈ భయమెందులకో! భగవంతుడు తన్ను రక్షించినాడు. సుదక్షిణ తనతో అట్లు మాట్లాడిపోవుటను చూడగా పౌండ్రకుడు నిజముగా విచారపడినాడు. అతని శృంగారపరమగు సంభాషణయంతయు వ్యర్థమైనదనుకొనినాడు. అసలు తన ఆమాటలేమిటి? తానేల ఎందుల కట్లు మాటాడవలయును? ఆమె తన్ను సరిగా గౌరవించుటలేదు. ఇప్పుడే ఇట్లున్నది. పెండ్లియైనతరువాత నింకెట్లుండునో! ఆమె కన్పించినంతమేర పౌండ్రకు డామెవంక చూచుచునే నిలుచుండిపోయినాడు. తరువాత నామెచెలులదిక్కు ఇట్లనినాడు; "మీ స్వామిని, ఈ దినముననైనను నాతో స్వయముగా మాటాడినది. అందులకు సంతోషము పొందినామని చెప్పుడు." అని తానును కదిలిపోయినాడు.

సుదక్షిణ మహారాజుమందిరములకు చేరుకొనగా, ఆయన ఆమెను చూచి ఒక్క నిట్టూర్పు విడిచినాడు. పూర్వము సుదక్షిణ వేరు. ఇప్పుడు సుదక్షిణ వేరు అనుకొనినాడు. ఒక్కొక్క అనుభవము ఒక్కొక్క జీవితో ఎటువంటిమార్పును తెచ్చిపెట్టును. శ్రీకృష్ణ వాసుదేవుడు భిక్షకు వచ్చునని, ఆ భిక్షను తాను ఆయనకు ఇడవలయునని తల్లి ఎంతగా సంబరముపడినది! ఆ సంబరమంతయు అంబరమువలె శూన్యమైనది. దాని స్థానమున [illegible]ము, దుఃఖముతోడి అవమానమును మిగిలినవి. ఆ మహారాజునకు ఆమెను చూడగా దుఃఖము కల్గినది.

"తల్లీ" అని ఆయన ఆమెను సంబోధించినాడు. సంబోధనము గాద్గద్యముతో నిండిపోయినది. ఆయన కన్నులలో నీరు నిల్చినది. సుదక్షిణ అవనతముఖియై నిలిచినది నిల్చినట్లే యున్నది. ఆమె మాటాడలేదు. మహారాజు మరల నామెను తల్లీ! యని సంబోధించినాడు. ఇట్లనినాడు.

"తల్లీ! నేను నీకు బహుధా అపచారముచేసినాను. ఏది ఏమగునో ఎవ్వనికి తెలియును. పౌండ్రకు డిట్టులగునని నేను అనుకొనలేదు. ఇప్పుడు విచారించి లాభమునులేదు. నీవు విచారించకు. శ్రీ కృష్ణ వాసుదేవు డట్లు జరిగినదని యేమియు ననుకొని యుండడు. నిత్యము మందహాసముచేయు నతనికి కోపమనునది యెక్కడ నున్నదమ్మా! మరియు నతనికి అవమానమేమిటి? అతడే సర్వమును అయినవాడు. వానికి మానావమానము లుండునా! విచిత్రమేమనగా, అవమానముచేయుటగూడా నాతనిని చేరు మార్గములలో నొక్కటియని చెప్పగా విని నాను. శ్రీకృష్ణవాసుదేవునకు ఒక్క మేనయత్త కొడుకు కలడు. వానిపేరు శిశుపాలుడు. అతడును శ్రీకృష్ణుని యవమానపరుచుచుండునట! మరి శ్రీకృష్ణుడేమి చేయును. నీకు వరము నిచ్చినట్లే ఆమేనయత్తకుగూడ నొక వరము నిచ్చెను. అటు శిశుపాలుడును, ఇటు పౌండ్రకుడును. ఈ పౌండ్రకుని నేను అల్లునిగా నిర్ణయించుకొంటిని... ..."

సుదక్షిణ మాటాడలేదు. రాజు మరియు నిట్లు అనినాడు:

"తల్లీ! నేను ఇక ఎంతయోకాలము బ్రతుకను. నేను నిన్ను అతనిచేతిలో పెట్టి, సుఖముగనో, అసుఖముగనో దీర్ఘనిద్రకు పూనిక వహించెదను. నేను నీళులలో నిండుగా మునిగినవాడను. నాకు చలి యన్నదిలేదు. అది యంతయు నీయందు నివిష్టము చేసి పోవుచున్నాను. నేను తప్పుచేయుచున్నానా? అది భగవంతునకు తెలియవలయును. ఇప్పుడైనను నీవు కాదు అనుము. పౌండ్రకుని తిరస్కరించెదను. ఈ ముదుసలి ఎప్పుడో ఎవరికో ఇచ్చిన మాటను నీవు పాలించవలయునవసర మేమియున్నది......"

సుదక్షిణ మాటాడలేదు. మహారాజు మరల ఇట్లు అనినాడు:

"తల్లీ! నీ మనసు నేను ఎఱుంగుదును. నీవు నన్ను నరకమునకు త్రోయుచున్నావు. నీవు త్రోయుట యేమిటి? నన్ను కన్న తల్లివి. నన్ను నేనే త్రోసి కొనినాను. నిన్నును త్రోసినాను. నేనేల నాయన్న మాటను కాదనరాదు. ఆ శక్తిని భగవంతుడు నాకు ప్రసాదించలేదు. నేను వట్టి దుర్బలుడను. దశరథునివంటివాడను. అతడు కుమారునకు ద్రోహము చేసెను. నేను కూతురకు నీకు, ద్రోహము చేసినది.ఇది యే

—53వ పేజీ చూడండి

మనము - మన దేహస్థితి

డా॥ గాలి బాలసుందరరావు

ఫ్యాక్టరీ : లివరు

గతవ్యాసంలో ఇలియం మ్యూకస్ పొరలో ఉన్న 'విల్లస్సులు' అనే నిర్మితులద్వారా వివిధ ఆహారపదార్థములు ఎల్లా పోర్టల్ వెయిన్‌లోకి పోయేదీ తెలుసుకున్నాము.

పోర్టల్ వెయిను, లివరు శరీరంలో. ప్రవేశించి శాఖోపశాఖలుగా చీలి, లివరులో భాగములయిన లోబ్యూలులను చుట్టి ఉంటుందనికూడా తెలుసుకున్నాము. అంటే, లివరులో చిన్న చిన్న భాగములన్నీ, పోర్టల్ వెయిను రక్తంలో పానకంలో గులాబ్ జామ్ లాగా తడుస్తూ ఉంటవన్నమాట.

ఇప్పుడు లివరులోకి వచ్చిన ఆహారపదార్థములను లివరు ఏం చేస్తుందో తెలుసుకుందాము. ముందు శర్కరా ద్రవ్యములసంగతి విచారిద్దాము.

శర్కరలు చాలా రకములు. పిండిపదార్థములనుంచి వచ్చే శర్కరలు, పాలనుంచి వచ్చే శర్కరలు, పళ్ల నుంచి వచ్చే శర్కరలు. ఇల్లా ఎన్నోరకములయిన శర్కర లున్నవి. అన్నింటిలోను కార్బను, హైడ్రోజను, ఆక్సిజను అణువులు 6:12:6 నిష్పత్తిలో చేరి ఒక శర్కరాకణము (Molecule) తయారవుతుంది.

పోర్టల్ వెయినులోకి వచ్చే శర్కరలో (Carbohydrates) మాటికి 80 పాళ్లు 'గ్లూకోజు'. ఇది ఎక్కువగా పిండిపదార్థములు జీర్ణములయినందున ఏర్పడుతుంది. మిగతా ఫలశర్కర (Fructose) క్షీరశర్కర (Lactose) రక్తంలో ప్రవేశించగానే, శీఘ్రకాలంలోనే గ్లూకోజుగా మారిపోతవి. వీటిని ఈవిధంగా మార్చగల ఎంజయిములు మెదడులోనూ, కండరములలోనూ, లివరులోనూ ఉండే జీవకణములలో విరివిగా ఉన్నవి. ఈవిధంగా మారిపోయిన ఫలశర్కరను, గ్లూకోజులాగే శరీరంలో జీవకణములు ఉపయోగించుకోగలవు.

ఈవిధంగా లివరులో తయారైన గ్లూకోజు అంతా రక్తంతో ప్రవేశించి వివిధభాగములకు పోదు. కొంత రూపాంతరం పొంది నిలవ ఉంటుంది.

శరీరంలో నిత్యమూ ఏదో 'పని' జరుగుతూనే ఉంటుంది. శరీరంలో ప్రతి జీవకణమునూ ఒక చిన్న ఫ్యాక్టరీతో పోల్చవచ్చును. శరీరంలో ధాతువులు (Tissues) ఆక్సిజను సంపర్కంవల్ల దగ్ధములైనందున, శరీరకార్యక్రమమునకు కావలసిన 'శక్తి' పుడుతున్నదని ఇదివరకే తెలుసుకున్నాము. ఇల్లా నిత్యమూ ధాతువులలో జీవకణములు దగ్ధములౌతూ ఉంటే ఆ భాగము శుష్కించిపోవాలి గదా ? అల్లా జరగదు. ఒకప్రక్కనుంచి ధాతుదహనం జరుగుతూ ఉంటే మరొకప్రక్కనుంచి జీవాణువుల నిర్మాణం సాగుతూనే ఉంటుంది. ధాతు దహనమును ఇంగ్లీషులో "కేటాబాలిజం" (Katabolism) అంటారు. ధాతునిర్మాణమును "ఏనాబాలిజం" (Anabolism) అంటారు. ఈ రెండు కార్యముల ఫలితమును "మెటాబాలిజం" (Metabolism) అంటారు. మెటాబాలిజం, జీవితానికి ప్రధానలక్షణము. కేటాబాలిజం అధికమైతే శరీరం శుష్కించిపోతుంది. ఏనాబాలిజం అధికమైతే శరీరం పెరిగిపోయి, స్థౌల్యం ఏర్పడుతుంది. ఈ రెండు కార్యక్రమములు స్వస్థములుగా ఉండవలసిన రీతిలో ఉన్నప్పుడు శరీరభారం నిలకడగా ఉంటుంది. ఎదిగే పిల్లలలోనూ టైఫాయిడ్, క్షయవంటి వ్యాధులనుంచి తేరుకుంటున్న వారిలోను, ఏనాబాలిజం కొంతకాలం అధికంగా ఉంటుంది. థైరాయిడ్ గ్రంధి స్పందనం అధికమైనప్పుడు, వృద్ధాప్యంలోనూ, మధుమేహం వంటి వ్యాధులలోనూ కేటాబాలిజం అధికంగా ఉండి శరీరం శుష్కిస్తుంది. కాని ఆరోగ్యవంతులయిన, మధ్యవయస్కుల్లో ఈ రెండూ సమానంగానే ఉంటవి. ఈ కార్యక్రమం సాగడానికి ఆహారపదార్థములూ, ఆక్సిజనూ కావాలి. ఈ రెండు వస్తువులూ రక్తంద్వారా, శరీరంలో ప్రతి జీవాణువుకూ చేరుతూ ఉంటవి.

శరీరంలో మెదడూ, హృదయమూ ఒక్క గ్లూకోజునుమాత్రమే వినియోగించుకుని పని చేయగలవు. అందువల్ల ఎవరూ కేవలం మాంసాహారులై జీవించలేరు.

శరీర కార్యక్రమం సరిగా సాగడానికి రక్తంలో కొంత గ్లూకోజు విధిగా ఉండితీరాలి. ప్రతి నూరు ఘనసెంటీమీటర్ల రక్తంలోనూ 90 మిల్లిగ్రాముల గ్లూకోజు ఉండితీరాలి. ఏకారణంచేతనయినా రక్తంలో, ఈ గ్లూకోజు పరిమాణం ఇంతకన్నా తగ్గిపోయినప్పుడు హృదయమూ, మెదడూ, ఇతర అవయవములూ సరిగా పనిచేయలేవు. అప్పుడు దుర్భరమైన ఆరాటం, ఆందోళన ఏర్పడుతవి. దాహం అధికమవుతుంది. మృత్యువు ఆసన్నమవుతున్నట్లు తోస్తుంది. మధుమేహంతో బాధపడేవారు, కావలసిన మోతాదుకన్న అధికంగా 'ఇన్సులిన్' అనే ఔషధమును తీసుకున్నప్పుడు రక్తంలో గ్లూకోజు పరిమాణం తగ్గి ఈస్థితి తరుచు ఏర్పడుతూ ఉంటుంది. అప్పుడు వెంటనే పంచదారో, గ్లూకోజో తీసుకుని, నీరు త్రాగితే ఆ ఆరాటం తగ్గిపోతుంది. సకాలంలో ఈ పని జరగకపోతే ప్రాణమోపమే కలగవచ్చును కూడా.

రక్తంలో గ్లూకోజు పరిమాణం ఎప్పుడూ ఒకమాదిరిగానే ఉండదు. భోజనంచేసిన కొద్దికాలానికి రక్తంలో గ్లూకోజు పరిమాణం ప్రతి నూరు ఘనసెంటీమీటర్లకు 120 నుండి 130 మిల్లిగ్రాములవరకూ పెరగవచ్చును. రక్తంలో ఉండే గ్లూకోజు పరిమాణమును నిర్ణయించే కారణములు రెండు. (1) లివరు. (2) గ్లూకోజును దహించగల ఇన్సులిన్ వంటి హార్మోనులను ఉత్పత్తిచేసే గ్రంధులు.

ఆహారం తీసుకున్న కొంచెంసేపటికి రక్తంలో ఉన్న గ్లూకోజు పరిమాణం 130 మిల్లిగ్రాముల వరకు పెరుగుతుందని తెలుసుకున్నాముగదా ? అది మళ్లీ 90 మిల్లిగ్రాముల పరిమితికి ఎల్లా వస్తుంది ?

లివరులో జీవాణువులు, క్షీర, ఫలశర్కరలను గ్లూకోజుగా మార్చడమే కాకుండా, గ్లూకోజును గ్లయికోజన్ (Glycogen) అనే వస్తువుగా కూడా మార్చివేస్తవి. ఇంతేకాదు. ఆ విధంగా తయారయిన గ్లయికోజనును తమలో దాచివుంచగల శక్తి లివరులో ఉన్న జీవకణములకు ఉన్నది. వాటికి ఇతర ఆహార పదార్థములలో ఉన్న వస్తువులను సేకరించి గ్లూకోజుగా 'కల్పము' (Synthesis) చేయగల శక్తి ఉన్నది. గ్లయికోజనుగా మార్చగా మిగిలిన శర్కరలను కొవ్వు పదార్ధములుగా మార్చగల శక్తికూడా లివరులో జీవకణములకు ఉన్నది.

చిన్నప్రేగులోనుంచి ఆహరించబడి, పోర్టల్ వెయిన్ గుండా లివరులోకి వచ్చిన గ్లూకోజులో సగానికి పైగా గ్లయికోజనుగా మారి లివరులో నిలవ వుంచబడుతుంది. రెండు భోజనములకు మధ్యకాలంలో రక్తంలో ఉన్న గ్లూకోజు పరిమాణం తగ్గినప్పుడు, లివరు తనలో ఉన్న గ్లయికోజనును మళ్లీ గ్లూకోజుగా మార్చి రక్తంలోకి పంపుతుంది. ఈవిధంగా లివరు రక్తంలో గ్లూకోజు పరిమాణం అత్యధికం కాకుండా అత్యల్పం కాకుండా ఒక నిర్దిష్టమైన స్థాయిలో ఉంచుతుంది.

ఏ కారణంచేత నయినా లివరులో జీవకణములు అధికంగా వ్యాధిగ్రస్తములయి, యీ విధిని నిర్వహించలేనప్పుడు, ఆహారానంతరం, రక్తంలో ఉండే గ్లూకోజు పరిమాణం, ప్రతి నూరు ఘన సెంటీమీటర్లకు 180 నుండి 200 మిల్లిగ్రాముల దాకా పెరిగిపోవచ్చును. ఇంతేకాదు. లివరు వ్యాధిగ్రస్తమై తన విధులను నిర్వర్తించలేనప్పుడు ఉపవాసములు చేసినా, కఠినమైన దేహ పరిశ్రమ చేసినా, రక్తంలో గ్లూకోజు పరిమాణం శీఘ్రంగా పడిపోయి ఆరాటమూ, మైకమూ సంభవిస్తవి. ఇందుకనే కామెర్లు, లివరులో బల్ల వంటి లివరు వ్యాధులతో బాధపడేవారు ఉపవాసములు చేయరాదు. దేహపరిశ్రమ చేయకూడదు.

గ్లూకోజు గ్లయికోజనుగానూ, గ్లయికోజను గ్లూకోజుగానూ మారిపోవడానికిగాను కారణం ఒక ఎంజయము. తనుగా ఏ మార్పు చెందకుండా తన సంపర్కం కలిగిన వస్తువులను రసాయనికంగా మార్చివేయగల శక్తి ఉన్న వస్తువులను ఎంజయము అంటారు.

ప్యాంక్రియస్ నిర్మితినీ, ధర్మములనూ వివరిస్తున్నప్పుడు, అందులో ఒక రకమైన జీవకణములు

55—వ పేజీ చూడండి

కవి సార్వభౌముడు

నోరి నరసింహ శాస్త్రి



జరిగిన కథ

పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథభట్టును శ్రీ విద్యానగరమునకు విద్యావిజయప్రస్థానము చేయవలసిందని అర్థిస్తాడు. శ్రీనాథుడు విద్యానగరం చేరాడు. తనను జయించేందుకే శ్రీనాథుడు వచ్చాడన్న వార్త డిండిములకు తెలుస్తుంది. శ్రీనాథుడు మానసోల్లాస కావ్యాన్ని అభిప్రాయార్థం అరుణగిరినాథులకు పంపుతాడు. డిండిముడా కావ్యాన్ని అవహేళన చేస్తాడు. శ్రీనాథుడు డిండిములకు మానసోల్లాస కావ్యావహేళనంపై అధిక్షేపణపత్రం పంపుతూ కావ్యదోషాలు పండిత పరిషత్తులో నిరూపించమని డిండిమునికి సవాలు చేస్తాడు. శ్రీదేవరాయ ప్రభువుల సమక్షంలో పండిత పరిషత్తు మానసోల్లాస కావ్యం దోషరహితమని నిర్ణయించగా, ప్రతిన ప్రకారం శ్రీనాథుడు అరుణగిరినాథుల డిండిమమును నాశనం చేయిస్తాడు. దేవరాయలు శ్రీనాథుని పాండితీ గరిమను గుర్తించి, విద్యానగరాస్థానంలో తెలుగు భాషకు గణనీయస్థానం ఇస్తున్నట్లు ప్రకటిస్తాడు.

దక్షిణాధీశ్వరుని ముత్యాలశాలలో శ్రీనాథభట్టుకు కనకాభిషేక సన్నాహములు కావించిరి. దేవరాయలు సింహాసన మధిష్ఠించెను. రాయల సమ్ముఖమున ఐదు విండ్ల దూరమున, ముత్యాలముగ్గులు తీర్చిన మండపముపై ఆసంది (అభిషేకమునకువేయు మంచమువంటి పవిత్రాసనము) వేసిరి. ఆ మండపమునకు మూడు వైపుల బారున మెట్లు కలవు. దాని ప్రక్క మరియొక మండపముపై దీనారటంకాలు రాశిపోసియున్నవి. అభిషేకలగ్నమునకు గడియ ముందుగా సభాపతి దేవరాయల యనుజ్ఞగొని శ్రీనాథుని తోడుకొనివచ్చి ఆసందిపై వాసీనుని గావించెను. స్వస్తివాచనమైనది. సభాపతియు రాజపురోహితుడును సుబ్రహ్మణ్యశ్రోత్రిని కలుపుకొని శ్రీనాథభట్టారకుల సామ్రాజ్యాభిషేకమునకు సంకల్పముచేసి, ఐదు బంగారు కలశములతో సామ్రాజ్యదేవతను ఆవాహన మొనర్చిరి. లగ్నవేళ సమీపింపగానే, "కవిసార్వభౌమ శ్రీనాథభట్టః" అనునక్షరములు నవరత్నములతో మనోజ్ఞముగా పొదిగియున్న కనకపట్టము శ్రీనాథభట్టు ఫాలభాగమున రాజపురోహితుడు కట్టెను. విద్యాధికారి అరుణగిరినాథ డిండిమభట్టును ప్రాడ్వివాకుడు చంద్రభూషక్రియాశక్తియు పరిషత్సభ్యులు పదిమందియు, సామ్రాజ్యకలశోదకములు ప్రోక్షించిన దీనారటంకాలు తమ దోసిళ్లతో గ్రహించి, శ్రీనాథుడున్న మండపమునకు మూడు ప్రక్కలగల మెట్లపై సిద్ధముగా నిలుచుండిరి. శ్రీనాథుడు లేచి రాజపురోహితునకును, సభాపతికిని, సుబ్రహ్మణ్యశ్రోత్రికిని పాదాభివందన మాచరించి మరల నాసందిపై గూర్చుండెను.

లగ్నవేళ సూచించు శంఖారావము మ్రోయుచుండగనే రాజపురోహితుడు దోసెడు టంకాలు దేవరాయప్రభువుకడకు కొంపోయి, తన దోసిలిని స్పృశింపజేసికొని శీఘ్రముగా వచ్చి శ్రీనాథుని ముందు నిలిచి సామ్రాజ్యమంత్రము ఓంకార పురస్సరముగా నందుకొని తన దోసిలిలోని దీనారములతో శ్రీనాథు నభిషేకించెను. సభాపతియు సుబ్రహ్మణ్యశ్రోత్రియు తక్కినవారును పురోహితునితోబాటు సామ్రాజ్యమునందుకొని, దీనారటంకాల నభిషేకించిరి. ఆతర్వాత పరిషత్సభ్యులు ఖాళీచేసిన మెట్లనీదికి శతవధానసభలో పృచ్ఛకులుగానున్న నూటయెనిమిదిమందియు పదులు పండ్రెండ్లుగా వచ్చి దోసిళ్లతో రాశిలోని దీనారటంకాలు తీసికొని సామ్రాజ్య మంత్రశ్రుతికి తోడుపలుకుచు నభిషేకించిరి.

—47వ పేజీ చూడండి

నేటి స్త్రీల సమస్యలు

ఈనాటి సమాజంలో మధ్యతరగతి స్త్రీలను గురించి ఒక్కసారి ఆలోచిస్తే "ఆడదై పుట్టేకంటే అడవిలో మానై పుట్టటం నయం" అన్న పెద్దల సామెతలో ఎంత సత్యంఉన్నదో అర్థమవుతుంది. సమాజంలో మూడు రకాల మనుష్యులు. వారు ఒకటి గొప్పవారు, రెండు మధ్యతరగతివారు, మూడు లేనివారు. గొప్పవారు కొందరగా ఏపని చేయటానికైనా సాహసిస్తారు, వారు లోకుల మాటలను లెక్కచేయరు. లోకులు గొప్పవారిని విమర్శించలేరు. కారణం ధనం. ఇక లేనివారు, వీరికి పొట్టగడవటం ముఖ్యం కాని లోకులమాటలు కాదు. మిగిలిందల్లా మధ్యతరగతివారు. వీరు లోకులను ఎదిరించలేరు. వారికి అనుగుణంగా నడవనూలేరు. వీరిబాధ వర్ణనాతీతం.

మధ్యతరగతివారింటిలో ఆడపిల్ల జీవితం "అమ్మాబాబోయ్! ఆడపిల్లే!" అనేమాటతో మొదలవుతుంది. వారి చిన్నతనమంతా కాస్త తేలికగానే గడుస్తుంది. 14, 15 ఏళ్ళనుండి వివాహం అయ్యేదాక వారి జీవితం బాధల అధ్యాయంలో ఉంటుంది. వివాహం అయినాక ఏదోవిధంగా తేలికగానే (వారినేర్పునుబట్టి) సంసారం సాగిపోతుంది. బాధల అధ్యాయంలో ఈ ఆడపిల్లల బాధలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది.

మధ్యతరగతి కుటుంబీకునికి సాధారణంగా పిల్లలెక్కువ ఉంటుంటారు. అందులో పరీక్షించటానికా అన్నట్టు ఎక్కువశాతం ఆడపిల్లలది. ఈ తీరు చూస్తుంటే దేవుడనేవాడు ఒకడుంటే వాడికికూడా మధ్య తరగతి కుటుంబీకుడే లోకువేమో ననిపిస్తుంది. లోకులకు సరేసరి. వారికాలక్షేపానికి మధ్యతరగతి కుటుంబీకుడు ఒక వస్తువు. ఈ తండ్రి ఆడపిల్లలకి చదువు చెప్పిస్తాడు. తన కిష్టంఉన్నా లేకపోయినా రాబోయే వరుడి కోసమైనా చెప్పిస్తాడు. అప్పటిదాకా వ్యవహారం సాఫీగానే నడుస్తుంది. అప్పటికి ఆ ఆడపిల్లకి 15, 16 ఏళ్ళు వచ్చిఉంటాయి. అంటే బాధల అధ్యాయంలో అడుగు పెట్టిందన్నమాట. ఇక ఆ తండ్రి పై చదువులు చదివించటానికి అసమర్థుడు. అందుకని వరాన్వేషణ ప్రారంభిస్తాడు. పిల్లని సంతలో పశువుని పరీక్షించినట్టు పరీక్షించి వరునివైపు వారు తేల్చేదేమిటంటే "పిల్లబాగానేఉంది. కనీసం ఐదువేలిస్తే బాగుండును." వారిఉద్దేశ్యంలో. పట్టభద్రుడు మాత్రమే అయి ఉద్యోగాన్వేషణలో ఉన్న తమపుత్రునికి ఐదువేలు చాల తక్కువని, కాని రెండువేలైనా అప్పుచేయందే తేలని తండ్రికి ఐదువేలంటే ఎంత బాధో ఆలోచించరు. ఈ విధంగా వరాన్వేషణలో ఉండగానే కాలచక్రం, నాలుగాకులు ముందుకు నడుస్తుంది. అప్పటికి ఇరుగు పొరుగమ్మల ప్రశ్నావళులు పెరుగుతాయి. తలిదండ్రుల బాధ ఇనుమడిస్తుంది. అమ్మాయి పెద్దదనేవంకతో కట్నాల రేటు పెరుగుతుంది. ఇవన్నీ అప్పుడే హృదయం పరిపక్వమౌతున్న కన్య చూస్తుంటుంది. తనకోసం తలిదండ్రులుపడే బాధచూస్తుంటే ఏ కన్యహృదయం వ్యథచెందదు?

పోనీ, అంత కట్నం ఇవ్వలేని తండ్రి ఎటూ స్కూల్ ఫైనల్‌దాకా చదివించాడు కాబట్టి ఏ టైపో, ట్రెయినింగో తన కందుబాటులో ఉన్న కోర్సుచదివించి ఉద్యోగం చేయించవచ్చుగదా! తనకీ సంసారనిర్వహణలో తోడుగా ఉంటుంది. ఏనాటికో తనకినచ్చిన వరుణ్ణి కట్నంలేకుండానే చేసుకుంటుంది. అంతగా ఆమె సంపాదన తినటం తనకిష్టం లేకపోతే ఆ డబ్బంతా ఏం బ్యాంక్‌లోనో వేసి సరిపడధనం పోగైనాక ఆమె వివాహంచెయ్యవచ్చు గదా! కానీ ఇవన్నీ ఆతండ్రికి ఇష్టం ఉండవు. "ఛీ, ఛీ! మావంశంలో ఇప్పటిదాకా ఆడవాళ్ళు ఉద్యోగం చేయలేదు. ఇప్పుడుకూడా అది పనికి రాదంటాడా తండ్రి.

ఒకవేళ తండ్రి ధైర్యంచేసి ఉద్యోగం చేయించినా లోకులు మామూలుగా ఊరుకోరు. "ఏమమ్మా! మీ అమ్మాయి ఉద్యోగం చేస్తుందటగా, అయినా ఆడపిల్లలతో ఉద్యోగం చేయించటం ఏం మంచి దమ్మా" అని తల్లితో ప్రత్యక్షంగా అని పరోక్షంగా తల్లికి వినిపించేటట్టు, పిల్లఎవరితోనో అత్యవసరమైన పని ఉండి మాట్లాడటం చూసి, "ఏమోనమ్మా, ఏం పోయే కాలమొచ్చిందో ఆడదానితో ఉద్యోగం చేయిస్తే దాని బుద్ధి సరిగ్గా ఉంటుందీ, మొన్న అది ఆ రామారావుగాడితో ఒకటే పకపకలు, వికవికలు అంటూ నాల్గు కల్పించి ప్రచారం చేస్తారు. ఇంట్లో తమ కూతురు నిజంగానే పరాయివాడితో సరసాలాడుతుంటే పట్టించుకోని అమ్మలక్కలు, పాపం వాళ్ళెంత బాధ పడుతున్నారో, ఎందుకు ఉద్యోగం చేయిస్తున్నారో, పిల్లపెళ్ళికి ఎన్ని అవస్థలు పడ్తున్నారో ఆలోచించరు. అప్పుడు తల్లి దండ్రులుగాని, ఆ స్త్రీగాని ఎంత బాధపడ్తుంది. ఇక తల్లి దండ్రు లేంచేయలేక "దీమూలంగానే మాకిన్ని కష్టాలొచ్చా" యంటూ హింసించటం మొదలు పెడ్తారు. కన్న తల్లిదండ్రులు హింసిస్తే ఇక ఆమెగతేమిటి?

కొన్నాళ్ళకి అమ్మాయి పెళ్ళివిషయం అడుగున పడుతుంది. అమ్మలక్కలమాటలు అలవాటయి పోతాయి. ఏదో అమ్మాయి ఉద్యోగంచేస్తుందికదా, ఇక దానిసంగతి అది చూసుకుంటుందిలెమ్మని మిగిలిన పిల్లల పెళ్ళిప్రయత్నాలు మొదలుపెడతారు. పోనీ ఆమెకు నచ్చినవాణ్ణి పెళ్ళిచేసుకోనీయరు. ఇప్పుడుకూడా వీరు కట్నం ఇయ్యలేనివారే. ఎటూ అమ్మాయి ఉద్యోగంచేస్తుందికదా, కట్నం అక్కరలేనివాడెవ్వడైనా అడిగేవరకుంటుంది లెమ్మనుకుంటారు. ఒకవేళ ఎవరయినా కట్నంలేకుండా ఒప్పుకున్నా అన్యకులస్థులు, అన్యశాఖవారు పనికి రారు. తమశాఖవారే కావాలి. వర్ణాంతర వివాహం సంగతటుంచి, శాఖాంతర వివాహానికికూడా ఒప్పుకోరు పెద్దలు. అప్పటికే యుక్తవయస్సు వచ్చిన ఆ స్త్రీకికూడా కోర్కెలుంటాయని, ఆమె గృహిణి కావాలని, మాతృమూర్తి కావాలని కోరుతుందని వారు తలచరు. వాళ్ళ నిబంధనలన్నీకుదిరి వరుడు దొరకటమే కష్టం. ఒకవేళ దొరికినా, బాగా వయస్సు ముదిరినవాడో, అంటే దగ్గరదగ్గర 40 ఏళ్ళ వాడో, రెండోపెళ్ళివాడో దొరకటం తధ్యం. కోర్కెలుడిగిపోయివున్న వారి సంసారం తాబేటి నడకల్లే ఉంటుంది.

ఈ బాధలన్నిటికీ ముఖ్యకారణం పెద్దలు తెగువచేయలేక పోవటమే. వారు లోకాన్ని ఎదిరించలేరు. సనాతనాచారాల్ని ఒదిలిపెట్టి కాలానుగుణంగా నడవలేరు. ఒకవేళ స్త్రీకి అభ్యుదయభావాలున్నా అవిసాగవు. తండ్రిని ఎదిరించి స్త్రీ ఎక్కడికి పోగలదు. ఈ నాటిసమాజం స్త్రీని ఒంటరిగా నిలువనీయదు. అంటే పూర్తిగా సమాజంమారితే కాని మధ్యతరగతి స్త్రీలబాధలు తగ్గి వారు సుఖజీవనం చేయలేరు. ఏనాటికో ఈ సమాజం మారటం! మనమంతా సమాజంలోని వాళ్ళమే కాబట్టి మనం మారితే సమాజం దానంతటదే మారుతుంది. ★



వనితా వాణి

మీరేం చేస్తున్నారు ?

స్త్రీలే స్త్రీ జాతిని కించపరచడం చాల అసభ్యం.

మరువాడ సూర్యకుమారి (నరసన్నపేట)

* * *

ప్రతి స్త్రీకి ఎదటివారిని చూచి ఓర్వలేనితనం వుంటుందేమో ! అందులోను చదువుకుని ఉద్యోగం చేస్తుంటే ప్రతివారికి హీనంగా కనబడుతుందేమో! ఇటువంటి విమర్శచేసేవారిదగ్గరకు వస్తే తగువేవుండదు. వీలయినంతవరకు స్త్రీ ఉద్యోగంచేసి సంపాదిస్తే వేడి నీళ్లకు చన్నీళ్లు కలుపుకొన్నట్టు వుంటుంది. అనుకొనేవారి మాటలు లెక్క చేయకుండా మన పని మనం చేసుకుంటే మంచిది.

ఎమ్. సరోజ (గోపన్నపాలెం)

* * *

వ్యాసంలోని విషయాలన్నీ అక్షరాలా నిజం. ఎందరో స్త్రీలు ఈ విధమైన విమర్శలకు గురవుతున్నారంటే అతిశయోక్తిలేదు. పెళ్ళికానిపిల్లలు వీరు అడిగే ప్రశ్నలకి, విమర్శలకి గురౌతున్నారు. వారు మనస్సులో బాధపడుతూంటారు. దురుసురకమైతే ముఖమెదురుగానే చడేలున సమాధానం చెపుతారు.

రాజామణి (రాంభద్రునిపల్లి)

* * *

ఈరోజుల్లో ఎక్కడ చూసినా చదువుకున్నవారు ఉద్యోగాలుచేసేవారు స్త్రీలలో కనిపిస్తున్నారు. పల్లెటూరిలో ఎవరయినా అమ్మాయి ఉద్యోగంచేసిందంటే మూతి మూడువంకరలు తిప్పుతూ, గుసగుసలు చెప్పుకునేవారు ఉన్నారు. ఇటువంటివారు ఎంతత్వరగా మారితే సంఘానికి అంత మంచిది. వ. ని. త. గారి 'మీరేం చేస్తున్నారు' వ్యాసం స్వానుభవంమీద రాసినట్లుంది. ఈ వ్యాసం చదివి కొందరు విద్యార్థులన్నా మారి తోటి విద్యార్థినులను సోదరీభావంతో చూస్తారని ఆశిస్తున్నాను.

శ్రీమతి పరిమి సీతాతిలకం (వాల్తేరు)

* * *

స్త్రీలు ఉద్యోగాలుచేయడం అనేది ఈ నవ నాగరికప్రపంచంలో సహజం. రోజూ నేను బస్సులో చూస్తుంటాము. ఎంతోమంది స్త్రీలు ఆఫీసులకు, స్కూళ్లకు, హాస్పిటల్సుకు వెళ్తుంటారు. నామటుకు నాకు ఉద్యోగం చేయటమనేది ఏమంత కష్టమైనవిషయం కాదు. మా సహోద్యోయిని ఇంటివద్ద పిల్లలను వదిలి సరిగ్గా స్కూలు టైముకు వస్తుంది. పిల్లలతో పదిగంటలకల్లా తెమలటం కష్టంఅని 'వాణి'గారు వ్రాశారుకాని, అది ఏమంత కష్టమయిన విషయం కాదేమో. రోజు ఎట్లాగైనా 9 గం.లకు వంటచేయుటం అలవాటైపోయె. కొంచెం ముందుగా లేచి వంటావార్పుచేసికొని ఆఫీసుకు పోవచ్చు. స్త్రీ ఉద్యోగం చేయటంవల్ల ఎంతో ఆర్థికలాభం ఆ కుటుంబానికి కలుగుతుంది.

స్నేహలతా దేశాయ్ (హైదరాబాదు)

* * *

చదువుకున్న పురుషులే అవివాహితురాలైన, ఉద్యోగము చేయుచున్న స్త్రీని చులకనగా చూస్తారు. ఇక పల్లెలలో విద్యాహీనులైన ప్రజలను అని లాభములేదు. స్త్రీ అన్ని రంగాలలోను శోభించాలంటే పురుషులు అందుకు సహకరించాలి.

కె. కుమారి అరుణ (పరిణి)

మన కుటుంబవ్యవస్థ

మన కుటుంబవ్యవస్థ అన్న వ్యాసం పి. కృష్ణకుమారిగారు చాలా బాగా వ్రాశారు.

కుమారి నిర్మల (విశాఖపట్నం)

* * *

పక్కింటి పిన్నిగారికిమల్లే కొడుకు, కోడలు సినిమాకి వెళ్లినా, కోడలు పెద్ద బొట్టు పెట్టుకున్నా అనుమానం సాధిస్తూ ఉంటే ఏ కోడలికి వేరే ఉండాలని అనిపించదూ! పైవిధంగా కాకుండా అత్తగార్లు, ఆడపడుచులు వారి సరదాలు వాళ్లవని వూరుకుంటే వేరే ఉండాలని ఏ కోడలూ కోరుకోదు.

కుమారి కె. లక్ష్మీప్రభ (ఏలూరు)

* * *

గుడి దూరమైన భక్తి ఎక్కువగు నన్నట్లు దూర దూరంగా ఉండి అత్త కోడండ్రు ఎప్పుడో నాల్గు దినములు కలిసిన అనురాగాభిమానముల ప్రదర్శన మాచోటు. అందున యితర ఖండ వాసుల హావభావముల సంబంధముతో మునిగి తేలుచున్న బహు సంతానవృద్ధి గల్గి, స్వల్పార్థ లాభ మొందు ఈ కాలములో విడివిడిగా ఉండి కుటుంబ గౌరవ మర్యాదల దక్కించుకొనుటయే శ్రేయస్సు. వలువుర తోడు లేనిదే మానవుడు మనజాలడు. గనుక దూరముగా నున్నను పరస్పర ప్రేమాభిమానముల రక్షించుకొనుచుండిన అవసరమునకు ఒకరికొకరు తోడగుదురు. ఏది ఎటులున్నను హిందూ సంస్కృతిని పాడొనరించరాదు—

చేరాల వేంకటరమణమ్మ (గుంటూరు)

* * *

పి. కృష్ణ కుమారిగారన్నట్లు : "కుటుంబములోని వ్యక్తులు సర్దుకుపోతే "ఉమ్మడి కుటుంబం" అంత శ్రేయస్కరమైనది—వేరే ఉండదు"— నిజమే మరి. "కలిసి ఉంటేనే కలదు సుఖం" అన్న సామెత ఉండనే ఉన్నదికదా.

ఆళ్లచెర్వు అన్నపూర్ణారంగయ్య (గుంతకల్లు)

* * *

నాకు పెండ్లయిన క్రొత్తలో మావారికి ఉద్యోగము లేక ఉమ్మడి కుటుంబములో ఉండేవాళ్లము. అప్పుడు అనేక మనస్పర్థలు వచ్చేవి. అవి మావారితో చెప్తితే ఓర్పుతో సర్దుకుపోవాలి అని చెప్పేవారు. తరువాత మావారికి ఉద్యోగము రావడము మేము వేరే ఊరు వెళ్లి, వేరే కాపురము పెట్టడము జరిగినది. ఐకమత్యము, స్నేహభావము, మమత, ఆప్యాయత లేని ఉమ్మడి సంసారాలలో ఉండేకన్న వేరే నరకం లేదు.

డి. ఎస్. రాణి (ఏలేశ్వరం)

* * *

పూర్వము సమిష్టి కుటుంబాలలో అత్తలు, కోడళ్లు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. నాగరికత అభివృద్ధి అయ్యే కొలది మానవులలో కూడ మార్పు వస్తున్నది. ఈనాటి తల్లిదండ్రులు తాము ఉమ్మడి కుటుంబములో సంతోషముగా ఉండి కూడా తమ కుమార్తెను ఉమ్మడి సంసారములో ఇచ్చుటకు భయపడుతున్నారు. రచయిత్రిగారన్నట్లు, అత్త, ఆడబడుచులు, కోడళ్లు, ఐకమత్యముతోను, సర్దుకుపోయేతనాన్ని అలవరుచుకొన్నట్లయిన అది యే కుటుంబము అయినను సుఖశాంతులతో వర్ధిల్లును.

డి. ఎస్. ప్రియదర్శిని (మద్రాసు)

* * *

మధ్యతరగతిమహిళల అవస్థలను గూర్చి ఇటీవల మన వనితావాణిద్వారా జరిగినచర్చలూ, విమర్శలూవల్ల, మొహంమొత్తింది. సోదరీమణులు అందరూ ఆ విషప్రస్తుతం మానివేసి మరేదైన స్త్రీలకు ఉపయోగపడే జీవితావసరాలను, పత్రికలద్వారా మహిళలకు తెలియజేయడం యోగ్యంగాఉంటుంది. ఎటూ మధ్యతరగతికుటుంబాలు అతుకుల బొంతల్లాగుంటాయని అందరికీ తెలిసినవిషయమే ! అదీగాక వారు అనగా మధ్యతరగతి వనితలు ఏ రంగాలలో ముందడుగు వేసినా వెనుక ఎవ్వో వారిని గూర్చిన తుఫాన్లు చెలరేగడం మామూలే. "ధైర్యం సర్వత్రా సాధనం" అని తమ జీవితాలను తాము బాగువర్చుకొవడానికి ప్రయత్నించడం మంచిదేగాని, దీన్ని గురించి చర్చలు తగ్గించితే బాగుంటుంది. ఉద్యోగాలుచేసే స్త్రీలకు, ఏలాగైనా ధైర్యం ఉండేతీరాలి. నిష్కారణమైన అభాండాలకు బెదరక తమబాగు తాము చూచుకోవడం ఎంతైనా మంచిది. బ్రతుకుతెరువుకొరకు ఉద్యోగాలు చేయడం ఎంత మాత్రం తప్పుకాదు.

కుమారి రాజ్యలక్ష్మి (హొసపేట) ★

డాక్టర్ రాజు

బొమ్మల కథ

దేవిక 13



తెరవెనుక

తారలు-3

మధుమూర్తి

"త్రైలోక్యమోహినీ మాయ– తెరపీద బొమ్మలాట" అని వింతగా సినిమాను చూసిన రోజులు 1913 నుంచి ప్రారంభమైనవి. భారతదేశానికి విదేశాల నుంచి దిగుమతిఅయిన ఈ చిత్రకళను నిజంగా ఎనిమిదోవింతగా ప్రజలు చూసేవారు. ఆరోజుల్లో దాన్ని మనవారు బైస్కోపు అని ముద్దుగా పిలిచేవారు. అవి మూగబొమ్మలు. తోలుబొమ్మలకు తమ్ముళ్లు.

భారతదేశంలో ఈ వింత 1907 నుంచే ప్రజానీకానికి కనుపించటం ప్రారంభించింది. తెలుగు దేశానికి 1921 నుంచి మాత్రమే బైస్కోపు చూపు ఏర్పడింది.

విదేశాలలో ముందుగా ఈ మూగపిల్లకు పలుకు అబ్బగానే చిత్రకన్య తలిదండ్రులు అత్యానందంతో చంకలెగరేస్తూ చప్పట్లు కొట్టారు, శబ్దం అనగానే సాహిత్యం, సంగీతం, నాట్యం అన్నీ స్ఫురిస్తాయి కనుక చప్పట్లకు తాళం చేర్చి అమెరికనులు "జాజ్ సింగర్" అనే తొలిపలుకుల పిల్లవాణ్ణి తయారు చేశారుట.

మూకీయుగంనుంచి టాకీయుగం ఆరంభమైంది. పాశ్చాత్యదేశాలలో మూకీకి షష్టిపూర్తి అయింది. కాని, భారతదేశంలో అది నాలుగుపదుల పడిలో పడింది. మన చిలకపలుకుల చలన చిత్రానికి వయసు మూడుపదులు క్రిందటేడే నిండినవి. తొలి హిందీ, తెలుగు, తమిళ చిత్రాలు పుట్టిన సంవత్సరం 1931. ఆ ఏడాదినుంచి భారతదేశం నాలుగు మూలలలోని ప్రజానీకానికి నిశ్శబ్ద చలనచిత్రాలు కాకుండా మాట్లాడే బొమ్మలచిత్రాలు అందుతూండేవి. అంటే ఇదొక కొత్త వ్యాపారం అని ఇందులోని శాఖలకు తెలుగువారు మెల్లమెల్లగా అడుగుపెట్టడం ప్రారంభించారు. మూడేళ్ల అనంతరం మదరాసు తెలుగు చలనచిత్రపరిశ్రమకు మక్కా మదీనా నగర ప్రాశస్త్యం సంపాదించుకుంది.

చలన చిత్రానికి శబ్దం ఒక సంపూర్ణత్వాన్ని అందించింది. ఒక విప్లవాన్ని కూడా ప్రారంభించింది; ఆ చైతన్య ఫలితమే తెలుగుగడ్డపై ప్రధాన పట్టణాల్లో టాకీ థియేటర్లు తలెత్తినవి. టాకీలు ఎక్కువగా నిర్మించబడుతూండేవి. నటులు, నటీమణులు నాటకరంగంనుంచి వెండితెరకు వెళ్లి వస్తూండడం, సాంకేతికనిపుణులు ఉదయించటం ప్రారంభమైంది.

తెలుగు చలనచిత్రచరిత్రకు సారధి వాహినీ సంస్థలు ఉదయించటంతో ఒక స్థిరత్వంతోబాటు, తెలుగుచిత్రానికి ప్రగతి, దానితోబాటు కీర్తి, కాంతా కనకాల సముపార్జనకు సదవకాశాలు, క్రొత్తరక్తం ఈరంగంలో అడుగుపెట్టడానికి మార్గం—ఇన్ని గొప్పలక్షణాలను అవి అందించిన వనటంలో సందేహంలేదు. అది 1938వ సంవత్సరం. గూడవల్లి రామబ్రహ్మం, మూలా నారాయణ స్వామిగార్లు ఆ సంస్థల స్థాపనకు కారకులు, కీర్తి శేషులు. నేడు తెలుగు చలనచిత్రపరిశ్రమ ఇంతటి వైభవంగా ఉండడానికి ఈ మూలపురుషులే కారణం.

మూలా నారాయణస్వామిగారు స్థాపించిన వాహినీ చిత్ర సంస్థ తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఆదర్శ ప్రాయంగా ఉంటూ, దినదినప్రవర్ధమాన మౌతూ వచ్చింది. శ్రీయుతులు బి. ఎన్. రెడ్డి, రామ్‌నాథ్, శేఖర్ అనే త్రిమూర్తులు సాంకేతిక శాఖలు మూడింటిలోనూ దిట్టలై వెలిశారు. శ్రీ బి. ఎన్. రెడ్డి దర్శకత్వం వహించేవారు; శ్రీ రామ్‌నాథ్ (కీర్తి శేషులు) ఛాయాగ్రాహకులు. శ్రీ శేఖర్ సౌండ్ ఇంజనీర్. తొలి తెలుగు శబ్దగ్రాహకులు ఈయనే అనుకుంటాను. కొన్నాళ్లయినపిదప శ్రీ శేఖర్ హెడ్‌ఫోన్స్‌కు స్వస్తిచెప్పి కుంచెలు చేపట్టి ఉత్తమ చిత్ర కళా దర్శకులయారు.

శ్రీ కె. వి. రెడ్డిగారు వాహినీసంస్థ నిర్మాణ శాఖలో ఆదినుంచీ ఉంటూ, 1942 లో "భక్త పోతన"తో దర్శకత్వంలో అడుగుపెట్టినదగ్గర్నుంచి వాహినీసంస్థకు "మిడాస్ టచ్" అంది, మరింత శోభాయమానంగా అభివృద్ధికివచ్చింది.

ఈ ఏడాదిలోనే చలనచిత్రపరిశ్రమ సాంకేతిక శాఖలో విద్యావంతులైన యువకులు అడుగు పెట్టాలని ఉబలాటపడ్డారు. వాహినీసంస్థ అధిపతులకు తెలుగురక్తాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంకూడా కలిగింది. తత్ఫలితమే శబ్దగ్రాహకశాఖలో పి. వి. కోటేశ్వరరావు ప్రవేశం.

శ్రీయుతులు మూలా నారాయణస్వామి, బి. ఎన్. రెడ్డిగార్ల ప్రోత్సాహంతో కోటేశ్వరరావు తన 23 వ ఏటనే వాహినీసంస్థ నిర్మాణశాఖలో చేరాడు. అప్పటికీ ఆయన సెంట్రల్ టాకీ ఎక్విప్‌మెంట్ సంస్థలో అనుభవం సంపాదించాడు. ఆతరువాత వాహినీ డిస్ట్రిబ్యూషన్, ప్రొడక్షన్, ఎడిటింగ్ శాఖలలో పని చేస్తూ వచ్చాడు.

వాహినీసంస్థ 1942 లో వాహినీ స్టూడియో నిర్మించగానే కోటేశ్వరరావు శబ్దశాఖలో రికార్డిస్టుగానే చేరాడు. ఆ స్టూడియోశాఖకు అధికారి శ్రీ కృష్ణన్‌గారు. ఆయన కోటేశ్వరరావుకి గురుతుల్యులు. "గుణసుందరికథ" కోటేశ్వరరావు శబ్దగ్రాహకుడుగా పనిచేసిన తొలి చిత్రం. ఆ తరువాత విజయాచిత్రం "షావుకారు"కి, భరణీ చిత్రం "లైలామజ్నూ"కి, వాహినీచిత్రం "మల్లీశ్వరి"కి, భాస్కర్ చిత్రం "బ్రతుకు తెరువు"కి కోటేశ్వరరావు సౌండ్ ఇంజనీర్‌గా పనిచేశారు.

కోటేశ్వరరావుకి శ్రీ బి.ఎన్. రెడ్డి సారధి, శ్రేయోభిలాషి. ఆ ప్రోత్సాహంతో శబ్దశాఖలో కోటేశ్వరరావు ప్రావీణ్యంతోబాటు ప్రజ్ఞను, దానితోబాటు కీర్తిని సంపాదించాడు. తొమ్మిదేళ్ళపాటు వాహినీస్టూడియోలో పనిచేసిన పిమ్మట ఆయనను 1951లో భరణీ సంస్థవారు తాము నిర్మించిన భరణీ స్టూడియోకు ఛీఫ్ సౌండ్ ఇంజనీర్‌గా తీసుకువెళ్లారు. "చండీరాణి" చిత్రాన్ని మూడు భాషలలో తయారుచేయటానికి భరణీ వారు తమ స్వంతస్టూడియోలో ఆ ఏడాదే నడుం కట్టారు. స్టూడియోలోని సాంకేతికశాఖలలో ప్రధానమైన కామెరా, సౌండ్ శాఖల అధికార్లుగా వారు శ్రీయుతులు సెల్వరాజ్, కోటేశ్వరరావులను నియమించుకున్నారు.

1953 వ సంవత్సరం కోటేశ్వరరావు ప్రజ్ఞకు గీటురాయిగా శబ్దంలో కొత్తశాఖ తలెత్తింది. అదే డబ్బింగ్ పద్ధతి. ఇది తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విప్లవాన్ని కూడా తెచ్చిపెట్టింది.

మరొక భాషలోఉన్న చలనచిత్రాన్ని మన మాతృభాషలోకి అనువదించవలసిన (డబ్ చేయవలసిన) అత్యవసరం అంతవరకూ రాలేదు. ఇతర భాషా చిత్రాలను తెలుగుజాతికి అందించి వారి ఆదరం పొందాలనే ఉత్సాహం కూడా ఆ ఏడాదే పెరిగింది. దీనికి నాంది గీతం భరణీస్టూడియోలో, సౌండ్ ఇంజనీర్ కోటేశ్వరరావుచే ఆలాపించబడింది. తెలుగు డబ్బింగ్‌చిత్రాల జోరుకి ఊత అందించిన వ్యక్తి కూడా ఆయనే.

తొలిసారిగా శ్రీ రాజ్ కపూర్ నిర్మించిన "ప్రేమలేఖలు" చిత్రానికి తెలుగుపలుకులు చేర్చవలసిన కార్యక్రమానికి కోటేశ్వరరావే నియుక్తుడైనాడు. డబ్బింగ్‌షీట్ అనేదానిని పూర్తిగా సౌండ్

ఇంజనీరే చేయాలి. అందుకు ఎడిటర్ తోడ్పాటు కూడా అవసరం.

ఈ కొత్తపద్ధతి పుట్టిందేగాని, దానిని ఏఏ విధంగా అనుసరించాలి, ఆచరణలో పెట్టాలి, భాష మార్పిడి కనుకట్టువిద్యగా మార్చాలి అనే సమస్య కోటేశ్వరరావుకి ఎదురైంది. మామూలు తెలుగు చిత్రాలకు సున్నితంగా, హాయిగా మాటలను పాటలను రికార్డ్ చేయటంలో అప్పటికే కీర్తిప్రతిష్టలు సంపాదించుకున్న కోటేశ్వరరావుకి ఇదొక సమస్య అయినప్పటికీ, కొరకరాని కొయ్యమాత్రం కాదనే ధైర్యం పూర్వానుభవం కలిగిస్తూనేఉంది. పాశ్చాత్యదేశాలలో ఈ డబ్బింగ్ విధానానికి ఏ ఏ సాంకేతిక సాధనలను ఉపయోగిస్తారో ఆయన పరిశోధనచేశాడు.

అప్పటికే కోటేశ్వరరావు భరణీ స్టూడియోలో పాటల రికార్డింగ్‌లో కొత్తపద్ధతిని తొలిసారిగా అనుసరిస్తూవచ్చాడు. గాయకులను ఒక గది లోనూ, ఆర్కెస్ట్రా వాయిద్యాలు మరొక గదిలోనూ ఉంచి వారివారి స్వర సాహిత్యాలను వేర్వేరు 'ఛానల్స్' నుంచి తీసుకుని రికార్డ్ చేస్తూండేవాడు. ఈ పద్ధతివల్ల పాటకు ఒక మాధుర్యం, స్వర సాహిత్యాలలో విస్పష్టత ఏర్పడి చెవికి ఇంపుగా వినబడుతుంది. అంతకుమించి శబ్దగ్రాహక విధానంలో దాగిన ప్రతిభ, శక్తి స్పష్టంగా ప్రదర్శితమౌతుంది.

పాటల మాటల రికార్డింగ్‌కి ముందు బొమ్మలలో పనిలేదు. డబ్బింగ్ పద్ధతికి బొమ్మలు ముందుగానే నాట్యంచేసి పెదవులు కదుపుతూ పరాయి భాష పలుకుతుంటాయి. ఈ భాషను నిశ్శబ్దం చేయగా వచ్చిన బొమ్మలు తెరపై నడిచేటట్టు చేసి, అవి పెదవులు కదిపినదాది నిలిపేవరకు బొమ్మను వడిపి ఆపి, వాటిప్రకారం కొత్తభాష శబ్దాన్ని కరెక్ట్‌గా అందేవరకూ అదే బొమ్మను మాటిమాటికీ తెరపై నడపవలసి ఉంటుంది. ఇందుకు ప్రొజెక్టర్‌కి "లూప్ బాక్స్" అనే దానిని చేర్పించాడు కోటేశ్వరరావు. దీనివల్ల ఒక నియమితమైన నిడివిలో ఫిలిమ్‌తెరపై పదే పదే నడుస్తూండటం సాధ్యం అవుతుంది. దీనికితోడు పరాయిభాషలోని చిత్రంలోని పాత్రలు మాటల్ని ఎప్పుడు పలుకుతాయో, ఎంతవేగంలో మాట్లాడతాయో, ఏ సమయంలో నిలుపుతాయో తెలుసుకోవటం మన భాష పలికే ఆర్టిస్టులకు అవసరం. అందుచేత మాతృకలోని సంభాషణలు ఒక్క ఆర్టిస్టులకి మాత్రమే వినిపించేటట్లుగా వారు హెడ్ ఫోన్స్ ధరిస్తారు. ప్రొజెక్టర్‌లో పరుగెత్తే బొమ్మ పలికిన పలుకులు థియేటర్‌లోవారికి వినబడకుండా హెడ్ ఫోన్స్ ద్వారా వాటిని ధరించిన ఆర్టిస్టులకు అందుతాయి. ఈ పద్ధతిని కోటేశ్వరరావు అమలు పరచాడు.

అంచేత 1951 వ సంవత్సరం, భరణీ కోటేశ్వరరావు, కవి ఆరుద్ర, తెలుగు డబ్బింగ్ చిత్రాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. కోటేశ్వరరావు ఈ సమయంలో ఒక వారసుణ్ణి కూడా తయారు చేశారు. ఆకాలంలో భరణీ స్టూడియోలో కోటేశ్వరరావువద్ద సౌండ్ శిష్యుడుగా శ్రీ తిరునారాయణ శిక్షణపొందాడు. ఆరోజు డబ్బింగ్ చిత్ర నిర్మాణ కర్మాగారంగా ఖ్యాతిచెందిన జయంతి



శ్రీ. పి. వి. కోటేశ్వరరావు

స్టూడియోకు సౌండ్ ఇంజనీర్ శ్రీ తిరునారాయణ. అంచేత కీర్తి అంతా గురువు కోటేశ్వరరావుకే చెందుతుంది.

భరణీ కోటేశ్వరరావు అనే అంతా ఆయన్ని పిలుస్తారు. ఆ స్టూడియోలో తయారైన భరణీ చిత్రాలకు,ఇప్పుడు తయారౌతున్న చిత్రాలకి ఆయనే సౌండ్ ఇంజనీర్.

ఈమధ్య ఆయన చలనచిత్రనిర్మాణంలో కూడా ప్రవేశించి సెల్వకోటి సంస్థను ప్రారంభించి "స్వయంప్రభ" చిత్రాన్ని తయారు చేసిన తరువాత తిరిగి ఆ శాఖకు వెళ్ళలేదు.

పాశ్చాత్య చలనచిత్రపరిశ్రమలో ఫోటోగ్రఫీ ఉరకలువేసి సినిమస్కోప్, త్రి-డీ, సినిరమ, సర్కారమావరకూ వచ్చినట్లే శబ్దం కూడా మేగ్నటిక్ టేప్ రికార్డింగ్, చానెల్స్, స్టీరియో ఫోనిక్ సౌండ్‌సిస్టమ్ వరకూ ముందంజ వేసింది. అయితే భారతదేశ చలనచిత్ర పరిశ్రమలో చిత్రనిర్మాణంలో దీనికి ఒక్క శాంతారామ్‌తప్ప మిగిలినవారు అంత ప్రాధాన్యం ఇవ్వటంలేదని కోటేశ్వరరావు అంటాడు. నిజమే, పాశ్చాత్య చలనచిత్రాలలో "సౌండ్"కి ఒక ఎవార్డుకూడా ఏటేటా అందుతూంటుంది. ఎక్కువ ఎవార్డులను వెస్టెక్స్ సౌండ్‌సిస్టమ్‌కే అందుతూంటాయి. శాంతారామ్ నిర్మించిన "అమర్ భూపాలీ" అటువంటి ఎవార్డ్ సంపాదించింది. అదే సిస్టమ్ ఇక్కడకూడా ఉపయోగించబడుతున్నప్పటికీ — వెలుగునీడలకిచ్చే ప్రాముఖ్యం శబ్దగ్రాహకానికి మన నిర్మాతలు ఇవ్వటం లేదు. నిజం చెప్పాలంటే వెలుగునీడలకు చేరవలసిన శక్తి అవి అందించే సహజత్వం, వాతావరణాలకు శక్తి, శబ్దం లేకుండా సృష్టించబడవు. కాంతి, శబ్దం జంటకవులుగా చలనచిత్రానికి ప్రతిభావంతంగా సరఫరా అయితేనే సమగ్రస్వరూపం చిత్రానికి ఏర్పడుతుంది. చలనచిత్ర ప్రదర్శన దగ్గర్నుంచి తెలుగుచిత్ర నిర్మాణంవరకు ఒక నిర్ణీత విధానం క్రమపద్ధతి లేకపోవడంవల్ల నేటి చలనచిత్రంలో విప్లవాత్మకమైన శబ్దగ్రాహకవిధానాలను ప్రవేశపెట్టటం అసాధ్యం అని కోటేశ్వరరావు యదార్థవాదిగా పలుకుతాడు.

చలనచిత్రనిర్మాణంలో ఆఖరుభాగం అయిన రీ రికార్డింగ్. అది చిత్రానికి ప్రాణపదమైనటువంటిది. ఎంతో శ్రద్ధగా ప్రతిభావంతంగా చేయవలసిన పని. కాని, రీ రికార్డింగ్ సమయానికి నిర్మాతకి విడుదలసమస్యలు తలపైభారంగా పెరిగి, ఇతరత్రా ఒత్తిడి ఎక్కువై చిత్రానికి నేపథ్య సంగీతం సమకూర్చి ఏదోవిధంగా పూర్తిచేసి విడుదలచేసి "అమ్మయ్య" అనుకుందాం అనుకుంటాడు నిర్మాత. కాని, నిజానికి పత్తిసనిలా సాగవలసిన కార్యక్రమం రీరికార్డింగ్.

ఒకచిత్రానికి ఆదినుంచి ఆఖరువరకు ఒకే కామెరామన్ పనిచేస్తాడుకనుక వెలుగునీడలలో నిమ్నోన్నతాలు తెలుసుకుంటూ, అతడు సాఫీగా ఫోటోగ్రాఫ్ చేయగలుగుతాడు. కాని, ఒక చిత్రం షూటింగ్ రెండు మూడు స్టూడియోల్లో జరిగిననాడు ఇద్దరు ముగ్గురు రికార్డిస్టులచేత శబ్దం రికార్డ్‌చేయించటంవల్ల, ఒకేచిత్రానికి ఈ విధంగా ఒకటికంటె ఎక్కువమంది శబ్దగ్రాహకులు పనిచేయటంవల్ల సంభాషణలస్థాయికి పొత్తు కుదరదు. ఈ లోపాలన్నీ రీరికార్డింగ్ కాలంలో సర్దుకోవాల్సి ఉంటుంది. కాని, చిత్రనిర్మాత అందుకు సౌండ్ ఇంజనీర్‌కి సహకారం అందివ్వడు... "ఆ.. ఫరవాలేదు" అనే నిర్లక్ష్యభావం కూడా ప్రదర్శిస్తాడు. అంచేత ప్రస్తుత చిత్రనిర్మాణపరిస్థితులలో సౌండ్‌లో విప్లవంకాదుకదా పెర్ఫెక్షన్‌సైతం రాదని కోటేశ్వరరావు అనటంలో అతిశయోక్తి లేదు.

తెలుగు చలనచిత్ర నిర్మాతలలో విజయ, వాహిని, భరణీ, అన్నపూర్ణ, ఎస్. వి. టి. సంస్థలు మాత్రం శబ్దానికి ప్రాధాన్యం ప్రాముఖ్యం ఇస్తారని ఆయన అంగీకరిస్తాడు.


కోటేశ్వరరావు జనన తేదీ 1918 ఫిబ్రవరి 12. బందరులో విద్యాభ్యాసం; ఇప్పుడు చలనచిత్ర రంగంలో ప్రఖ్యాత దర్శకుడుగా ఉంటున్న యోగానంద్ ఆయన సోదరుడు.

తెలుగుదేశంలో, తెలుగుగడ్డపై ఎవరైనా ఫిలింస్టూడియో నిర్మిస్తే అక్కడ పనిచేయాలనే కోరిక ఆయనలో ప్రబలంగా కనుపిస్తుంది.

ఈరోజు తాను అధిరోహించిన ఉన్నతస్థానానికి కారకులైన మూలా నారాయణస్వామి, బి. ఎన్. రెడ్డి, కె. వి. రెడ్డి, కృష్ణన్, భరణి రామకృష్ణలకు సర్వదా కృతజ్ఞత తెలుపుతుంటాడు కోటేశ్వరరావు.

శబ్దగ్రాహకపరికరాలు ఎక్కువగా అందుబాటులో లేనప్పుడు చలనచిత్ర శైశవదశలో శబ్దంలో కొత్తఫీట్లు చేయటానికి అవకాశాలుండేవి; ఇప్పుడు పరికరాలన్నీ సమృద్ధిగా ఉన్నప్పటికీ అవకాశాలు లేవు. అంటే చిత్రనిర్మాణంలో నిర్మాతలు శబ్దానికిగలశక్తిని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నారు. ఈ దుస్థితి త్వరలోనే అంతమై కామెరా, సౌండ్ రెండింటినీ చలనచిత్రానికి రెండు నేత్రాలుగా భావించి వాటిని శ్రద్ధగా ఉపయోగించుకుంటూ చిత్రస్థాయిని పెంచుకోటానికి నిర్మాతలు నడుంకట్టటం ఎంతైనా అవసరం. ★

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!



జరిగిన కథ

రామవరం ఆంధ్ర - ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఒక గ్రామం. శ్యామబాబు అక్కడ దిగి, ఆ ఊరిలోనే వైద్యవృత్తి చేసుకుంటున్న రాధానాథమిశ్రాగారిని కలుసుకుని ఆయన సహాయంతో ఉద్యోగం సంపాదించుకుంటాడు. రామవరంలోని మిల్లు యజమాని సత్యనారాయణరావుగారు తన పిల్లలకు శ్యామబాబు ట్యూషన్ చెప్పే ఏర్పాటు చేయిస్తాడు. నారాయణి మిశ్రాగారి పనిమనిషి. మిశ్రాగారు త్రాగుబోతు అయినా చాలా మంచివాడు. ఒకరోజున పోలీసులు ఆయనను పట్టుకుంటే శ్యామబాబు జరిమానా చెల్లించి విడిపిస్తాడు. మిశ్రా కొదురవ్యసనం పోగొట్టేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తాడు. మిశ్రాను విడిపించుటకు హామీ నిచ్చిన సూర్యప్రకాశరావు పేకాటలో ధనం పోగొట్టుకొని ఆత్మహత్యకు పూనుకొనగా శ్యామబాబు రక్షిస్తాడు. మిల్లు గుమాస్తా ధర్మసూరి కుమార్తె లలితనుచూసి శ్యామబాబుకు పూర్వస్మృతులు వస్తాయి. లలితను వివాహం చేసుకోవాలని, ధర్మసూరి మేనల్లుడు శంకర్ ధర్మసూరిగారింటికి వస్తాడు. ధర్మసూరిగారు తన కుమార్తెను శంకర్ కు చేసుకోవలిసిందిగా శంకర్ తలిదండ్రులను అడిగి విఫలుడౌతాడు. శ్యామబాబు ధర్మసూరిగారిని ఓదారుస్తాడు.

రామవరంలో ఒక జమీందారుగా రున్నారు. అంటే ప్రస్తుతం పేరుకు మాత్రమే జమీందారు. సత్యనారాయణగారి మిల్లు కాక మరొక మిల్లు వారిది. ఆయన పేరు కాంతారావుగారు. అసలు వారి జమీగ్రామం నవనంపాడు అని రామవరానికి ఇరవై మైళ్ల దూరంలో ఉంది. వారికి చాలా భూములూ తోటలూ ఉండేవి. కాని అవి అన్నీ హరించిపోయాయి. కాంతారావుగారి తాతగారి హయాములో వారిప్రభ అందరూ చెప్పుకుంటూండేవారు. ఆయనను పెదకాంతారావుగా రంటారు. వారు జమీ వల్లనే కాక, గవర్నర్లతోను పెద్ద పెద్ద అధికారులైన దొరలతో స్నేహం చేసి, కొన్ని కాంట్రాక్టులద్వారానూ, కొన్ని కొన్ని వస్తువులను ఎగుమతిచేసి వ్యాపారం చెయ్యడం ద్వారానూ చాలా డబ్బుగణించారు. నవనంపాడులో పెద్ద భవనాన్ని నిర్మించారు. అతిథి అభ్యాగతులకు విందులు చెయ్యడంలోనూ, దొరలకు ముఖ్యంగా కావలసిన తినుబడి, త్రాగుబడి పదార్థములను 'సప్లయి' చెయ్యడంలోనూ ఆయన గూర్చి గొప్పగా చెప్పుకునేవారు. ఆయన రసికతకు పెట్టినది పేరట. వేళ్లనిండా రవ్వల ఉంగరాలు, మెళ్లో రవ్వలుపొదిగిన బంగారపు హారం, సిల్కు బట్టలూతో ఘుమఘుమలాడుతూ పదిరకాల సెంట్లు రాసుకొని తిరిగేవారుట. ఆయనకు అనేకమంది ఉంపుడుకత్తె లుండేవారని చెబుతారు.

పెదకాంతారావుగారితోటే ఆ వైభవం అంతరించింది. వారి కొడుకైన శివరావుగారు విదేశాలు వెళ్లి, హృద్రోగంవల్ల లండన్‌లో అకస్మాత్తుగా మరణించారు.

కాంతారావుగారి బాల్యమంతా వైభవంగా గడిచింది. కాని తరువాత, అనేకమంది వ్యాపారవ్యామోహితులగు స్నేహితులతో కలిసి అనేక రకాలైన వ్యాపారాలు చేసి ఆస్తంతా తగలేసుకున్నారు. చివరికి రామవరంలో ఉన్న మిల్లొకటి మాత్రం నిల్చింది. ఆయనకు ఏభై య్యేండ్లుదాటాయి. అంత ఆస్తి పోగొట్టుకున్నప్పటికీ ఆయనకు వ్యాపారంమీద వ్యామోహం పోలేదు. ఆయన చాలా కాలం మద్రాసు, బొంబాయి, ఢిల్లీ, కలకత్తా మొదలైన నగరాలు తిరిగి అనేకరకాల వ్యాపారాలు చేశారు. రామవరంలో సంస్కారం, విద్యా కలిగిన బహుకొద్దిమంది వ్యక్తులలో ఆయన ఒకరు.

శ్యామ్‌బాబుకు కాంతారావుగారితో, సత్యన్నారాయణగారింట్లో పరిచయమైంది. శ్యామ్‌బాబుది మద్రాసనీ, బాగా చదువుకున్నవాడనీ సత్యన్నారాయణగారు కాంతారావుగారికి పరిచయం చేశారు. కాంతారావుగారు శ్యామ్‌బాబును తరుచూ తమయింటికి వస్తూండమని ఆహ్వానించారు.

ఒకసారి శ్యామ్‌బాబు, కాంతారావుగారి యింటి ముందునుంచి వెళ్తూంటే కాంతారావుగారు ఆయన్ని పిలిచారు. ఆసమయానికి కాంతారావుగారింట్లో మరొక యువకుడుకూడా కూర్చొని ఉన్నాడు. శ్యామ్‌బాబుకు ఆ యువకుణ్ణి కాంతారావుగారు పరిచయం చేశారు. ఆ యువకుడికి సుమారు ఇరవై ఎనిమిదే ళ్లుంటాయి.

అతనిపేరు దినకర్రావు. దినకర్రావుది అసలు బెజవాడ కాపురస్థలం. వ్యవసాయ శాస్త్రంలో, కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో పట్టభద్రు డయ్యాడు. రామవరానికి దగ్గరలో ఒక

43—వ పేజీ చూడండి



జరిగిన కథ

హాంబుర్గ్ నగర నివాసి ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్ ఒక పాత గ్రంథం సంపాదిస్తాడు. దానిలో ఒకత్యక్పత్రం దొరుకుతుంది.

'ఆర్నె సాక్నుస్సెమ్' అనే ప్రాచీన శాస్త్రజ్ఞుడు, ఐస్‌లాండ్‌లో ఆరిపోయిన ఒక అగ్ని పర్వతం ముఖద్వారంలోనుంచి భూగర్భంలోనికివెళ్లినట్లు అందులో వ్రాసి ఉంటుంది. తమ్ముడు కొడుకు ఆక్సెల్‌తో కలిసి ప్రొ॥ లిడెన్‌బ్రోక్ అక్కడికి ప్రయాణంకడ్తాడు. స్నాఫెల్స్ పర్వతంవద్దకు దారి చూపేందుకు వారు హాన్స అనేగైడ్ ను కుదుర్చుకుంటారు. స్కార్టారిస్ శిఖరం దిగువన వారికి మూడు రంధ్రాలు కనిపిస్తాయి. మధ్య రంధ్రంమీద స్కార్టారిస్ నీడ పడేవరకు కనిపెట్టుకొనిఉండి, నీడపడిన రోజున ఆరంధ్రంగుండా లోనికి దిగుతారు. కొంత దూరం వెళ్లేసరికి వారికి రెండుదార్లు కనిపిస్తాయి. తూర్పు వైపు సొరంగం లోంచి పోగాపోగా ఆదారి ఒకచోట ఆగిపోతుంది. పొరపాటు తెలుసుకుని వారు మళ్లీ రెండుదార్లు చీలినచోటకు తిరిగివెళ్లి, రెండవ సొరంగంలో ప్రయాణం కొనసాగిస్తారు. అలసిపోయిన ఆక్సెల్ దప్పికతో మూర్ఛపోతాడు. హాన్స భూగర్భజల ప్రవాహాన్ని కనుగొని అతని దప్పిక తీరుస్తాడు. అంతా మళ్లీ ముందుకు నడుస్తారు. పోగా పోగా ఒక పెద్దగొయ్యి ఎదురవుతుంది. దానిలో దిగి ఎనిమిది రోజులపాటు ప్రయాణం చేసిన తరువాత వారుఒక విశాలమైన ప్రదేశానికి వస్తారు.


26

ఇంతవరకూ వ్యవహారం బాగానే నడిచినదని ఒప్పుకుంటాను. సణిగేందుకు కారణం లేకపోయినది. నగటున, మా కష్టాలు ఈ విధంగానే ఉన్నట్లయితే మా లక్ష్యం సాధించకుండా ఉండలేము. ఆతర్వాత ఏమి కీర్తి! ఏమయినదంటే లిడెన్‌బ్రోక్ సిద్ధాంతాలు వచ్చేస్థితికి వచ్చేశాను. నా వైఖరిలో మార్పు రావటానికి కారణం నేను ఉన్న విచిత్ర పరిసరాలేనా? అయి ఉండవచ్చు.

ఆ తర్వాత కొన్ని రోజులు క్రమంగా వేగంగా దిగిపోయాము. కొన్నెప్పుడు మరీనిలువుగాదిగిపోయాం. భయం కలిగించాయి. బాగా అంతర్భాగంలోనికి దిగిపోయాము. కొన్నిరోజులు మూడు, నాలుగున్నర మైళ్లవరకూ ప్రయాణం చేశాము. ఈ ప్రమాదకరమయిన త్రోవల్లో హాన్స్ నేర్పరితనం, సమయస్ఫూర్తి ఎంత అత్యవసరములో తెలిసివచ్చినది. ఈ అయిస్‌లాండర్ చాకచక్యం వల్లనే అతిక్లిష్టంగాఉన్న

—41వ పేజీ చూడండి


వ్యాఖ్యానములు-22
ఒప్పుకున్న ప్రతివేషం నిజానికి
ఒప్పించగల జాణ జానకి
తెలుగులో ఇటీవల అవకాశాల్లేవు
పాపం!
తమిళ్లో వెలిగిపోతోంది - ఆమెకేం లోపం!


నారయ్య
ఆర్.యం.చిదంబరం

గుండెలో పీచుపీచుమంటున్న భయం. వంట్లో వణుకు - బెదురుగా, గరిమనాభి లేనట్టు చూపులు -

అలా, నారయ్య స్కూలు కాంపౌండు దాటి బయటపడ్డాడు. ఉన్నట్టుండి కాళ్లు నడవటం మానేస్తా యేమోనన్న అనుమానం -

జీవితంలో మొదటిసారిగా అతను తప్పుపని చేశాడు - నీతివిరుద్ధమైన పని. అందుకే - ఈ అనుభూతి... మూడోగంట కొట్టి పదినిముషాలైంది. ప్రార్థన పూర్తయి పాఠాలు మొదలుపెట్టారు. పాపకు అప్పుడే నిజం తెలిసిరాదు. పరధ్యానంగా మెడ తడుముకుంటే ఉలిక్కిపడుతుంది. తిన్నగా టీచరుకు విషయం వివరిస్తుంది.

స్కూల్లో, అలాంటి అఘాయిత్యం, పగలు దోపిడి జరిగాయంటే ఎవరూ సహించరు. హెడ్మాష్టరు దగ్గరున్నుండి, బంట్రోతుదాకా అందరూ ఎగిరి గంతులేస్తారు. ఒక్కొక్క విద్యార్థిని పిలిచి నిలదీసి గదమాయిస్తారు. అడ్డ ప్రశ్నలు వేస్తారు. కళ్ళెర్రజేసి బెదిరిస్తారు.

'కాని అదెక్కడ దొరుకుతుంది?' అని నవ్వుకున్నాడు నారయ్య. అతని చొక్కాజేబు బరువుగా ఉంద... అదక్కడుంటే ప్రమాదం. ఇల్లు చేరుకున్నాక ఎక్కడైనా దాచేయాలి. అప్పుడు నిజాన్ని కనుక్కోవటం బ్రహ్మతరంకూడా కాదు...నారయ్య ఎదురుపడ్డ హోటలుకుపోయి టీ తాగివచ్చాడు. మనసు కాస్త స్థిమితపడింది. కలవరం తగ్గింది. చుట్ట కాలుస్తూ నెమ్మదిగా అడుగులు వేయసాగాడు.

తను చేసిన పని అన్యాయమని తెలుసు. అలా చేయవలసివస్తుందని కల్లోకూడా అనుకోలేదు. పరిస్థితులు, కోరికలు ఒక్కసారిగా విజృంభించి అతన్ని బలవంతంగా ఊబిలోకి దింపాయి. మంచివాడు చెడ్డతనాన్ని ఎన్నడూ ప్రేమించడు. నారయ్య జనార్దనంగారికి ద్రోహం చేశాడంటే కారణాలు కత్తికట్టాయి. ఊహలో కూడా అతను యజమాన్ని వంచించాలనుకోలేదు.

చిన్నచిన్న అడుగులచప్పుడు. త్వరగా తరుముకొస్తున్న చప్పుడైంది...భయంతో గిరుక్కున వెనక్కి తిరిగాడు...ఏం లేదు...అంతా భ్రమ -

'అమ్మ దొంగా!...నా వస్తువు ఇచ్చేయ్....ఉండు! నిన్ను పోలీసులకు పట్టజెపుతాను' అని పాప గర్జిస్తే - దారిలో అటకాయిస్తే...

నారయ్య చిత్రంగా నవ్వుకున్నాడు.

అలా ఎన్నటికీ జరగదు. దాచిఉంచినంతకాలం అబద్ధం నిజంగా చలామణి అవుతుంది...అసత్యాన్ని కనుక్కుంటేమాత్రం చాలదు. దాన్ని రుజువుచేయాలి. సాక్ష్యాలు తీసుకురావాలి - కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్టు....అయినా, జనార్దనంగార్ని మోసగించటం తన వినాశానికే వచ్చింది....తన్ను ఏ పరిస్థితుల్లో ఆయన ఆదరించింది మర్చిపోయాడన్నమాట....

నారయ్య దీర్ఘంగా ఆలోచింపసాగాడు.

వరదలు వచ్చాయి. పంట నాశనమైంది. ఎక్కడా పని దొరకలేదు. ముసలితల్లి జబ్బుతో మంచమెక్కింది. మంచివాడికి రోజులు కావన్నారు. ఉన్న ఇల్లు నీటిప్రవాహంతో కదలిపోయింది. నారయ్యకు జీవితంమీద పెద్ద కోర్కెలేవీ లేవు. పెళ్లి చేసుకుని పిల్లలతో సంసారం చేయాలని అతనుకల్లో కూడా వాంఛించలేదు. వళ్లు వంచి పనిచేయటం, దొరికిన డబ్బుతో ముసలి తల్లిని సుఖపెట్టడం. అదే అతని లక్ష్యం— తల్లికోసం ఏ త్యాగమైనా చేయటానికి సంసిద్ధుడు.

కాని, ప్రకృతి బలపరీక్షకు రమ్మని సవాలు చేసింది. నారయ్యకెక్కడా పని దొరకలేదు. రెండు వందలు ఎలాగో అప్పుచేసి ఇల్లుకట్టాడు. తల్లి క్కావలసిన వస్తువులు కొన్నాడు. చిన్న నులక మంచం—సింవెండిగిన్నెలు, నాలుగు చీరలు— ఇంకా అత్యవసరమైనవి... జాగ్రత్తగా ఉండమని హెచ్చరించి పనికోసం పట్నం చేరుకొన్నాడు.

పట్నంలోమాత్రం పని సులువుగా దొరుకుతుందా ? .... నాలుగురోజులు కాళ్లరిగేటట్టు తిరిగాడు. అతని ముఖంలో అమాయకత్వాన్ని చూసిన కొందరు 'పనికి పనికిరావు .... పొమ్మ'న్నారు. తెచ్చుకున్న రెండు రూపాయలు ఖర్చైపోయాయి. ఏం చేయటానికి పాలుపోలేదు.

అలాంటప్పుడు అయిదో రోజున—

బరువుగా అడుగులువేస్తూ నడుస్తున్నాడు. పట్నంమీద పెట్టుకున్న ఆశలు కరిగిపోయాయి. కొంతదూరంలో స్కూలు పిల్లలు జట్లు జట్లుగా నడచిపోతున్నారు. ఓ అమ్మాయిమాత్రం అందరికంటె వెనక, నెమ్మదిగా, తమాషాగా నడుస్తోంది. లారీలూ, బస్సులూ అటూ యిటూ పరుగెడుతున్నాయి. పురాతననాగరికత నశింపకూడదని కంకణం కట్టుకున్న ఎడ్లబళ్లకట్టడాలు మధ్య మధ్య లారీల పురోగమనాన్ని సాయశక్తులా అటకాయిస్తున్నాయి. తతిమా పిల్లలందరూ రోడ్డుకు ఎడంప్రక్కగా నడచిపోతుంటే, ఆ ఒక్క పెంకిపిల్లమాత్రం రోడ్డు మధ్యగా నడుస్తోంది.

'నేనే ఈ మోటార్లకు జడిసి వారగా నడుస్తుంటే, ఈ బుల్లెమ్మ ఎంత ధైర్యంగా నడుస్తోంది ?' అని నారయ్య ఆశ్చర్యపోయాడు.

అలా అయిదు నిమిషాలు ఆమెను గమనిస్తూ నడిచాడు.

'అమ్మాయిగారూ ! .... జాగ్రత్తగా నడవండి. ఇదుగో వచ్చేస్తున్నా !'

నారయ్య వెనక్కి తిరిగి ఆ మాటలు వచ్చిన దిక్కుగా చూశాడు. ఓ 'ఆసామీ' కిల్లిగొట్టు

37—వ పేజీ చూడండి



ఆంధ్రసచిత్ర వారపత్రిక
వారఫలాలు

దైవజ్ఞవాతూరి శ్రీరామమూర్తి

23-2-1962 శుక్రవారము మొదలు
1-3-1962 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఆర్థికస్థితి ఇంతకుముందుకన్నా బాగుంటుంది. కోర్టు, కచేరీలలో పనులు ఒక్కొక్కటే క్రమంగా జరుగుతవి. ఇతరుల చేతిలోని డబ్బునుగాని, వస్తువులనుగాని నమ్ముకొని క్రొత్త కార్యక్రమాలు ఆరంభించవద్దు. ధనవ్యయం అధికంగా ఉంటుంది. సంఘ కార్యాలలో సాటివారి సహాయము, గౌరవము పొందగలుగుతారు. ఎదుటివారి మాటను అనుసరిస్తున్నట్లు నటిస్తూ, మృదువుగా పని సాధించుకోవలసిన సమయము. వృత్తికి సంబంధించిన కార్యభారం అధికం కావటంవల్ల, అలసట, క్షణ క్షణానికి ఆలోచనలలో మార్పులు వస్తూ ఉంటవి. స్నేహితుల హాస్య ప్రసంగాలను వినిపించుకొనకుండా తప్పుకొనటం అవసరం. కుటుంబంలోనివారివల్ల జరిగే చిన్న చిన్న లోపాలు తలవని తలంపుగా దండగ ఖర్చులకు దారి తీస్తవి. గణేశస్తోత్ర పారాయణంవల్ల మనశ్శాంతి, కార్యసిద్ధి పొందగలుగుతారు. 27, 28 తేదులలో కష్టవార్తలు, త్రిప్పట.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణీ, మృగశిర 1, 2 పా.)

సాధారణంగా ఏ విషయంలోనూ మీ నిశ్చయాన్ని తెలుపతగినసమయంకాదు. అవకాశం దొరికితే స్నేహితులు కూడా తప్పు మీ మీదకే నెట్టటానికి చూస్తారు. ధనకష్టం మాత్రం చాలా వరకు తగ్గుతుంది. ప్రయోజనం ఉండదని అనుకుంటూ పరిస్థితుల ప్రభావంవల్ల వ్యాపారాలవంటి పనులలో పెట్టుబడి పెడతారు. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. మీ ఎదురుగా మిమ్ములను పొగడుతూ, మీ రహస్యాలను బయటకు చేరవేసేవా రుంటారు. పుణ్య కార్యాలు అనుకూలిస్తవి. కుటుంబంలోనివారికి అనారోగ్యం సూచిస్తుంది. కాని, వెంటనే అనుకూలత ఏర్పడుతుంది. ఋణభారాన్ని వదలించుకోగలుగుతారు. విద్యారంగంలో కృషిచేయువారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. సాహస కార్యాలలో ప్రవేశించవద్దు. వినోద కార్యక్రమాలకు ఆటంకాలు వస్తవి. 24, 25 తేదులలో కలహ ప్రసంగాలు, డబ్బుగాని, వస్తువులుగాని పోగొట్టుకుంటారు.

గ్రహస్థితి

కర్కాటకంలో రాహువు, మకరంలో కుజ, బుధ, శని, కేతువులు, మకర కుంభాలలో గురువు, కుంభంలో సూర్య, శుక్రులు, కన్య, తుల, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

బాహ్య విషయాలలో ఆడంబరం బాగానే ఉంటుంది. అధికారులవల్లగాని, ఉన్నతస్థితియందున్న మిత్రులవల్లగాని అకస్మాత్తుగా మాట వచ్చే అవకాశాలున్నవి. శ్రమపడి జయం సాధించటానికి ప్రయత్నించవలసి వస్తుంది. చేతికి ఎంత డబ్బు వచ్చినా నిలవటానికి అవకాశం లేకుండా అవసరాలు ఎదురుచూస్తూ ఉంటవి. అయితే వృత్తి, ఉద్యోగాలలో గత కాలంలో ఏర్పడిన అలజడి క్రమంగా తగ్గిపోయి యధార్థమైన మార్గం తెలుస్తుంది. తోటివారికి నమ్మకాన్ని కలిగించగలుగుతారు. బంధువులకు సంబంధించిన పనిలో ఔక్యం కలిగించుకొనలేకపోతారు. కుటుంబంలో నలుగురూ మీ మాటను ఆమోదించటంవల్ల శ్రమను సహించి ఫలితం పొందగలుగుతారు. వారం చివర కాలంలో రొమ్ము, శిరస్సు ఈ భాగాలలో బాధ కలుగుతుంది. 27 28, తేదులలో యుక్తితో కార్యసాధన, ధనలాభం.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)

ఎంత శ్రమపడవలసివచ్చినా సంఘంలో మాట దక్కించుకొంటూ ముందుకుపోగలుగుతారు. వృత్తి వ్యాపారాలలో పొరపాట్లు రాకుండా చూచుకొంటారు. అదనవు ఖర్చు వచ్చేటట్లు తోస్తుంది. వ్యవహారరంగంలో "దారినపోయే పీడను పిలిచినట్లుగా" తగుల్కొనవలసివస్తుంది. సాధ్యమైనంత వరకు చేతికిఅందిన ఫలితాన్ని భద్రపరచుకొనటానికి ప్రయత్నించండి. ఉద్రేకాన్ని అణచుకొనలేని పరిస్థితి వస్తుంది. కుటుంబంలోనివారి ఆరోగ్యం సరిగా ఉండదు. రక రకాల మనుష్యులను ఒక మార్గానికి తీసుకునివచ్చి కార్యం సాధించుకోగలుగుతారు. వారాంతంలో ధనాదాయం పెరుగుతుంది. దక్షిణదిక్కునుంచి సంతోషవార్తలు తెలుస్తవి. శుభ కార్యాలలో పాల్గొంటారు. 23, 24 తేదులలో కారణంలేని భయము, మిత్రలాభము, దేహశ్రమ.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

కీర్తి పలుకుబడి బాగా పెరుగుతవి. ఎవరిదో ఒకరిది అవసరానికి డబ్బు మాత్రం లభిస్తుంది. మీ మాట పదిమందికీ సంతృప్తికరంగా ఉంటుంది. ఏ వ్యవహారంలో ప్రవేశించినా వెనుకకు తగ్గవలసిన అవసరం తొలగుతుంది. కుటుంబంలో శుభకార్యాలు చక్కగా నెరవేర్చగలుగుతారు. వృత్తిలోమాత్రం విరోధుల కుతంత్రాలు కొంతవరకు ఆందోళన కలిగించినా అపకారం జరిగే అవకాశాలులేవు. వారం రెండవభాగంలో ఉష్ణ, శైత్య ప్రకోపాలవల్ల బాధ పడతారు. వాహనాలు, స్థిరాస్తులు మొదలయినవి కొనటంవంటి పనులలో జాగ్రత్తగా ఉండటం మంచిది. ఆత్మీయులతో కలహాలు రాగల సమయం. మీరు నిర్లక్ష్యంగా ఇతరులమీద వదలిన పనులు ఎటూకాని స్థితిలో నిలచిపోతవి. 25, 26 తేదులలో సభా గౌరవం, విలువగల వస్తువులు కొంటారు.

* * *

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

మీ నిత్య కార్యక్రమాలు శ్రద్ధతో నెరవేర్చి పోటీవారి ఆదరాభిమానాలను పొందగలుగుతారు. శుభ సంబంధమైన ఖర్చులు పెరుగుతవి. పై అధికారులవల్ల మాట వస్తుందనే ఆందోళన స్థితి పోతుంది. ధనాదాయం బాగుంటుంది. కొన్ని సమయాలలో ఎదటివారు తెలియచెప్పేటంత వరకూ మీ కర్తవ్యాన్ని మరచిపోతూఉంటారు. బంధువులవద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. ఇతరులమాటమీద ఆధారపడి క్రొత్త వ్యాపారములవంటి పనులలో దిగవద్దు. నీచులతో కలహాలు రాగల సూచనలున్నవి. వారాంతంలో అసౌఖ్యం చేస్తుంది. ఇతరులకు హామీ ఉండటంవంటి చిక్కులతో కూడిన బాధ్యతలను చల్లగా తప్పించుకొనటానికి చూడండి. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. వ్యవహారాలలో ప్రయోజనం తక్కువ. 27, 28, తేదులలో అకస్మాద్ధనలాభం, ప్రయాణాలు.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

చల్లగా మాట్లాడుతూ, అందరి మాటకూ తలవూపుతూ ఉండటం మీపని. ఫలితము, గౌరవము పొందగలుగుతారు. మానసికంగా ఎంత ఆదుర్దా తోచినా దైవానుగ్రహంవల్ల సమయానికి తగిన ఆలోచన, అందుకు అనువైన మార్గము లభిస్తూ ఉంటవి. ఎవ్వరికీ అసంతృప్తి కలుగకుండా మీ స్థానాన్ని కాపాడుకోగలుగుతారు. శుభ కార్య ప్రయత్నాలు మాత్రం త్వరగా కూడిరాకపోవచ్చు. అగ్ని, ఆయుధాలు మొదలయినవాటితో చేయు పనులలో జాగ్రత్త అవసరం. పిల్లలమూలంగా ఆనందం లభిస్తుంది. విద్యావంతులతో కలిసి చేయు పనులలో భేదాభిప్రాయాలు రాగల సూచన లున్నవి. ప్రయాణాలు నిలుపుకొనవలసి వస్తుంది. డబ్బుకు సంబంధించిన చిక్కులు చాలావరకు తగ్గిపోతవి. 23, 24 తేదులలో కష్టవార్తలు, వృధాశ్రమ.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

మీ మనోభావాలను కార్యరూపంలో పెట్టగల అవకాశాలు లభిస్తవి. బంధువర్గంలో మంచి పేరు ప్రతిష్ఠలు పొందగలుగుతారు. ప్రతికార్యము స్వయంగా నిర్వహించి సంతృప్తికరమైన ఫలితం పొందగలుగుతారు. దేహశ్రమ ఉంటుంది. కాని, ఉత్సాహం లోపించదు. శుభ కార్యాలమూలకంగా ఖర్చులు పెరుగుతవి. మీకు సలహా చెప్పేవారు ఒక పద్ధతిలో లేకపోవటంవల్ల ముందు మీ మనస్సుకు ఆందోళన కలుగుతుంది. ధనాదాయం బాగానే ఉంటుంది. మీకంటే తక్కువ అంతస్తులో ఉండే వారితో పేచీలు వస్తవి. వారాంతంలో ప్రయాణాలు చేయవలసి రావచ్చు. 28, లాభవార్తలు, విందు, వినోదాలు.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఒక పొరపాటును సర్దుకొనటానికి ఎంతో శ్రమపడవలసివస్తుంది. త్రిప్పటతో కూడిన పనులు అధికమవుతవి. ఈ సమయంలో మీరు ఇతరులకు సహాయం చేయటము, కొన్ని సందర్భాలలో ఇతరుల సహాయం పొందటం కూడా చక్కగా జరుగుతవి. బండ్లు మొదలయినవి యెక్కే సమయాలలో తగు జాగ్రత్తగా ఉండటం అవసరం. ఎదటివారిభావాన్ని సులభంగా తెలుసుకొని, నింద మీమీదకు రాకుండా చేసుకొంటారు. డబ్బు సర్దుబాట్లు గౌరవప్రదంగా నిర్వహించగలుగుతారు. వృత్తి, ఉద్యోగాలలో బాధ్యతతో ప్రవర్తించవలసి వస్తుంది. స్థిరాస్తులు అమ్మే ప్రయత్నాలు లాభకరంగా జరుగుతవి. 27, 28 తేదులలో శ్రమవల్ల కార్యసిద్ధి— అయినవారివల్ల మోసము.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3,4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

ఒకనాడు ఒకపని అనుకూలిస్తే ఎప్పుడూ అదే విధంగా ఉంటుందని అనుకోవద్దు. విసుగు లేకుండా మీ కృషిని సాగించటం అవసరం. ప్రస్తుతం మీ ధన కష్టం చాలావరకు తగ్గిపోతుంది. పిల్లలమూలంగా మనస్సంతోషం కలుగుతుంది. రాజకీయాలలో మీ ఆలోచనలు బాగా ఫలిస్తవి. బంధు మిత్రుల సహాయం లభిస్తుంది. క్షణం విశ్రాంతి లేకుండా ఏదో ఒక పని చేస్తూ ఉంటారు. దేహసౌఖ్యం బాగుంటుంది. వారం రెండవభాగంలో మిమ్ములను అనుసరించేవారు అధికమవుతారు. వ్యవహార రంగంలో కొంతవరకు ఉపకారమే జరుగుతుంది. ఈ సమయంలో తెలిసే వార్తలు ఏ విధంగా సమన్వయం చేసుకొనవలయునో తెలియక చికాకు కలుగుతుంది. 25, 26 తేదులలో గౌరవప్రాప్తి; అధికారులవల్ల అనుకూలత.

* * *

ఈ వారము ధరలు

బంగారు ధరలో మందీ వస్తుంది. వెండి ధరలో పెద్ద మార్పు కనుపించదు. పసుపుధర వారాంతంలో పెరుగుతుంది. వేరుశనగపప్పు ధరలో ముందు మందీవచ్చి వారాంతంలో గిరాకి కనుపిస్తుంది. నూనె ధర నిలకడగా ఉంటుంది. నూవులకు గిరాకీ వస్తుంది. మినుములకు, పెసలకు కొద్దిగా మందీ రాగల అవకాశా లున్నవి. గోధుమలధరలో పెద్ద మార్పు ఉండదు. మిర్చికి గిరాకి ఆరంభించ గలదు.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

మీ మామూలు కార్యక్రమాలు యధాప్రకారం జరిగిపోతూఉంటవి. బంధుమిత్రులు ఆదుకుంటారనే ఆశతో ఏ పనిలోనూ దిగవద్దు. ప్రయోజనం లేని ఖర్చులు, తరచూ ప్రయాణాలు చేయవలసి రావచ్చు. మనస్సుకు ఆందోళన, ఉద్రేకము కలుగుతూ ఉండటంవల్ల మీ ధనాదాయ సంబంధమైన పనులకు ఆటంకం ఏర్పడుతూ ఉంటుంది. సందేహాలు, బాహ్య ఆడంబరము తగ్గించుకొనటం మంచిది. ఈ సమయంలో ఎవరి మాటనూ విశ్వసించలేక పోతారు. మొత్తంమీద "చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లుగా" ఉంటుంది. 25, 26 తేదులలో శత్రుబాధలు, అస్వస్థత, సంచారము.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

మీ అదృష్టం కలసిరాగల సమయం. మీ అభిప్రాయాన్ని తెలుసుకొనలేనివారు నిందలు వేయవచ్చు. ఈ సమయంలో మిమ్ములను ఏ విధంగానూ బాధించవు. అధికారులతో మీ పరిచయం వృద్ధి అవుతుంది. కుటుంబంలో నెమ్మదిగా ఉంటుంది. రెండు, మూడు రకాల బాధ్యతలు ఒకేసారి వచ్చి పడటంవల్ల యుక్తితో సమర్థించుకొనగలుగుతారు. మాటలలో గోప్యతనాన్ని ప్రదర్శించకుండా వ్యవహారాలలో నెగ్గుకు రాగలుగుతారు. ధనాదాయం పెరుగుతుంది. వారాంతంలో కలహాలు రాగలవు. 27, 28 తేదులలో సభా గౌరవం, శుభవార్తలు; శ్రమకరమైన పనులు. ★

ఆంధ్రసచిత్రవారపత్రిక

నవలా రచన పోటీ

బహుమతి రు. 1000

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సాంఘిక నవలా రచనకు మరొక పోటీ నిర్వహించదలచామని తెలుపటానికి సంతసిస్తున్నాము.

[15-12-1961 గడువుగా పెట్టిన నవలలపోటీ ఫలితాలు త్వరలో తెలుపుతాము. ఇది మరొక పోటీ.]


ఈ పోటీకి పంపే నవలలు మా కార్యాలయానికి 1-5-1962 లోగా చేరాలి.

నిబంధనలు

- రచనలు కాగితానికి ఒక వైపునే వ్రాసి ఉండాలి.
- 250 అరఠావు (ఫుల్‌స్కేప్) పేజీలు మించి ఉండరాదు.
- కథా వస్తువు నేటి ఆంధ్రదేశం సాంఘిక జీవితానికి సంబంధించి ఉండాలి.
- రచనలు స్వంతమయినవిగా ఉండాలి. అనువాదాలు పంపకూడదు.
- పోటీలో తుది నిర్ణయం సంపాదకులదే. ఈ విషయంపైన ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు.
- రచనలు త్రిప్పిపంపగోరేవారు తగిన పోస్టేజి జతపరచి పంపాలి.
- పోటీలో బహుమతి పొందని నవలలు యోగ్యములయితే విడిగా ప్రచురిస్తాము.
- బహుమతి నవలకు సంబంధించిన అన్ని హక్కులూ ఆంధ్ర సచిత్ర వారపత్రికకే చెంది ఉంటాయి.

రచయితలు ఎప్పటివలె మాతో సహకరించి ఈ పోటీ జయప్రదం చేయగోరుతాము.

ఇంతకుముందు పోటీకి నవలలు పంపినవారందరికీ కృతజ్ఞులము.



చౌకధర

కవిత్వాన్ని అమ్ముతున్న
కొనండయ్యా చౌకధర
కోరినట్టు వ్రాసిస్తా
కొనండయ్యా నా దగ్గర.

భావాలకు సరిపోయే
భావలందు రచియిస్తా
పల్లెప్రజలు పాడుకునే
పాటలను వ్రాసిస్తా.

అంత్యప్రాసకొరకు మీరు
చింత చేయవలదండి
ప్రాసక్రీడలందు నాకు
ప్రావీణ్యము కలదండి.

ఇమిటేషన్ గీతాలను
నిమిషాలలో వ్రాసిస్తా
కాలిగజ్జె సవ్వడితో
పదములను జోడిస్తా.

దృశ్యానికి సరిపోయే
దృష్టిలోనె వ్రాసిస్తా
'చెత్తలాగ' ఉందంటే
కొత్తదొకటి వ్రాసిస్తా.

కాంట్రాక్టులు, అడ్వాన్సులు
కాఫీలు అడగ నేను
నా ఖర్చులతో వచ్చి
మీకు వ్రాసియిస్తాను.

పేపరులో మిమ్ములను
పేరువేయమన నేను
మీరు దిగే ఫోటోలకు
మీ ప్రక్కగ నిలవ రాను.

కవిత్వాన్ని వినిపించి
ఖరీదేమి అడగనండి
కాగితాల బరువుతూచి
కలసినంత తీసుకోండి.

కడుపు నింపుకొనుటకొరకు
కవిత్వాన్ని అమ్ముతున్న
ఇంటిముందు నిలుచున్న
కొంటారని నమ్ముతున్న.

వీధిలోన మీ పిలుపుకు
వేచియుందు నెల్లప్పుడు.
'అరేయ్ కవీ' అనండి మీరు
మరేం నేను అనుకోను.—

'పాళి' (హైదరాబాదు)

* * *

పొరబాటు

భ:-ఏమేవ్! నేనా బజార్లో మాట్లాడుతూ వుంటే రమ్మని సైగ చేస్తూ తల వూపుతా వెందుకు?

భా:-(తెల్లబోయి) మీరని అనుకో లేదండి!

గిరిజకుమార్

'చిత్ర' మాయ

పుస్తకంబుజూడ పుట్టుకొచ్చును నిదుర
పిక్చరన్నచాలు పారిపోవు
పాడు పిక్చర్లొచ్చి చదువరుల జెఱచెరా
విశ్వదాభిరామ — వినుర వేమ.


పోతరాజు భాస్కరరావు (పెదపూడి)


* * *


పొదుపు ఉద్యమం

అక్కరకు రాని "చుట్టను"
గ్రక్కున విడువంగవలదు అది యెట్లన్నన్
తెప్పలుగ "అగ్గిపెట్టె లుండ"
"చుట్టలు" కాల్చంగనగును వినరాకుమతీ.

పి. నంద (హైదరాబాదు) ★









"మిస్టర్ రావ్!"

"వస్తున్నా సార్!"

టేబులుకు దగ్గరగా నిల్చుకున్నాడు రామారావు.

" 'కర్వ్'లన్నీ తయారయినట్లేనా?"

తలూపాడు రామారావు. ఫైల్లోంచి నాలుగు గ్రాఫు కాగితాలు తీసి బల్లమీద పేర్చాడు.

"ఇది 25 డిగ్రీలవద్ద, ఇది ముప్పయి అయిదు, ఇది 60 డిగ్రీలు. ఇది నూట ఇరవయి......" వివరించాడు రావు.

"'ఇ' కనుక్కున్నావా?"

"24.5 కాలొరీలు వచ్చింది. కాని మరోసారి చేద్దామని వుంది......"

"ఊ......మరి డేటా ఎక్కడ?"

మరో నాలుగు కాగితాలుంచాడు టేబిల్ మీద రావు.

"ఇది అబ్‌స్ట్రాక్ట్ ఫారమ్‌గా తయారు చేశానండి. ఇది హిస్టారికల్ బ్యాక్‌గ్రౌండు. ఇది అపరేటస్, పద్ధతి, ఇది మన కొచ్చిన ఫలితాలన్నీ సంగ్రహించి వ్రాసింది."

"ఊ........"

రావుకు అదే చాలు. ప్రొఫెసర్ మూర్తి పరిభాషలో "ఊ" అంటే 'ఎక్సలెంట్' అన్నమాట.

"మరి సల్ఫర్ థర్టీఫైవ్ సంగతి చూచావా? ఏమన్నా ఇంకా వుందా? అయిపోయిందా?"

"మరో రెండు పర్యాయాలకు పనికివస్తుందండి......"

"అవి రెండూ సిద్ధంగా వున్నాయా, క్రోమటోగ్రఫీ షీట్సు ఏవీ......"

"కౌంటర్ దగ్గరున్నాయండీ......"

ప్రొఫెసర్ మూర్తి లేచాడు. ఇద్దరూ గైగర్ మ్యూల్లర్ కౌంటర్ యంత్రం దగ్గరకు చేరారు.

"వర్కింగ్ వోల్టేజ్ ఎంత?"

"ఎనిమిదివంద లుందండి......"

"బాగా సపరేషన్ వుందా, రెంటికీ?"

ప్రొఫెసర్ మూర్తి ప్రశ్నకు జవాబుగా రావు రెండు గ్రాఫ్ పేపర్లు చూపాడు.

"ఇది జిర్కోనియం, ఇది స్ట్రోంటియం...... ఆర్.ఎఫ్.వాల్యూలు. పాయింట్ తొమ్మిది, పాయింట్ నాలుగు ఆరు, పాయింట్ సున్నా అయిదు"

"పీక్ వాల్యూ చూపించేసారి......"

రావు శ్రావణంతో అక్కడున్న కాగితపు ముక్కల్లో ఒక దాన్ని కౌంటర్ విండోలో వుంచాడు. సీసపు ద్వారం మూసేసి, వోల్టేజి సరిగ్గా వుందని నిర్ణయించుకుని, ఒకేసారి కౌంటర్ కౌంటింగ్ స్విచ్‌నీ, స్టాప్‌వాచినీ నొక్కాడు.

ఒకదాంతో ఒకటి పందా లేసుకుని కౌంటరులో బల్బులూ, సెకండ్ల ముల్లూ పరుగెత్తసాగాయి.

ప్రొఫెసర్ మూర్తి అవన్నీ గమనించడంలేదు. రావు వెనకాల నిల్చుని రావు జుత్తువంకా, అతని ముఖంకేసీ చూచాడు.

వెలిగి ఆరిపోతూన్న కౌంటింగ్ బల్బుల్లో రావు ముఖంలో క్రీనీడలు లీలగా కన్పించాయి మూర్తికి. రాత్రి పదిగంటలదాకా తనతో కూర్చుని, కౌంటర్ వద్దా, క్రోమటోగ్రాఫిక్ కాలమ్‌వద్దా ఇలా తనకు సహాయం చేయటం రావుకి కొత్తకాదు. తన దగ్గర పని చేసిన విద్యార్థులంతా ఒక ఎత్తు—రావు ఒక ఎత్తు. వాళ్ళందరూ డిగ్రీలకోసం చదివారు. తనకు మస్కా వేసేవాళ్ళు. పండగలప్పుడూ, తన పుట్టినరోజు (ఎలా కనుక్కునేవాళ్ళో) అప్పుడూ వారి దగ్గర్నుంచి గ్రీటింగ్స్ కురిసేవి.

రావు తనకు తెలిసి ఎన్నడూ ఎవరితోనూ పెద్దగా మాట్లాడడం కూడా చూడలేదు తను. ఒకసారి తను కారుమీద నెమ్మదిగా ఆలోచించుకుంటూ పోతున్నప్పుడుకూడ చూచా డతన్ని. పేవ్‌మెంట్ ప్రక్కగా తల వంచుకుని అడుగులువేస్తూ పోయేవాడు రావు.

ప్రొఫెసర్ మూర్తి ఆలోచనలు అంతరాయ

చెప్పేస్తూ, రావు కౌంటర్ స్విచ్ నొక్కాడు. ఎక్కడి లైట్లక్కడ నిల్చిపోయాయి మూర్తి నెంబరు చూచాడు.

"రెండువందల అరవైనాలుగు......ఊ......" గ్రాఫుపేపరులో కర్వులోపలా, ఇపుడు రావు చూపించిందీ ఒకటే అయాయి. ప్రొఫెసర్ మూర్తి గంభీరంగా పోయి కుర్చీలో కూర్చున్నాడు. రావు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"మరి మనం రేపు బయలుదేరాలి......" అన్నాడు ప్రొఫెసర్ మూర్తి సంచీ మూసేస్తూ.

"సారీ సార్......నాకు....వీలవదేమోనని భయంగా వుంది."

మూర్తి తలెత్తి చూచాడు. అదే ముఖ వైఖరి. ముడిపడ్డ కనుబొమలు......కొద్దిగా తెగిన జుత్తు.

"ఏం? కన్వెషన్స్ రాలేదా నీకు......"

"నే నసలు అప్లయి చెయ్యలేదండీ......"

"ఎందుకని? నేను చెప్దామనుకుంటూను మూడో తేదీకి సైన్స్ కాంగ్రెస్‌కు పోతున్నామని......లేకపోతే ఈ పేపర్లూ, గ్రాఫులూ తొందరేమొచ్చింది?"

రావు మాట్లాడలేదు. మూర్తికి కొంచెం కోపం వచ్చింది. పోయినసారీ ఇలాగే. అందరూ కలిసి టాండ్వాఫాల్స్ పోదామని పిక్నిక్‌వేస్తే తను రానన్నాడు. ఎవరో చెప్పారు; వ్యక్తిగతమైన కారణా లన్నాడని.......

"ప్రత్యేకమయిన కారణమేమన్నా ఉందా?" అని అడిగాడు మూర్తి.

"లేదండి......" వినయంగా జవాబిచ్చాడు రావు.

మూర్తి గ్రహించాడు.

"డబ్బు కావాలంటే......"

"థాంక్స్ సర్......అదికాదు......"

మూర్తి రావువేపు చూచాడు. ఆమెరిసేముఖంలో ఎంత ఆత్మాభిమానం! మూర్తి నవ్వుకున్నాడు.

"ఆల్‌రైట్......నేను ఎనిమిదోతేదీ వస్తాను. ఈలోగా ఆ ఎక్స్‌ఛేంజి చూడు......"

"సరే సార్......"

ప్రొఫెసర్ మూర్తి బయటికి నడిచాడు. రావు కౌంటర్‌దగ్గరకు పోయాడు.

మెట్లు దిగసాగాడు ప్రొఫెసర్ మూర్తి.

"మిస్టర్ రావ్......"

"సర్......" రావు మెట్లు దిగివచ్చి నిల్చున్నాడు.

"నీవు ఈవారం సెలవు కావాలంటే తీసుకో..... మీ వూరికిపోవచ్చు.......నేను కూడా రెండురోజులు తర్వాతే వస్తానేమో?"

"ఈ వారమంతా సల్ఫర్—35 తో సరిపోతుందేమో......"

"నీ ఇష్టం....బై....."

"గుడ్‌నైట్ సర్......" రావు లోపలికి పోయాడు.

కారు నెమ్మదిగా కెమిస్ట్రీ డిపార్టుమెంటునుంచి సైన్సు కాలేజీ దాటింది.

మూర్తి ఆలోచించసాగాడు. నాలుగోతేదీన సైన్సు కాంగ్రెస్‌లో పేపరు చదవాలి. ఒకటి రావు చదువుతే బాగుండేది......చిత్రమైనవాడు. అంత చిన్నవయసులో అంత నిగ్రహం.....అంత పట్టుదల.......రావు మొదటిసారి వచ్చి తన్ను డాక్టరేట్ కోసం గైడ్‌గా అడిగినప్పుడు తను ఎందుకో ఒప్పేసుకున్నాడు.....అతన్ని చూడగానే ఏమిటో జ్ఞాపకం వచ్చిం దానాడు.

మూర్తి గాఢంగా నిట్టూర్చాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.....కటక్‌లో పనికాగానే విజయనగరం పోవాలి ...... సుందరం ఎంతో సంతోషిస్తాడు.....తను తెలీకుండా వాడిదగ్గరికి పోతే ..... ఎగిరి గంతేయడూ వాడు......మూర్తి ఆనందంతో నవ్వుకున్నాడు......ఎక్కడి సుందరం.....నాలుగో క్లాసునుంచీ క్లాస్‌మేట్.....వా డిప్పుడు జిల్లా బోర్డు టీచరు......సెకండరీగ్రేడ్.....తను..... రీడర్.....ఎం.ఎస్సీ; డాక్టరేట్ రేడియో—ఆక్టివ్, ఐసోటోప్స్ విడదీయటంలో......ప్రస్తుతం 'కాశీ'లో రీడర్......ప్రొఫెసర్ మూర్తి.....డాక్టర్ ఎ. ఆనందమూర్తి, ఎం.ఎస్సీ., పి.హెచ్‌డీ., ఎస్సీ.డి (పారిస్)

సాక్షి చెబుతున్న అబద్ధాలు విని విసిగిపోయిన జడ్జీ అతణ్ణి మందలించాడు.

"అయ్యా! నేను పుట్టినప్పటి నుండి సత్యానికే కట్టుబడి ఉన్నాను." సాక్షి తనను తాను సమర్థించుకుంటూ విన్నవించుకున్నాడు.

జడ్జీ చిరునవ్వు నవ్వుతూ "బహుశా ఇప్పుడు విడకులు ఇచ్చివుంటావు!" అని చలోక్తి విసిరాడు.

బి. వి. సోమయ్య (సత్తెనపల్లి)

మూర్తి ఇంటిదగ్గర కారువేగం తగ్గించాడు. కారు కాంపౌండ్‌లో నిలిపి, లైటువేసి, తలుపు తీశాడు. ఉహు.....జాబులేమీ ఇంటికి కూడా రాలేదు......

ఒక్కక్షణం ప్రపంచంలో ఏకాకి అయిపోయినట్లు భావించాడు మూర్తి.....ఈకారూ, ఈ ఖ్యాతీ, ఉద్యోగం.......ఈ జీతం ..... ఇన్నిటిమధ్యా అసంతృప్తి ...... ఏదో ఎక్కడో తప్పుచేశామన్న ఆవేదన......తెలియని బాధ......ఆరోజు తాను నిజంగా అంత పిచ్చిగా వుండకపోతే? ఎం. ఎస్సీతో ఆపి అలాగే బ్రతికివుంటే? ఈ కారూ, హోదా, రూపాయలూ వుండేవికావు......కాని.....

నెలకు రెండువందల ముప్ఫైఅయిదు రూపాయిల జీతం, వారానికి ఇరవయినాలుగు గంటల పనీ, స్టూడెంట్సూ వుండేవాళ్ళు......పి. యు. సీకి సల్ఫ్యూరిక్ ఆసిడూ, బి. యస్సీ కి రేడియో ధార్మికతా చెప్పేవాడు .... చాలీచాలని జీతం...... అప్పులు.......పేరూ ఊరూ లేని ఉద్యోగం....

కానీ సుశీల వుండేది ప్రక్కగా.....పున్నమి వెన్నెల్లాంటి సుశీల ...... అమావాస్యరేయి తారల వెలుగులాగా .... తనప్రక్కనే, తనవద్దనే......

తా నా రోజు తప్పుచేశాడా?......

* * *

"మావాళ్ళు ఆగరు ఆనంద్! నిజం చెప్తున్నాను" అంది సుశీల ఆరోజు. ఆ కంఠంలో ఆవేదనా, ఆరాధనా తనకు ఎందుకు అర్థంకాలే దారోజు?

"అదికాదు సుశీ......నామాట విను......ఈ ఉద్యోగం గొర్రెతోకలాంటిది......నీకూ నాకూ సరిపోతుంది......కానీ......తరువాత? జీవితంలో అన్ని సౌఖ్యాలూ అనుభవించవద్దా మనం......కనీసం మన.. మన పిల్లలు? నా ఫ్రెండ్ రాశాడు.....చూడు..... సరిగ్గా నాలుగేండ్లు......డాక్టరేట్ రాగానే వచ్చేస్తాను......తర్వాత......"

"అంతదాకా నేను వుండలేను ఆనంద్!"

అంతకన్నా ఏమీ అనలేదు సుశీల. తన కారోజు డాక్టరేట్—ఫ్రాన్సులో జీవితం—హోదా ఇవే కన్పించాయి......తమ ఇద్దరిసంగతి సుశీల తల్లిదండ్రులకు తెలీదనీ, సుశీల పెండ్లికి వాళ్ళు చాలా ప్రయత్నాలు చేస్తున్నారనీ తనకు విన్పించలేదు కన్పించలేదు.

"పోనీ మా అన్నయ్యను నీకు తెలుసుగా, అడుగు"

"ఏమని అడుగను సుశీ? నేను నాలుగేండ్లలో వస్తాను. ఈ అవకాశం పోతే రాదు.....నీవు నా కోసం కాచుకొనివుండాలి....నాకోసం, నీకోసం, మనిద్దరికోసం......"

"నీ కర్థంకాదు ఆనంద్! నీవు పోయిన క్షణం నేను ఏకాకి అయిపోతాను.....నాకు ధైర్యంలేదు.... తర్వాత విచారించి లాభంలేదు......"

"ఎందుకని నిస్పృహ ఇప్పట్నుంచీ......"

ఆరోజు సుశీలహృదయంలో రేగే తుఫానును తన హృదయంలోని బెరామీటర్ కనుక్కోలేకపోయింది......తను అబలననీ, తను తల్లిదండ్రుల మాటకొరకు ఎవర్నయినా వివాహమాడాల్సి వస్తుందనీ సుశీల అన్నమాటల్ను తనానాడు లెక్కచేయలేదు.

తను ఫ్రాన్సుకుపోవడం .... సుశీలవివాహం జరగడం జరిగాయి.....ఎఫిల్‌టవర్ నీడలో, లాబరేటరీలో కౌంటర్లమధ్యా ఆనందమూర్తి యాంత్రికంగా డాక్టరేట్‌కు పని చేశాడు.......డాక్టరేట్ వచ్చింది......

అదంతాఇరవయ్యేళ్ళనాడు.....తను ఇంకా పెండ్లి చేసుకోలేదు.....మళ్ళీ మరో సుశీల ఎలావస్తుంది?

మూర్తి గదిలో నీలందీపం స్విచ్‌వేసి పడుకున్నాడు......

కిటికీలోంచి వెన్నెల ఆనందమూర్తి మంచం మీద పాలుపొంగినట్లు వెలిగింది....

బాధగా, నిస్త్రాణగా, ఏదీ తెలియని వ్యథతో కండ్లు మూసి నిద్రకోసం ప్రయత్నించాడు ప్రొఫెసర్ మూర్తి, ఎం.ఎస్సీ., పి. హెచ్ డి., ఎస్. సీ. డీ. (పారిస్)......

* * *

కటక్‌లో సైన్సు కాంగ్రెస్ అయిపోయింది. నాలుగోతేదీన రెండువందలమంది ప్రతినిధుల ముందు ఒక "పేపరూ,"అయిదోతేదీ మరో పేపరూచదివాడు. మూర్తి. చాలామంది బాగుందని మెచ్చుకున్నారు.

ఏడోతేదీని మెయిల్లో విజయనగరం బయలుదేరాడు. పక్కపల్లెలో సుందరం టీచర్. చిన్ననాటి సహపాఠి. మిత్రుడు.

అయిదేండ్లతర్వాత వాడ్ని చూడడం తటస్థిస్తోంది. వాడికి తనేం తీసుకుపోటంలేదు...... ఇల్లు కనుక్కోడం ఎలాగో! అనుకున్నాడు. రిక్షామంచి దిగి బయలుదేరాడు.....మరో అరమైలు వుంటుంది కాబోలు. దూరంగా కొన్ని ఇండ్లగుపించాయి.

ఈ పల్లె కొంపలోవున్న బోర్డు పాఠశాలలో సుందరం టీచరు.....నెలకు అరవై యేభై....ఎనభై కాబోలిప్పుడు.....

చేతిలోసంచి బరువుగా వుంది. అంతా క్లోక్ రూంలో వుంచేశాడు కాబట్టి సరిపోయింది.

"వానవచ్చేట్టుంది" అనుకున్నాడు మూర్తి..... 'మరో అరమైలు వుంటుందా......' అనుకుంటూ త్వరత్వరగా నడువసాగాడు.....

వాన మొదలయింది. చుట్టూతా చూచాడు. ఓ మర్రిచెట్టు కన్పించింది కల్పవృక్షంలాగా.... క్రింద చేరుకున్నాడు.......వాన, జడివాన అయింది...

"ఎంతదాకా వెడుతున్నారు?"

ఉలికిపడ్డాడు మూర్తి ప్రశ్నవిని.

సిగరెట్ త్రాగుతూ ఆరడుగుల ఎత్తున నిల్చుని చేతిలో ఒక పుస్తకంతో సాక్షాత్కరించాడు ఎవరో......

"సుందరం......మా స్నేహితుడిక్కడ టీచర్.."

"ఎవరన్నారూ.....సుందరమా......ఇంటిపేరు?"

చెప్పాడు మూర్తి.....

"మీరు ఎక్కణ్ణుంచి వస్తున్నారు......?"

అదీ చెప్పాడు.

"పాపం. వృధాశ్రమ...సుందరంగారు మరో ఊరికి ట్రాన్ఫరయి మొన్నసోమవారం వెళ్ళిపోయారు......నేనే అతని ప్లేస్‌లో వచ్చాను...."

ఇద్దరూ పరస్పరం పరిచయంచేసుకున్నారు ....

"మీ కభ్యంతరం లేకపోతే మీరు రాత్రికి మా ఇంట్లో వుండి పొద్దున్నే పోవచ్చు......"

మూర్తి నసిగాడు......వాన తగ్గింది......

"పదండి......అదే మా ఇల్లు"

మూర్తి అతన్ననుసరించాడు.

"ఇదే మా ఇల్లు......తోట బాగుందంటారా.... మా ఆవిడ స్పెషాలిటీ ...... రోజాలు...ఇది నా స్పెషల్‌లెండి.....గోంగూర......

మూర్తి నవ్వాడు......అతనూ కలిపాడు....

"కూర్చోండి......" కుర్చీ చూపించాడు అతను. మూర్తి కూర్చున్నాడు. చుట్టూతా ఫోటోలూ, కాలెండర్లూ వున్నాయి.

"మరి సైన్స్ కాంగ్రెస్ అయిపోయిందా? మీ రేవయినా......"

"ఏదో—రెండు పేపర్లు చదివాను...."

మూర్తి మనస్సులో కొంత నిరాశగానేవుంది. ఇన్నిరోజుల తర్వాత తమ రావడం—సుందరం లేకపోవటం.

"మీరు కాశీలోకదూ అన్నారూ......పని చేసేది. నాకు మీ సబ్జెక్ట్సు తెలీదనుకోండి ..... మీకు రామారావు తెలుసా?"

"ఎవరు? ఏ క్లాసు?"

"ఎం. ఎస్‌సీ అయిపోయింది....డాక్టరేట్‌లో చేరాడు......"

"అరే! రామారావు......నా స్టూడెంట్ ఒకతను రామారావు ..... తెలుగువాడే ..... సన్నగా ఎర్రగా వుంటాడు ...... ఇంటిపేరు 'పి' కదూ.....?" అన్నాడు ఆశ్చర్యంగా మూర్తి.

"అయితే అతనే......మీకు - ఆశ్చర్యం కలుగుతుందేమో......అతను నా కుమారుడు......"

మూర్తి నోరు తెరిచేశాడు.

"అంతా వాళ్ళ తాతగారి చలవనుకోండి....... అంతా ఆయనే సహాయం చేశారు. వాడి చదువుకి"

"రావు — అలా పిలుస్తాం మేము....చాలా విచిత్రమయిన మనిషి ...... అంత చిన్నవయసులో అంత పట్టుదలా, తెలివీ వున్నవాడు కన్పించలేదు నాకు. అటువంటి విద్యార్థి దొరకడం కష్టమే"

అతను సంతోషంగా తల వంచుకున్నాడు.

"మీ రన్నారు కనుక చెపుతున్నాను. తండ్రిగా నేను వాడ్ని చాలా దగ్గిర తీయలేదు.....అంతా వాళ్ళ తాతగారింట్లోనే పెరిగాడు. వాడి పోలికలన్నీ నా భార్యవి......అదోహ తరహా మనిషి ఆమె......నేను మొదటిరోజుల్లో బియ్యేకి కట్టుదామనీ, ఎం. ఏ. చేద్దామనీ అనేవాడిని. తను అనేది : "డిగ్రీలుండగానే సరికాదు' అని. నాకు నిజం అనిపిస్తోంది: నేను ఇక్కడ మొత్తం ఎనభయి రూపాయిలు సంపాయిస్తాను ...... పొలంగింజ లున్నాయనుకోండి.... పైన ట్యూషన్లుంటాయి.....అదికాక — కొంచం రాత మూలకంగా వస్తుంది"

"మీరు రచయితలా......?"

"ఓవిధంగా ..... అప్పుడప్పుడూ రాస్తుంటాను. ఇదీ మా ఆవిడ చలవే. చాలారోజులక్రిం దోసారి ఏదోరాసి ఆమెకు వినిపించాను. ఆమె సలహా ప్రకారం పత్రికలకు పంపాను—అచ్చయింది.....అదే మొదలు"

"మీరు నిజంగా అదృష్టవంతులు....."

"ఇప్పుడే వస్తాను......" అని లోనికెళ్ళా డతను.

మూర్తి గోడలకేసి చూస్తూ కూర్చున్నాడు. ఒకవేపు ఫోటో కన్పించింది......

మూర్తిహృదయం విపరీతంగా కొట్టుకుంది. మరింత జాగ్రత్తగా చూచాడు.....వీళ్లేదు.....అలా జరగటానికి వీళ్లేదు......ఏమిటీ సంఘటన......?

"ఫోటోలు చూస్తున్నారా? అది నేనూ, నా భార్యా తీసుకున్నది.....ఇదొక్కటే ప్రస్తుతం...... అరె—ఒంట్లో బాగోలేదా?"

"అప్పుడప్పుడూ వస్తూంటుందిలెండి. ఫర్వాలేదు" అనగలిగాడు ప్రొఫెసర్ మూర్తి కళ్ళు మూసుకుని. కుర్చీలో వెనక్కి జారగిలబడ్డాడు భారంగా.

ఇరవయ్యేళ్ళ గతం ఒక్కసారిగా కట్టకట్టుకుని తనమీదుగా పిడుగులాగు పడింది......తనేనాడూ తలుచుకోలేనిసంఘటన మెరపులాగాతటస్థించిం దీరోజు.

ఎక్కడి సుశీల......ఎక్కడి రామారావు! పారిస్... కాశీ......విజయనగరం.....టీచర్ భార్య......రీడర్...

"ఎలావుంది?" ఆదుర్దాగా అడిగా డాయన.

"తగ్గింది" అతను సంతృప్తిగా నిట్టూర్చాడు.

"చూడండి....మీ రేమీ అనుకోకపోతే నేను వెళ్ళాలి. వేరే పనుంది......జ్ఞాపకం వచ్చింది..."

"అంత తొందరేమిటండీ! మీరు మా కిప్పుడు దూరపుచుట్టాలు కాదు.....రామం గురువుగారు.... మా ఆతిథ్యం స్వీకరించాల్సిందే!" అన్నా డాయన.

అవును. బంధుత్వం గురించి అతనికేం తెలుసు? రాత్రి భోజనా లయిపోయాయి. సుశీల కన్పించలేదు. మూర్తికి. 'కాశీలో ఇలాగే భోంచేస్తారా' అని అతను టేబిల్‌మీద భోజనాలు వేరుగాపెట్టాడు.



వాన కురిసింది

"మీ రా గదిలో పడుకోవచ్చు......రామం వస్తే అది వాడికోసం వుంచాను......సెలవుల్లో వస్తాడు కాబోలు......మీకు ధోవతిస్తాను.....కట్టుకోండి.."

రాత్రంతా నిద్రపట్టలేదు మూర్తికి. ఏమిటీ విచిత్రం! ఇరవయ్యేళ్ళనాటి బంధం ఈరోజు విడిపోవాలా? తనేం చేయగలడు?

"సుశీల కన్పిస్తే చూడాలి, ఎలావుందో?" అనుకున్నాడు. అతనికి వెంటనే జ్ఞాపకం వచ్చింది రామారావు సంగతి. బహుశా ఈ వేళకు కౌంటర్ దగ్గర కూర్చుని సగం మూసుకుపోతున్న కండ్లతో 'కౌంట్స్' లెక్కిస్తూంటాడు. అదే సీరియస్‌నెస్, అవే కండ్లు, నడక.....జుత్తు.....సుశీల కొడుకుకదూ!

"ఇన్నిరోజులూ ఎలా జ్ఞప్తికి రాలేదు నీవు?" అని ప్రశ్నించాడు తనకు అగుపడని సుశీలను..... సుశీల—ప్రస్తుతం తనకు ఆతిథ్యం ఇస్తూంది.....

మర్నాడు పొద్దున్నే అతను మూర్తిని లేపాడు. మొదటి బస్సులో విజయనగరం చేరుకున్నాడు మూర్తి. వేకువజామున చీకట్లో సుశీల కనుపించలేదు.......క్రీనీడల్లో 'రామం తల్లి' కన్పించింది ...దిగులుగా వెళ్ళాడు మూర్తి.

కాశీ చేరుకున్నాడు మూర్తి. ఆరోజు సాయంత్రం లాబొరేటరీకి వచ్చాడు. అతని మనస్సులో సుడిగాలి రేగుతూవుంది.

"గుడీవెనింగ్ సర్" రావు ఎదురువచ్చాడు. ఒక్కక్షణం పాటు మ్రాన్పడి నిలబడిపోయాడు మూర్తి. తమాయించుకుని గదిలోకి నడిచాడు.

కాస్సేపటికి రావు వచ్చాడు. గ్రాఫులూ, కాగితాలు తీసుకువచ్చి టేబిల్‌మీద వుంచాడు.

"ఎక్స్ఛేంజ్ అరవయి డిగ్రీలలోపల రాలేదండీ......దాదాపు రెండు గంటలకు కూడా రియాక్షన్ జరుగలేదు.....అరవయిపైన...."

రామారావు......రామం....సుశీల కొడుకు..... తను భాగస్వామిగా ఎంచుకున్న, ప్రేమించిన సుశీల కొడుకు—కాని తన కొడుకు మాత్రంకాదు..... శిష్యుడు....మూర్తి తలెత్తాడు......రామారావు ఆగాడు.

"మొన్న మీ ఇంటికి వెళ్ళాను.....అనుకోకుండా... విజయనగరందగ్గర మా మిత్రుడికోసం పోయాను... అతనులేడు. రాత్రికి మీ నాన్నగారే ఆతిథ్యం ఇచ్చారు.." రామారావు కళ్ళు పెద్దవయాయి—అవే పోలికలు—తిరుగులేదు. సుశీల ప్రతిరూపం.

రామారావు తలవంచుకుని వింటున్నాడు. పార్కులో సాయంత్రం చీకటి పడినప్పుడు సుశీల అలాగే నిల్చునేది......మనస్సు రేగిపోతూంది.

"రాత్రి అక్కడేవుండి, ప్రొద్దుటే వచ్చాను. మీ నాన్నగారు బాగున్నారు. మీ అమ్మగారిని....." మూర్తికంఠం వణికింది. రామారావు ఉలిక్కిపడి తలెత్తి చూచాడు. ఆశ్చర్యం ప్రతిఫలించింది ఆ కండ్లలో. ఏమయిందన్నట్లు చూచాడు ప్రొఫెసర్ మూర్తి. రామారావు తల వంచుకున్నాడు. తర్వాత అస్పష్టంగా "మా అమ్మ చనిపోయి పదిహేనేళ్ళయిందండి" అన్నాడు.

రామారావు చెంపలమీదా, మూర్తి హృదయంలోనూ వాన కురిసింది. ★

దగ్గర తీరిగ్గా సిగరెట్టు కాలుస్తున్నాడు .... అతనికి తెలిసింది. ఆ బుల్లెమ్మను స్కూలునుండి ఇతగాడు ఇంటికి తీసికెడుతున్నాడు. అలా అనుకుని మరి రెండడుగులు ముందుకు వేసేసరికి ఆ సంఘటన జరిగింది.

ఆ కొంటెపిల్ల ఎవర్నీ లెక్కచేయకుండా, రోడ్డు మధ్యగా నడచిపోతోంది. ఎదురుగా బస్సు—వెనక లారీ—పక్కన రెండెడ్లబండి .... బెదరిన ఎడ్లు గుడ్డిగా బండిని లాగేస్తున్నాయి. బస్సు బాణంలా వచ్చేస్తోంది. ఆలోచించేందుకు వ్యవధి లేదు. రెండడుగుల్లో ముందు కురికి ఆమెను ఒక చేత్తో లాఘవంగా ఎత్తేసి ఎడంపక్క కురికాడు. ప్రళయం పగిలినట్టు పెద్దరొదతో బస్సు ఆగింది. నారయ్య ఊపిరి పీల్చుకుందికి ఆగాడు. గుమిగూడిన జనం అతన్ని అభినందించారు..... ఇంతలో కిళ్లీకొట్టుదగ్గరున్న 'ఆసామీ' పరుగెత్తుకొచ్చాడు.

'నువ్వు నిజంగా దేవుడివయ్యా ! .... అమ్మాయిగార్ని రక్షించావు. లేకపోతే నా గతేంకాను ? నాపని ఊడటంసంగతి అటుంచి, జైలుకు పోవలసి వస్తుంది .... ఇంద .... సిగరెట్టు కాలుస్తావా ? ... ఓహో ! చుట్ట తప్పించి ఏదీ కాల్చవన్నమాట.'

నారయ్య తన బట్టలకేసి చూసుకున్నాడు. మాసి, అసహ్యంగా ఉన్నాయి. అందుకే తనకు వోసిగరెట్టుకూడా కొనుక్కుని కాల్చే యోగ్యత లేదని అతను తీర్మానించాడు గామోలు—నారయ్య సమాధానం చెప్పేలోగా, ఆ అమ్మాయి గదమాయించింది.

'చాల్లే అవతారం ! .... నన్ను రోడ్డుమధ్య వదిలేసి నువ్వు సిగరెట్టు కాలుస్తున్నావు. ఇందుకేనా నాన్నారు నీకు జీతం ఇచ్చేది ? అతను పరుగెత్తుకొచ్చి నన్ను పక్కకు తప్పించకపోతే నాగతేంకాను ? .... అమ్మ ఏడుస్తుంది పాపం !'

నారయ్య ఆశ్చర్యంతో ఆమెకేసి చూశాడు. పదేళ్లకంటె ఎక్కువుండవేమో ! .... గుండ్రటి ముఖం, కళ్లల్లో చిలిపితనంతోపాటు విజ్ఞాన కాంతులు — వందమందిని ఒక్కచూపుతో ఆజ్ఞాపించగల గంభీరత్వం—నడకలో ఉన్న ఠీవిని ఇదివరకే గమనించాడు. ఈ చిన్నపిల్లలో మంచి చెడ్డలు, జాలి, దయ, కోపం, అన్నీ సవ్యంగా ఎలా రూపం ధరిస్తున్నాయి ? ఆలోచించి అతను సమాధానం కనుక్కోలేకపోయాడు. అదీకాక, ఆ అమ్మాయి తను రోడ్డుమధ్యగా నడవటం తప్పని, అందు మూలంగానే ఈ ఆపద జరిగిందని ఒప్పుకోటం లేదు. అందుకు అవతారమే కారకుడని వాదిస్తోంది...

'నీ పేరేవిటి?' అనడిగింది నారయ్యను. చెప్పాడు.

'పద నారయ్యా ! .... మా ఇంటికి పోదాం .... నాన్నగారితో జరిగినదంతా వివరించి చెప్పాలి ....'

'నే నెందుకు బుల్లెమ్మగారూ ! నా మానాన నేను పోతాను. ఏదైనా పని దొరుకుతుందేమోనని పట్నంలో నాలుగురోజులుగా తిరుగుతున్నాను.'

ఆ అమ్మాయి కోపగించుకుంది.

'అలా, ఎవరిమానాన వారు పోయేందుకు వీల్లేదయ్యా ! .... నీ దగ్గర డబ్బు లేదు. అందుక్కారణం నీకు పనిలేదు. అదంతా నాన్నారు చూసుకుంటారు .... పద—' అంటూ ముందుకు

నారయ్య

27—వ పేజీ తరువాయి

సాగింది. అవతారం తలవంచుకుని అక్కడే నిలబడ్డాడు. నారయ్యను, ఆమెను వెంబడించాడు.

ఆ అమ్మాయి ఓ ఇంటిముందు ఆగింది. చుట్టూ ప్రహరీగోడ—బయట ఉన్న బోర్డును బట్టి ఆ ఇంటియజమాని జనార్దనంగారని తెలుసుకున్నాడు.

జనార్దనంగారికి నలభై ఏళ్ల కెక్కువ వుండవు. చిరునవ్వుతో కూడిన ముఖం. ఒక్క చూపుతో, ఎదుటివాడి మనసులో ఉండే అభిప్రాయాన్ని పసిగట్టే నేర్పరితనం—చేతివేళ్లకున్న రాళ్ల ఉంగరాలు. మెడలో గొలుసు—బంగారు చెయినుతో రిస్టువాచి—సిల్కు చొక్కా—అన్నీ చూశాక ఆర్థి

ఆదాయపు పన్ను అధికారులకు ఒక ఉత్తరం అందింది. లేఖకుని ఊరూ, పేరూ లేని ఆ ఉత్తరంలో ఇలాఉంది: "మూడు సంవత్సరాలనుంచి నేను పన్నులు ఎగవేస్తున్నాను. ఇప్పుడు నా అంతరాత్మ నన్ను బాధిస్తోంది. నిద్రపట్టటంలేదు. ఈ ఉత్తరంతో రు 500 కరెన్సీ నోట్లు పంపుతున్నాను. ఈ డబ్బు పంపిన తరువాత కూడా నిద్రపట్టకపోతే, మిగతా డబ్బు పంపుతాను."

షేక్ మస్తాన్ (బందరు)

కంగా ఆయన స్థితిగతులు ఊహించుకున్నాడు నారయ్య.

ఆ అమ్మాయి అంతా వివరించింది.

నారయ్య తనపరిస్థితి వివరించాడు.

'నా తల్లికోసం ఏమైనా చేస్తానండి .... అది సుఖంగా ఉండటమే నా క్కావలసింది. అదే కష్టపడి నన్ను అయిదో తరగతి దాకా చదివించింది .... అది బాధపడితే నేను సయించలేనండి .... ' అని ఆయనముందు కూర్చుని కన్నీరు కార్చాడు.

'అంతే నారయ్యా ! .... పట్నం అందంగానే ఉంటుంది. కాని గడుసుతనం ఉంటేనే కాని, కాలు మోపేందుకు క్కాడా చోటు దొరకదు. పాప ఎలాగూ నిన్ను తీసుకొచ్చింది. ఇంక నీ కొచ్చిన చిక్కు ఏమీ లేదు. మాయింటో పనిచేస్తూ ఉండిపో !'

నారయ్య ఆనందంతో కళ్లు మూసుకున్నాడు.

* * *

నారయ్య కిదంతా గుర్తుకు వచ్చేసరికి, గుండె చివుక్కుమంది. బలవంతాన నోరు నొక్కి ఉంచిన అంతరాత్మ "చురుక్కు" న పొడవ నారంభించింది. చేసిన తప్పును చేయిదాటకముందే సరిదిద్దుదామని వెనక్కి తిరిగి స్కూలువైపు నాలుగడుగులు నడిచాడు.

అంతే — మనసు మళ్లీ సింహాసనమెక్కి కూర్చుంది.

'మరి మీ అమ్మ సంగతేమిటి ? అరవై యేళ్లు నిండాయి. వంటో శక్తి లేదు. మనసులో నరాలు లేవు. పనిచేసుకుని బతకలేదు. నిన్ను తల్చుకుని అలా కుక్కిమంచంలో పడుకుంటుంది .... అలాంటి ఆసహాయురాలు, ఎండకు మాడి, వానకు తడిసి, ఆశ్రయంలేక వీధమ్మటపడి తిరుగుతే నువ్వు సహించగలవా ? జనార్దనంగారు మంచివారే ! .... కాదనను. కాని, నీ కష్టాన్ని గ్రహించి ఆయన నీకు సాయంచేయలేకపోయారు .... కసిరి కొట్టారు. జ్ఞాపకం ఉంచుకో.'

నారయ్య కీహెచ్చరిక సమంజసంగా కనబడింది. వెనక్కి తిరిగి, తిరిగి ఇంటివైపు నడక ప్రారంభించాడు.

* * *

నారయ్య పనిలో ప్రవేశించి నెలరోజులైంది. కార్యక్రమం స్థిరపడింది. పొద్దున్న తొమ్మిది గంటలదాకా ఇంట్లో చిల్లరపనులు చేయటం — తరువాత పాపను స్కూలుకు తీసికెళ్లటం — పదిగంటలకు బడి — ఆ తరువాత తోటపని — ఇంటి వెనక ఉన్న పూలతోటంటే జనార్దనంగారికి ప్రాణం. కొత్త కొత్త ఎరువులు, విత్తనాలు, అంట్లు కట్టడం, పూలమొక్కలకు శత్రువులైన క్రిమికీటకాలు—వీటినిగురించి ఎన్నో పుస్తకాలు చదివి ఆయన తెలుసుకుని ఆచరణలో పెట్టారు. నారయ్య కూడా శ్రమపడి ఆ తోటను పూలస్వర్గంలా చేశాడు. సాయంత్రం ఓ మూలగా నిలబడి తోటకేసి చూస్తుంటే అతనికి కొండంత గర్వం కలిగేది. రంగురంగుల, రకరకాలైన పూలు విచ్చి విరిసి నవ్వుతుంటే వళ్లు పులకరించేది. ఒక్కో పువ్వు ఒక్కోరకంగా ఉంటుంది. భగవంతుడు ఇంత ఖచ్చితంగా ఎలా సృష్టించగలుగుతున్నాడని ఆశ్చర్యపోయేవాడు.

'అది నారయ్యతోట — నాదికాదు.' అనేవారు. జనార్దనంగారు.

మూడుగంటలకు వెళ్లి పాపను ఇంటికి తీసుకురావాలి. తరువాత మళ్లీ తోటపని.

అదీ అతని దైనందిన కార్యక్రమం.

ఆ యింటో అడుగుపెట్టేవరకూ అతను ప్రేమించింది ఒక్క తల్లిని మాత్రమే ! ఇప్పుడతను, తల్లితో సమానంగా, ఆ యింటిని — అందులో ప్రతి వస్తువును, నివసించే ప్రతి వ్యక్తిని — ప్రేమించాడు. జనార్దనంగారు నెలకు ఇరవై రూపాయలు అతనితల్లికి పంపేవారు.

అలా ఆరు నెలలు గడిచాయి.

* * *

నారయ్య ఇల్లు చేరుకున్నాడు.

సుభద్ర హాల్లో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది.

నారయ్య

నారయ్యగుండెలు గబగబ కొట్టుకున్నాయి. భయంతో, కల్మషహృదయంతో అనాటివరకూ, ఆ యింటిగడప అత నెన్నడూ తొక్కలేదు. సుభద్రను చూసేసరికి అతని శరీరం వణికింది. చల్లటి ఆమె చిరునవ్వు అతనికి వేడిగాడ్పులా తగిలింది. అడుగుమీద అడుగువేస్తూ లోనికి పోయాడు. సుభద్ర తనముఖంలో కలుగుతున్న మార్పుల్ని గమనించకూడదన్న తాపత్రయంతో మరింత కంగారుపడి గోడను ఢీకొన్నాడు.

'అదేమిటి నారయ్యా! .... అలా దొంగలా నడుస్తున్నావ్? .... ఏమైంది? అలా చూస్తావేం?' అంది సుభద్ర నవ్వుతూ.

నారయ్య భయంతో, వెకిలిగా నవ్వాడు.

'అహ !.... మరేం లేదం డమ్మగారూ! .... మరి .... మరి .... ఎండలోంచి నీడలో కొచ్చాను కదండి మరి .... కళ్లు చీకట్లు కమ్మాయి. అంతేనండి' అన్నాడు మాటల్నిచేర్చి వాక్యాలు తయారుచేయటానికి ప్రయత్నిస్తూ.

'సరే కాని, పాపను భద్రంగా స్కూలుకు తీసికెళ్లావా? .... మెళ్లో గొలుసు, అదీ భద్రంగా ఉందా?'

నారయ్య ఉలిక్కిపడ్డాడు.

శూలంతో ఎవరో పొడిచి హింసిస్తున్నట్లయింది.

సుభద్ర రోజూ వేసే ప్రశ్న యిది. అందులో కొత్త ఏమీ లేదు.

'అదేమిటం డమ్మగారూ! .... అలా అడుగుతారు? నే నుండగా బుల్లెమ్మగార్ని ఎవ రంటగలరండి? చేతులు విరగ్గొట్టేస్తాను. అన్నీ భద్రంగా ఉన్నాయండి.'

ఇది నారయ్య మామూలుగా ఇచ్చే జవాబు.

కాని ఈనాడు? .... నోరు తెరవలేకపోతున్నాడు.

'మాట్లాడవేం? .... ఏ దొంగైనా కాజేశాడా ఏమిటి?'

నారయ్య అతి కష్టంమీద నవ్వాడు.

'అబ్బెబ్బే! .... అలా ఎన్నటికైనా జరుగుతుందాండి? .... అన్నీ భద్రంగా ఉన్నాయి.'

నారయ్య వడ్డించుకు తిన్నాడు.

అతనిలో రెండు తీవ్ర శక్తుల మధ్య పోరాటం జరుగుతోంది.

అరగంటతరువాత హాల్లోకి వచ్చేసరికి పక్కగదిలోంచి సుభద్ర గుర్రుపెడుతూ నిద్రపోతున్న శబ్దం వినపడింది.

టేబిలుమీద ఆ ఉత్తరం కనపడింది.

తన్ను నీతికి దూరంగా ఉండమని బోధించిన ఉత్తరం...

నారయ్య మళ్లీ ఆలోచనలో పడ్డాడు.

ఆ క్రితంరోజు సాయంత్రం అమ్మదగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. అప్పుడప్పుడు ఆ ముసిల్ది ఏమైనా రాయిస్తుంది. నారయ్య వెంటనే జవాబు రాయటం అలవాటు .... కాని ఈ ఉత్తరం అలాంటిదికాదు.

'నిన్ను కష్టపెట్టేందుకే ఈ పాపిష్టి జన్మ ఎత్తాను. .... ఏంచేసేది చెప్పు? నువ్వు పంపేపదీ, ఇరవైలతో సుఖంగా ఉన్నా — కాని ఆ రెండొందల మాటేమిటి? నాలుగురోజుల్లో ఇల్లు వేలం వేస్తారట. నేను వీధిలో ఉండాల్సిందే. మొదట్లో నీకు రాయకూడ దనుకున్నా. కాని ఎవరితో చెప్పుకోటం? రెండొందలు ఒక్కసారిగా ఇవ్వలేకపోతే పంద్రైనా ఇమ్మంటున్నాడు నాయుడు — రెండు మూడు నెల లాగమని బతిమాలాను. కాళ్లు పట్టుకున్నా. కాని 'ససేమిరా' వీల్లేదన్నాడు. అందుకే నీకు రాయిస్తున్నా. నా ఖర్మకు నన్ను వదిలేయి .... నువ్వు బాధపడకు.'

ఆ వూరి స్కూలు మేష్టరు అమ్మ మనసులో ఉండే బాధను చక్కగా వివరించి రాశాడు. నాయుడుదగ్గర రెండు వందలు అప్పుచేసి ఇల్లు కట్టిన మాట అతను మర్చిపోలేదు. కాని అప్పు తీర్చట మెలా? .... వడ్డీ కూడా పెరిగిపోతోంది. అతను మర్చిపోకుండా, గుర్తుకుతెచ్చుకుంటూ, రోజులు దొర్లించాడు... ఆఖరుకు ఆపద రానే వచ్చింది. డబ్బివ్వకపోతే జాలి, దయ లేకుండా, "నాయుడు ముసిల్దాన్ని మెడపట్టి బయటకు గెంటుతాడు. అప్పుడు దాని గతేమిటి? తల్చుకునేసరికి గట్టిగా ఏడవాలనిపించింది. నడివీధిలో, ఇల్లు, వాకిలి లేకుండా దీనంగా ఆకాశంకేసి చూస్తూ ఏడుస్తూ నిలబడేతల్లిని తల్చుకుని కుమిలిపోయాడు."

ఆనాటిరాత్రి నిద్రలేకుండా అటూ ఇటూ పొర్లాడు. మర్నా డుదయం జనార్దనంగార్ని బ్రతిమాలుకుందామని నిర్ణయించుకున్నాడు. వెలుగంటూ కనిపించేందు కదొక్కటే మార్గం.

ఆ మర్నాడు పొద్దున్న జనార్దనంగార్ని చూస్తే అతనికి భయంవేసింది. చిటచిటలాడుతూ, ఇంటో అందరిమీదా ఎగిరిపడుతున్నారు. పుస్తకాలు, షెల్ఫు, అన్నీ గాలిస్తున్నారు. నారయ్యకు సంగతి పూర్తిగా అర్థంకాకపోయినా, ఏదో వస్తువు పోయిందని మాత్రం తెలిసింది. చిరునవ్వులేని ఆయనముఖం చూడటం ఇదే మొదటిసారి. పాప వంటింటో తల్లిదగ్గర కూర్చుంది.

అదృష్టం నారయ్యమీద శీతకన్ను వేసింది. కాకపోతే అలాంటి స్థితిగతుల్లో ఆయన్ని సాయం అడగాలనిపించదు. నెమ్మదిగా వెళ్లి ఉత్తరం చూపించాడు. చదివాక టేబిలుమీద విసిరారు.

'అయితే ఏమంటావ్?' అనడిగారు.

'ఏదో తమ దయ! .... ఇన్నాళ్లూ మీరే ఆదరించారు. కాపాడారు. ఈసారికూడా మీ దయకోసం ఎదురు చూస్తున్నా' అన్నాడు చేతులు నలుపుకుంటూ.

ఆయన కళ్లు చింతనిప్పు లయ్యాయి.

'ఏమయ్యా! .... ఇదేమన్నా ధర్మసత్రమనుకున్నావా? .... ఏదో పనిలేకుండా తిరుగుతున్నావు కదాని దయతల్చి నీకు ఆధారం చూపించాను .... క్రితంసారి మీ అమ్మకు నలభై పంపాను. అదే ఆఖరుసా రవుతుం దనుకున్నా. ప్రతిసారి అడిగితే ఎలాగయ్యా? .... ఇక్కడ ఖజానా మూలుగుతోం దనుకున్నావా? లేక మీ తాత ఏదైనా స్తిరాస్తి రాసిచ్చి పోయా డనుకుంటున్నావా? నువ్విలాంటి వాడివని తెలిస్తే, ఈ ఇంట్లో అడుగు పెట్టనిచ్చే

వాణ్ణి కాను. డబ్బు లేదు. వళ్లకాడు లేదు. ముందు మూటా ముల్లె సర్దుకుని దయచేయి నీ జీతం బాకీ ఏదైనా ఉంటే సాయంత్రం వచ్చి లెక్క తేల్చుకో.'

నారయ్యకు దుఃఖం పొంగుకొచ్చింది. ఆపుకోలేక తోటలోకి పోయి ఏడ్చాడు. జనార్దనంగారు పొమ్మన్నందుకు అతనికి బాధలేదు. తల్లిగతి ఏమవుతుందనే భయం—ఏమీ జరగనట్టు, ఏమీ చేయకుండా ఉండేందుకు వీల్లేదు. చీకట్లో వెలుగుకోసం వెదికాడు. దొరకలేదు. ఆయన కోపంలో, తన కష్టనష్టాలు గమనించ[illegible] అలా మాటల్ని చిత్తం వచ్చినట్టు వదలారు కాని, కోపం చల్లారాక నిజం తెలుసుకుని ఆదరిస్తారనే నమ్మకంతో ఎదురుచూశాడు.

గంట తరువాత ఆఫీసుకు వెళ్లిపోయారు.

ఆ ఆశకూడా మంచులా కరగిపోయింది.

నారయ్య తొమ్మిదింటికి పాపతో స్కూలుకు బయలుదేరాడు. మనసంతా మబ్బులో నిండిన ఆకాశంలా ఉంది. తల్లికి కనీసం వందైనా పంపి తీరాలి. అమ్మేందుకు తనదగ్గరేం లేదు. ఓ బంగారు ఉంగరం ఉన్నా బావుండిపోను. బంగారానికి మంచి ధర. పాప పదిగజాల దూరంలో నడుస్తోంది. నారయ్య పరధ్యానంగా నడుస్తున్నాడు. అతని కళ్లకు ఉన్నట్టుండి, ఆమె మెళ్లో ఉన్న బంగారు గొలుసు కనపడింది. ఆ గొలుసు ఉండటం పాప ప్రాణాలకే ముప్పని కొందరు సలహా యిచ్చినా, జనార్దనంగారు వినలేదు.

దురాలోచన కలగ్గానే, మనిషి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. వివేకం నశిస్తుంది. ఆత్మ తన శక్తిని కోల్పోయి ఓ మూల పడుకుంటుంది. మనసు ఉపాయాలు చెప్తుంది. లాభనష్టాలు వివరిస్తుంది. చేస్తున్న చెడ్డపని ఏవిధంగా 'మంచిదో' వివరిస్తుంది. దురాలోచనను మనస్సులోనికి రానివ్వటమే దీని కంతకూ కారణం. అది ప్రధాన శత్రువు. ఇంటికి దూరంగా ఉంచినంతకాలం ఫరవాలేదు. లోనికి 'స్వాగతం' చెబితే లోయల అడుగుకు నెట్టివేస్తుంది.

నారయ్య ఆహ్వానించాడు.

ఆ క్షణంలో మరి గత్యంతరంలేదు. నీతి నిజాయితీలను శిఖరంమీద కూర్చోబెట్టి, పూజా పునస్కారాలు సాగిస్తే అటు తల్లివీధిపాలౌతుంది. చకచక ముందుకు నడిచాడు. పాపతో ఏవో కబుర్లు ప్రారంభించాడు.

పాప స్కూల్లో అడుగుపెట్టేసరికి మెడ బోసిగా ఉంది. నారయ్య చొక్కాజేబు బరువుగా ఉంది. ఆ సంగతి ఆమె కింకా తెలియదు.

*   *   *

గడియారం రెండు కొట్టింది.

నారయ్య బయటికి వెళ్లటానికి సిద్ధమయ్యాడు.

సుభద్ర మేల్కొని ఆవులిస్తూ వచ్చి అతన్ని చూసి 'అప్పుడే ఎక్కడకు బయలుదేరావు నారయ్యా .... రెండైంది. అంతే. స్కూలు నాలుగ్గంటలకు కదా విడిచిపెట్టేది ?' అనడిగింది.

'ఇక్కడ ఏం పనిలేదండి. అందుకని నెమ్మదిగా నడుస్తూ అలా అలా తిరిగి నాలుగ్గంటలకు బడి చేరుకుంటానండి' అని బయటపడ్డాడు.

అది అబద్ధం—బడికి కొద్దిదూరంలో ఉన్న మార్వాడీ కొట్టు మూడింటికాని తెరవరు. ఆ గొలుసు అమ్మి వందరూపాయలు అయినా తీసుకోవాలి. తతిమా వంద మాట తరువాత చూసుకోవచ్చు. కొట్టు దగ్గరయ్యేకొలది భయ మెక్కువయింది. జేబులో ఉన్న గొలుసు మణుగు బరువుతో శరీరాన్నే క్రుంగదీసింది. కొట్టుదగ్గర అయ్యగారికి తెలిసినవా రెవరైనా ఉంటే ? .... మార్వాడీ అప్పుడే దుకాణం తెరిచి దుమ్మూ, ధూళీ దులుపుతున్నాడు.

'సేటుగారికి దండాలు' అని పళ్లికిలించి గాజుపెట్టె దగ్గర కూర్చున్నాడు. మార్వాడీ ఒక్క చూపుతో, అతన్ని, అతని స్థితిగతుల్ని, మనో భావాన్ని గ్రహించి 'దండాల్ని' స్వీకరిస్తున్నట్టు తల నిలువునా ఆడించాడు.

నారయ్య గొలుసు బయటకు తీశాడు. నవ్వుతున్న పాప మెడతడిమిచూసుకుని ఒక్కసారిగా కెవ్వున కేకేసింది .... నారయ్య ఉలిక్కిపడి గాజుపెట్టెమీద గొలుసు జారవిడిచాడు. అతని మనసులో జరుగుతున్న సంఘర్షణ మార్వాడీ కేం తెలుసు ? తాపీగా తీసుకుని నాణ్యం పరీక్షించి 'యాభై రూపాయలు' అన్నాడు.

అతనికి గుండె ఆగినట్లయింది.

'అవునయ్యా ! .... దొంగసొమ్ముకు అంతకంటె ఎక్కు వెవరిస్తారు ? .... బంగారంకూడా మంచిది కాదు.'

'దొంగసొమ్ము అన్న మాట గుండెల్ని గుండులా దూసుకుపోయింది.

చివరికి ఎలాగో వంద రూపాయలు దొరికాయి.

డబ్బు భద్రంగా దాచుకుని వెళ్లేసరికి బడి వదిలేశారు. పాప గేటుదగ్గర నిలబడుంది.

'ఆలస్యమైందే నారయ్యా ? ....' అనడిగింది.

పాప ముఖం వాడిన పువ్వులా ఉంది. కళ్లు రెండూ ఎర్రగా ఉన్నాయి. బుగ్గలమీద నీటిచారలున్నాయి. ఉండే ఉత్సాహం, కొంటెతనం ముఖం మీద మచ్చుకైనా లేవు.

'బుల్లెమ్మగారూ!....ఏడుస్తున్నారా? ఏమైంది?'

'ఇప్పుడు ఏడవటంలేదు కాని మధ్యాహ్నం ఏడ్చాను. మరి నవ్వుతానా ఏమిటి ? నా మెళ్లో గొలుసు పోయింది.'

'అయ్యయ్యో! .... ఎంతపని జరిగింది ! ఎవ డా దొంగవెధవ ? నా చేతికి దొరికితే చంపేస్తాను. పీక నులిమిపారేస్తాను. ఎప్పుడు పోయిందో గుర్తుందా ? బుల్లెమ్మగారూ ! .... నేను పొద్దున్న బడిదగ్గర విడిచిపెట్టేటప్పుడు ఉంది. బళ్లోనే పోయుండాలి.'

నారయ్య తెలివిగా నటించాడు.

'అంతే అనుకోవాలి. టీచరుతో చెప్పాను. అందర్నీ అడిగింది. ఎక్కడా దొరకలేదు.'

ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. జనార్దనంగారు తన్ను అనుమానించరనే ధైర్యం నారయ్యకుంది. తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టినందుకు అతనికి బాధగానే ఉంది. ఇల్లు చేరుకున్నాక సుభద్ర సంగతి తెలుసుకుంది.

''పోతే పోయింది .... ఏం చేస్తాం మరి ... మీ నాన్నగారు వద్దంటే విన్నారుకారు. అది మన



నారయ్య

సొమ్ము కాదనుకుందాం. నువ్వు మొహం కడుక్కుని రా !' అంది. నారయ్యను ఆమె ఏమీఅడగలేదు.

ఆరుగంటలకు ఆఫీసునుండి వచ్చిన జనార్దనంగారు అంతా విని మౌనంగా ఉండిపోయారు.

'నారయ్యా ! .... ఈ స్వెట్టరు నీకు సరిపోతుందేమో చూడు ! .... ఈ దుప్పటి, కంబళి నీకోసమే !' అంటూ ఓ పాకెట్టు అందించాడు.

'ఇవన్నీ నా కెందుకం డయ్యగారూ !'

'ఎందు కేమిటోయ్ ? .... ఇది శీతకాలం. జాగ్రత్తగా ఉండకపోతే జబ్బుచేస్తుంది. క్రితం నెల కొనిద్దా మనుకుని అశ్రద్ధ చేశాను.'

భర్తకు కాఫీ తీసుకొచ్చిన సుభద్ర ఏదో జ్ఞాపకంవచ్చి నాలి క్కరుచుకుంది.

'అరెరె ! .... పొద్దున్న వండిన పరమాన్నం నారయ్య కివ్వనేలేదు. పని తొందరలో పూర్తిగా మర్చిపోయాను ....' అంటూ పెద్ద కప్పునిండా పరమాన్నం తీసుకొచ్చి అతని కిచ్చింది.

'అన్నట్టు నారయ్యా ! .... చెప్పటం మర్చిపోయాను. ఏదో పిల్లల సినిమా వచ్చిందట. కాస్త పాపను తీసుకెళ్ళు బాబూ ! .... చంపుకుతింటోంది. పక్కింటాయనతో వెళ్ళమంటే, తల అడ్డంగా ఆడిస్తోంది. నీతో తప్పించి వెళ్ళదట.'

నారయ్య ఇంక అక్కడ నిలబడలేకపోయాడు. తల గిరగిర తిరిగింది.

*   *   *

గడియారం పదకొండు కొట్టింది.

నారయ్య పంపిన వందరూపాయలు ముసిల్ది అందుకుంది. వెంటనే నాయుడుదగ్గరకు వెళ్లింది. నాయుడు విరగబడి నవ్వాడు. దిక్కులు దద్దరిల్లేటట్టు నవ్వాడు. ముసిల్ది భయంతో, ఆశ్చర్యంతో చూసింది.

'నన్ను మోసంచేద్దా మనుకుంటున్నావా ? .... ఈ తెల్ల కాగితంముక్క లెవరిక్కావాలి ? ఒక్క గంట వ్యవధి ఇస్తున్నా. వెంటనే ఆ రెండొందలు చెల్లించేయాలి. లేదా, మెడపట్టి బయటకు గెంటుతాను.'

'అయ్యో ! .... ఇది అధర్మం. అన్యాయం. ఇప్పుడే పోస్టతను ఇచ్చిపోయాడు. నా కొడుకు పంపాడు. అది కాగితంముక్క ఎలా అవుతుంది ?'

'ఓ ముసలిపీనుగా ! .... ఇంకా ధర్మం చావలేదు. ఇది నీ కొడుకు కష్టపడి సంపాదించిన సొమ్ము కాదు. ఎవర్నో మోసం చేశాడు. దొంగిలించాడు. ఇది దొంగ సొత్తు. అందుకే, కాగితం ముక్కైంది విలువను కోల్పోయింది.'

నాయుడు మళ్లీ వికటంగా నవ్వాడు.

పాప తలిదండ్రులతో అక్కడకు వచ్చింది.

'అవును నాన్నారూ ! .... అతను దొంగ. నా మెళ్లో గొలుసు లాక్కున్నాడు. నేను చూసీ చూడనట్టు ఊరుకున్నాను. తరువాత మీతో చెప్పి జైలుకు పంపించవచ్చునని.' అంది ఉరిమి చూస్తూ పాప.

మార్వాడీ కంగారుపడ్డాడు.

'అరెరె ! .... జనార్దనం సేటుగారి గొలుసా ? .. ఆ సంగతి మనకి తెలియదు. ఏదో పరోపకారం కోసం సాయంచేశాను... దొంగసొత్తు నేను కళ్లతో కూడా చూడను. అది పాపం .... పాపం ! ..... ఈ వెధవను తిన్నగా లాకప్‌కి పంపాలి.'

'నారయ్యా ! .... నువ్వింతటి ఘటికుడవని నాకు ముందే తెలియదు. నువ్వు గతాన్ని మర్చిపోయావు. ఓ నాడు తిండికి లేకుండా వీధమ్మట పడి తిరుగుతుంటే పాప తీసుకొచ్చింది. ఆదరించి, దయతల్చి పనిచ్చాను. పదిరూపాయలు పారేస్తే నీలా పనిచేసేవాళ్లు ఈ ఊళ్లో వెయ్యిమందున్నారు. నీకు తిండిపెట్టి, బట్టలిచ్చి, జీతం కూడా ఇచ్చి మా కుటుంబంలో ఒకవ్యక్తిగా పరిగణించినందుకు తగినశాస్తి చేశావు .... నువ్వు మంచివాడవని పొరబడ్డాను.'

నారయ్య ఇంక వినలేక చెవులు మూసుకున్నాడు.

వెనక్కి తిరిగి చూసేసరికి తల్లి అక్కడ లేదు.

వందగజాల దూరంలో ఆమె వడివడిగా నడిచిపోతోంది. గుండె గుభేలుమంది. అతనూ పరుగెత్తాడు. ఆమె మరింత దూరమైంది. పెద్ద ప్రవాహం వచ్చి ఆమెను తీసుకుపోయింది.

నారయ్య ఉలిక్కిపడి మేలుకున్నాడు.

లేచికూర్చుని తలగడకింద చూసుకుంటే, వందరూపాయలు భద్రంగా ఉన్నాయి. గడియారం పన్నెండు కొట్టింది. ఇంతసేపూ జరిగిన చిత్రసంఘటనల్ని నెమరువేసుకున్నాడు. అది కలని అతను నమ్మలేకపోయాడు. అంతరాత్మ ఈవిధంగా తనకు సద్బోధ చేస్తోందిగామోలు!

బ్యాంకులో చొరబడి రు. 2 లక్షలు ఎత్తుకుపోయిన ఒక గజదొంగ కోసం పోలీసులు మూడేళ్లు గాలించారు. చివరకు ఒకరోజున అతడు సెకండ్ హాండ్ సైకిల్ దొంగిలిస్తుండగా పట్టుబడ్డాడు.

డి. రాజయ్య (ఖమ్మంమెట్టు)

పక్కగదిలోంచి సంభాషణ వినిపించింది.

'నా అనుమానం నారయ్యే ఈపని చేసి ఉంటాడు... పాప అమాయకురాలు కాదు... పరాయి మనుష్యులదగ్గర గడుసుతనంగా మసలుకుంటుంది... కూడా వీడున్నాడుకదాని పరధ్యానంగా ఉండిఉంటుంది. అదనుచూసి అపహరించాడు. అదీకాక తల్లికి పంపేందుకని వందరూపాయలు అడిగాడు పొద్దున్న. జ్ఞాపకం ఉందా మీకు ? .... ఇవ్వనని మీరు కసిరికొట్టారు. రేపు నిలదీసి అడగండి. నిజం బయటపడ్తుంది.'

సుభద్ర మౌనంలో ఇంతటి అంతరార్థం ఉందని నారయ్య ఊహించలేదు.

జనార్దనంగారు నవ్వారు.

'నువ్వు పొరబడుతున్నావు. మనుష్యుల మనస్తత్వాలు సరిగ్గా అర్థంచేసుకునేస్థితికి నువ్వింకా రాలేదు. నారయ్య చాలా మంచివాడు. అలాంటి పనెప్పుడూ చేయడు. ద్రోహబుద్ధి నిజంగా ఉండివుంటే, ఆ చిన్నగొలుసుతో తృప్తిపడడు. మనం వాణ్ణి పూర్తిగా నమ్మాం .... అలాంటప్పుడు బీరువాలోంచి నగలన్నీ మూటకట్టి తీసుకుపోవచ్చు—కాని అలా చేయడు—చేయలేడు. ఒకరిసొత్తు — పూచికపుల్లయినా—అతని కక్కర్లేదు. ఉదయం కసిరికొట్టి పనిలోంచి పొమ్మన్నాను. పోయాడా మరి ? .... అమాయకుడు. మనల్నే నమ్ముకున్నాడు. అందుచేత వాణ్ని అనుమానించటం తప్పు. పాప తెలివైందేకాని, చిన్నపిల్ల. దాన్ని మోసగించటం బ్రహ్మవిద్య కాదు. నిజానికి నువ్వుకూడా నారయ్యను పూర్తిగా అనుమానించటంలేదు. వాడు దొంగనే అభిప్రాయం నీకు కలిగివుంటే సాయంత్రం పరమాన్నం ఎందుకిచ్చావ్ ? .... నేను స్వెట్టరు అదీ కొనిస్తానా ? మనం వీడను చూసి నిజమనుకోకూడదు.... అది చాలా ప్రమాదకరమైంది.'

ఆ తరువాత ఏం మాట్లాడుకున్నదీ నారయ్య వినేస్థితిలో లేడు. నిశ్శబ్దంగా తనలో తాను కుమిలికుమిలి ఏడ్చాడు. సహృదయం ఉన్న మనిషి న్యాయవిరుద్ధంగా ఎన్నడూ నడుచుకోలేడు. అలా నడుచుకున్నా, వెంటనే పశ్చాత్తాపపడి, తన్ను తాను సరిదిద్దుకుంటాడు.

ఒంటిగంటకు నారయ్య చిన్న కాగితంముక్క మీద వెన్నెల వెలుగులో ఏదో రాశాడు.

*   *   *

ఆమర్నాడు పొద్దున్న నారయ్య ఎక్కడా కనపడలేదు. కంగారుతో ఇల్లంతా వెతికారు. దొడ్డి తలుపులు తెరచివున్నాయి. సుభద్ర, జనార్దనం ఒకరివంక ఒకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

'నాన్నారూ ! .... వంటింటో ఈ కవరు కనిపించింది ....' అంటూ పరుగెత్తుకొచ్చి పాప అందించింది.

జనార్దనంగారు అందులో ఉన్న ఉత్తరం తీసి చదువుకున్నారు.

'అయ్యగారూ ! .... నేను దొంగను. బుల్లెమ్మగారి గొలుసు నేనే తీశాను. మా అమ్మకు డబ్బు పంపుదామని .... అయ్యగారు ! మీరు ధర్మాత్ములు. మీ మనసు మంచిది. మీరు దేవుడివంటివారు. మిమ్మల్ని మోసంచేస్తే నాశమౌతారు ఎవరైనా. గొలుసు అమ్మగా వచ్చిన వందరూపాయలు ఈ కవరులో ఉన్నాయి. నన్ను క్షమించండి... మీ ఆదరణకు నేను తగను. నేను వెళ్లిపోతున్నా. ఎప్పుడైనా మీ కెదురుపడితే నాముఖం చూడకండి అయ్యగారూ ! నేను పాపిని...'

జనార్దనంగారు విషాదంగా నవ్వారు.

'పిచ్చి నారయ్య ! నన్ను అర్థంచేసుకోలేదు. ఏదో కోపంలో సాయంచేయనని కసిరికొట్టాను కాని—ఆఫీసుకు వెళ్లగానే అతని తల్లికి రెండు వందలు మనియార్డరు చేసినసంగతి అతనికి తెలియదు. నేనుకూడా చెప్పటం మర్చిపోయాను' అన్నారు.

సుభద్ర ఆ ఉత్తరం లాక్కుని చదువుకుంది.

తోటలో నారయ్య శ్రమపడి నీరుపోసి పెంచిన పూలమొక్కలు, రంగురంగుల పువ్వులతో కిలకిల నవ్వాయి. ఆ పువ్వుల్లో ఉండే స్వచ్ఛత నారయ్యహృదయంలో కూడా ఉంది.

జనార్దనరావుగారు నిట్టూర్చారు. ★

మార్గాలు కూడా సాధించగలిగాము. ఇతను లేక పోయినట్లయితే ఆగిపోయి ఉండేవారము.

కాని అతని 'మౌనస్వభావం' రోజు రోజుకీ అధికమవుతున్నది, (ఇది మీరు నమ్మగలిగినట్లయితే!) అది మాకుకూడా తగులుతున్నదేమోనని నా అనుమానం. పరిసరాలు మనస్సుపైన తమ ప్రభావం కొంత చూపకుండా ఉండవు. ఒక మనిషిని నాలుగు గోడలమధ్య మూసివేసినట్లయితే, వాగ్వాల అన్వయం మరచిపోతాడు. ఒంటరి కారాగృహవాసం చేసిన ఖైదీలలో ఎందరు, మెదడుకు పనిలేక, పిచ్చివారు కాకపోయినా బుద్ధిమాంద్యు లవటంలేదు!

తర్వాత రెండువారాలలో ఎక్కువభాగం — మా దీర్ఘసంభాషణానంతరం — విశేషమేమీ లేకుండానే గడిచిపోయింది. కాని ఆపైన చాలా ప్రమాదకరమయిన దొకటి జరిగినది. ఇది నాకు జ్ఞాపకం ఉండటానికి కారణం ఉన్నది. నిజం చెప్పాలంటే, ఒక్క చిన్న వివరము మరచిపోవాలన్నా కష్టమయిన పని.

ఆగస్టు 7 తేదీకి, తొంభై మైళ్లలోతు దిగాము. అంటే మా తలలమీద తొంభై మైళ్లరాయి, సముద్రం ఉన్నవన్నమాట. అయిస్‌లాండ్‌కి ఆరువందల మైళ్లదూరం ఉండిఉంటాము.

ఆరోజు సొరంగం బహుకొద్దిగా క్రిందకు దిగుతున్నది.

నేను ముందు నడుస్తున్నాను. ప్రొద్దుగ్రుంకుతున్నకొద్దీ అనంతంగా మా కళ్లముందు విచ్చుకుంటున్న గ్రానైట్‌పొరలు చూసి దిగ్భ్రాంతుడి నైనాను.

హఠాత్తుగా వెనక్కి తిరిగి చూసేసరికి ఒంటరిగా ఉన్నానని తెలుసుకున్నాను.

"ఓహో" అనుకున్నాను. "మరీ తొందరగా నడుస్తున్నాను. లేదా, హాన్స్, మా పెదనాన్నా దారిలో ఆగిపోయి ఉండాలి. వాళ్లని చేరుకుంటే మంచిది. అదృష్టవశాత్తు దారి మరీ కష్టంగా లేదు."

వెనుకకు తిరిగాను. పావుగంట నడిచాను. ముందుకి తేరిపారచూశాను. ఎవరూ లేరు. పిలిచాను. జవాబులేదు. గుహ ప్రతిధ్వనుల వరదలో నా గొంతుక మునిగిపోయినది.

ఆదుర్దాపడటం మొదలుపెట్టినది. ఒళ్ళు జలదరించినది.

"ఇదేమిటి," అనేశాను బయటికి. "నా సహచరులు దొరక్క ఏంచేస్తారు? రెండు మార్గాలు ఉండవుకదా! వెనక్కి తిరగా లంతేగా! నేను ముందున్నా నంతే!"

అరగంట పైకి ఎక్కాను. కేకలేమయినా వినిపిస్తాయేమోనని విన్నాను—ఈ చిక్కని వాతావరణంలో దూరంనుంచికూడా వినిపించి ఉండేది. నాచుట్టూ విచిత్రమయిన మౌనం ఒకటి పాలించింది.

ఆగాను. నేను ఒంటరి నయినానని నమ్మలేకపోయాను. మరీ ముందుకి వెళ్లానేమోకాని తప్పిపోయానని నమ్మలేకపోయాను. కేవలం ముందుకి సాగివెడితే అందరమూ తిరిగి కలవక తప్పదు.

"చూడు," అన్నాను మళ్లీ. "ఒకేదారి ఉంది. వాళ్లూ దానినే అనుసరిస్తున్నారుకాబట్టి కలుసు

భూగర్భంలోనికి సాహసయాత్ర

24-వ పేజీ తరువాయి

కుని తీర్తాము. నడుస్తూఉంటే చాలు. అంటే, నేను లేకపోయేసరికి, ముందున్నానని మరిచిపోయి, వాళ్లూ వెనక్కి తిరిగితేతప్ప. పోనీ! అలాగయినా త్వరపడితే దాటేస్తాను కూడా. అనుమానంలేదు!"

ఈ చివరిమాటలు తిరిగి తిరిగి పలికాను. పూర్తిగా నమ్మకం కుదరనివారు ఈవిధంగా పునరుక్తి జరుపుతూ ఉంటారు. ఇటువంటి సామాన్యమయిన భావాలు చేర్చి, సహేతుకంగా ఆలోచించటానికికూడా నాకు చాలాసేపు పట్టినది.

ఆపైన అనుమానం పీడించటం ప్రారంభించినది. నేను నిజంగా అందరికన్నా ముందు నడుస్తున్నానా? తప్పకుండా. హాన్స్ నన్ను అనుసరిస్తూఉండగా, మా పెదనాన్న వెనుక నడుస్తున్నాడు. హాన్స్ ఒకక్షణం ఆగటం నాకు జ్ఞాపకం వచ్చినది. భుజాలపైన మూట సర్దుకొనేందుకు ఆగాడు. ఈ వివరం గుర్తుకివచ్చి నాకు క్రొత్త ఉత్సాహం కలిగినది. సరిగ్గా ఈ క్షణంలోనే నేను ముందుకి నడిచిపోయిఉండాలి.

"అంతేకాదు, దారి తప్పేందుకు వీల్లేని ఉపాయం ఒకటుందిగా! మా విశ్వసనీయమయిన ఏరు ఈ వ్యూహంలో నాకు మార్గదర్శిగా ఉంటుంది. ప్రవాహానికి ఎదురుగా నడిస్తేచాలు నా సహచరులను కలుసుకుని తీర్తాను" అనుకున్నాను.

ఈ ఆలోచన నాకు క్రొత్త జీవం పోసినది. ఒక్క సెకండ్, ఆలస్యం లేకుండా ముందుకు సాగిపోవాలని నిశ్చయించుకున్నాను.

మా వేటగాడు గ్రానైట్ రాయిలోని రంధ్రం మూసివేస్తానన్నప్పుడు వద్దని నివారించిన మా పెదనాన్న ముందుచూపు అభినందించుకున్నాను. మా హితానికి హేతువయిన ఆ ప్రవాహం, దారిలో మా దాహం తీర్చటమేకాక, భూగోళం పెచ్చులోని వ్యూహమార్గాలలో నాకు మార్గదర్శి కూడా అయి ఊరుకున్నది.

ఆందోళనతో చెమటపట్టినది. ఇక పైకి నడిచేముందు ఒకసారి ముఖప్రక్షాళనం చేసినట్లయితే బాగుంటుం దనిపించినది.

హాన్స్‌బాక్ నీటిలో ముఖం ముంచాలని ముందుకి వంగాను. నా ఆశ్చర్యం తెలుసుకొనగలరా!

గరుకుగా ఎండిన గ్రానైట్‌మీద నడుస్తున్నాను! నా కాళ్లవద్ద ఏరు ప్రవహించటంలేదు!

కుందనపు బొమ్మ

దేవరకొండ దుర్గాప్రసాదరావు

ముద్దులొలుకు పలుకులతో
ముచ్చటైన చేతలతో
మా పాప యెల్లప్పుడు
మనసులు వికసింపజేయు

చిట్టిపొట్టి కాళ్లతోడ
తప్పటడుగు లేస్తూంటే
ఎప్పటికప్పుడు క్రొత్తగ
ఒప్పుచుండు మా కనులకు

ఉంగరాల జుట్టులోన
బంగరు వ్రేళ్ళను దూర్చి
'అమ్మా జడనల్లుకొనెద'
అంటూంటే మది కెంతోహాయి

రబ్బరు బొమ్మను ఒడిలో
బబ్బో పెడతానంటూ
ముద్దుగొలుపు కాళ్లుజాపి
ముద్దులు నొలికించుచుండు.

పలకా బలపముబట్టి
బడికెళతా నంటూంటే
పాపపైన మమకారం
ప్రతిదినమూ హెచ్చుచుం..

అమ్మలాగ వంటవండి
బొమ్మలాగ పిండిరుబ్బి
అందరినీ అనుకరించి
ఆనందాబ్ధిని ముంచును.

పాప ఆడు ప్రతి ఆటా
కన్నుల కానందమిచ్చు
పాప నోటి ప్రతిమాటా
వీనులవిందును జేయును.

అందులకే మా పాపాయన
అందరికీ ఆనందం
అందరును అందులకే
"కుందనపుబొమ్మా" అంటారు.

27

భూగర్భంలోనికి సాహసయాత్ర

నా నిస్పృహ వర్ణించలేను. మానవ భాష ఏదీ నా భావాలను వ్యక్తపరచలేదు. సజీవంగా పాతరబడిపోయాను, ఆకలిదప్పులతో ఘోర మరణం సంభవించేట్లు ఉన్నది.

అనుకోకుండా జ్వరం వచ్చినట్లు వేడి ఎక్కిన చేతులతో నేల తడిమి చూశాను. రాయి ఎంత ఎండిపోయి ఉన్నది, అనిపించింది!

కాని ప్రవాహం ఎలా తప్పిపోయినది? అక్కడ లేదే! నేను అంతకుముందు నా సహచరుల కేకలు వినిపిస్తాయేమో నని విన్నప్పుడు అవరించిన చిత్రమయిన మౌనానికి కారణం అర్థం చేసుకున్నాను. నేను ఇప్పుడయితే తప్పటడుగు వేశానో అప్పుడు ఏరు పారడంలేదనే సంగతి గమనించలేదు. దారిలో చీలికలో తప్పుదారి అనుసరించి ఉంటాను. ఇంతలో హాన్స్‌బాక్ మరొక మార్గానికి ఆహ్వానం దొరికి నా సహచరులతో అపరిచిత అగాధాలలోనికి దిగి వెళ్లిపోతున్నది.

వాళ్లని కలుసుకొనటం ఎలా? అడుగు జాడలు లేవు. ఆ గ్రానైట్ రాతిమీద నా బూట్ల గుర్తులు ఉండవు. అసాధ్యమయిన పరిష్కారం కల ఈ సమస్యతో మెదడు తికమక పడినది. నా పరిస్థితి ఒక్క ముక్కలో చెప్పాలంటే, తప్పిపోయాను!

అవును! కొలతకు అందని లోతులో తప్పిపోయాను. నా భుజాలపైన తొంభై మైళ్ల మందం కల భూమిపై పెచ్చు బరువుగా నొక్కివేస్తున్నది. చితికిపోయిన ట్లనిపించినది.

నా ఆలోచనలు బయటి ప్రపంచంవైపు మళ్లించాను. మొదట కొంచెం కష్టమనిపించినది. హాంబర్గ్, కీనిగ్‌స్ట్రాస్‌లో ఇల్లు, నా గ్రౌబెన్— నేను దేనిక్రింద గుడ్డిగా తిరుగుతున్నానో ఆ ప్రపంచం నా మెదడులో మెదిలాయి. కాని ఒక క్షణమాత్రంలో మా ప్రయాణం వివరాలన్నీ సమీక్షించుకుని చూశాను — సముద్రయానం, అయిస్‌లాండ్, శ్రీ ఫ్రిడిక్‌సన్, స్నాఫెల్స్ పర్వతం! నా ఈ పరిస్థితిలో ఒక ఆశాకిరణమయినా మిగిలిఉంటే పిచ్చి ఎక్కినట్లు నిర్ధారణ అయిన దనుకొనవచ్చునని నాకు నేనే చెప్పుకున్నాను. నిరాశ ఒక్కటే గత్యంతరం అనిపించింది.

నిజానికి, నా తలపైన ఉన్న శిలా నిర్మాణాన్ని ఛేదించి నన్ను తిరిగి భూతలంమీదకు తీసుకుపోయేవా రెవరు? లేక నా సహచరులు కలుసుకునేట్లు చేయగలిగినది ఏమైనా ఉన్నదా?

"పెదనాన్నా!" అని నిస్పృహతో మూలిగాను.

కాని, నా నోటినుండి వెలువడిన 'అపనింద' ఇదొక్కటే. నా కోసం వెతికే ఆ దురదృష్టవంతుడు ఎంత బాధపడుతాడో నాకు తెలుసు.

మానవ సహాయం పొందే స్థితిలో లేనని గ్రహించిన నాకు, వివిధమయిన ప్రయత్నంలోనూ నన్ను నేనే రక్షించుకొనలేనని తెలుసుకున్న నాకు, దైవ ప్రార్థన ఒకటే మిగిలింది. నా చిన్ననాటి స్మృతులు కళ్లకు కట్టినట్లయ్యాయి; మా అమ్మ చేసిన ప్రార్థన ఒకటి గుర్తుకి వచ్చి మోకరిల్లాను. కాని ఇంత ఆలస్యంగా భగవంతుడిని అర్థించటానికి నాకు హక్కులేదని అనిపించినది. కాపాడమని అతిశయించిన భక్తితో ప్రార్థించాను.

విధికి చేసిన ఈ ప్రార్థనవల్ల నా మనస్సు కొంచెం కుదుటబడినది. నా పరిస్థితిని మరి కొంచెం వివేకంగా పరిశీలించాను.

నా 'ఫ్లాస్కు' నిండుగా ఉన్నది. మూడు రోజులకు సరిపడిన ఆహారం ఉన్నది. అంతవరకూ ఒంటరిగా ఉండిపోవలసిన అవసరం లేకపోవచ్చు. కాని నేను క్రిందకు దిగాలా లేక పైకి ఎక్కి వెళ్లాలా?

పైకే, అనుమానం లేదు! ఇంకా పైకి!

ఈలాగున చేస్తే నేను ప్రవాహం నుంచి విడిపోయిన ఆ ప్రమాదకరమయిన చీలిక చేరుకుంటాను. అక్కడనుంచి నా కాళ్లక్రింద ఏరుని బట్టి స్నాఫెల్స్ శిఖరం చేరుకొనటానికి ప్రయత్నించగలను.

దీనిని గురించి ఇంతకుముందే ఎందుకు ఆలోచించలేదు.? తప్పించుకొనేందుకు ఇదొక అవకాశమని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. అంటే, హాన్స్‌బాక్‌ని వెదకటం ఇప్పుడు అత్యవసరము!

లేచి నుంచున్నాను. నా ఇనుపతొడి వేసిన కర్ర సహాయంతో పైకి ఎక్కటం మొదలుపెట్టాను. దారి ఇంత పైకి ఎక్కుతున్నట్లు గుర్తులేదు.. ఆశతో, వెనుకాడకుండా ముందుకు సాగిపోయాను; ఏ మార్గ మనుసరించాలో తెలియనివానికి వేరే గత్యంతరం లేదు.

అరగంటవరకూ అడ్డు ఏదీ తగలలేదు. సొరంగం ఆకారం, రాళ్ల నిర్మాణం; దారి వంకరలు వాటిని బట్టి ఇది పాతదారిగా గుర్తించటానికి ప్రయత్నించాను. కాని, ఏదీ పరిచితమయినదిగా కనిపించలేదు. ఈ మార్గం చీలికకు వెళ్లడంలేదని గ్రహించాను. అదొక గ్రుడ్డిదారి. నిర్భేద్యమయిన గోడ తగిలి క్రింద పడిపోయాను.

నా నిస్పృహ, ఆందోళన వర్ణించలేను. అలా నేలమీద పడి ఉండిపోయాను. నా చివరి ఆశ కూడా ఈ గ్రానైట్ అవరోధాన్ని ఢీకొని తునాతునకలయిపోయినది.

ఏ దిక్కువైపునో తెలియని చుట్టుదారులు కల వ్యూహంలో తప్పిపోయి అసాధ్యమయి విముక్తిలో కూడా ఆసక్తి లేకపోయినది. భయంకరమయిన చావు తప్పదు! విచిత్ర మేమిటంటే ముందు ఎప్పుడైనా భూగర్భంలో తొంభై మైళ్లలోతున నా దేహం 'ఫాసిల్' అయి దొరికితే పెద్ద విజ్ఞాన సమస్యలకు దారితీస్తుందనే ఊహ నాకు కలిగినది.

బయటకు మాట్లాడుదా మనుకున్నాను కాని నా పెదవుల మధ్యనుంచి మోటు శబ్దాలు మాత్రం వచ్చాయి. ఊపిరి తియ్యటానికి ఆయాసపడుతున్నాను.

ఈ బాధలో మరొక భయం పట్టుకున్నది. నేను క్రింద పడినప్పుడు నా 'టార్చి' విరిగిపోయినది. దానిని బాగుచెయ్యటం నా శక్యం కాదు. వెలుగు మసకబడి పోతున్నది.—పూర్తిగా మాయమయ్యేట్లున్నది!

దీపం 'కాయిల్' (Coil) లో కరెంట్ క్షీణించిపోవటం చూస్తూ కూర్చున్నాను. చీకటి గోడలమీద నీడల వరుసలు కదలి వెళ్లాయి. కళ్లు మూసే ధైర్యం లేకపోయినది; పాలిపోతున్న ఆ వెలుగులో ఒక క్షణంకూడా వృధా కాకూడదనుకున్నాను. క్షణక్షణానికి వెలుగు అదృశ్యమయిపోయి నన్ను సంపూర్ణాంధకారంలో కప్పివేస్తుందనిపించినది.

దీపంలో చివరిసారిగా వెలుగు మిణుక్కురుమన్నది. దానిమీద పడి, కళ్ల దగ్గరగా నొక్కుకున్నాను. నా కంటికి తగిలే ఆఖరి కాంతి పుంజం అనుకుని దీక్షగా దానిమీదనే పట్టించాను. ఆ తర్వాత అనంతమయిన రాత్రిలో ఒంటరివాడినయిపోయాను.

ఒక భయంకరమయిన కేక వేశాను! భూతలం మీద ఎంత చీకటిరాత్రి అయినా వెలుగు పూర్తిగా పోదు. నన్నగిల్లిపోవచ్చు; కాని ఎంత కొద్దిగా ఉన్నప్పటికీ కంటికి కనిపిస్తుంది.

ఇక్కడో—శూన్యం.

ఈ సంపూర్ణాంధకారం నన్ను అన్నివిధాలా గ్రుడ్డివాడిని చేసినది.

నా బుద్ధి స్వాధీనం తప్పినది. లేచి నుంచున్నాను; చేతులు ముందుకు సాచి ఈ భయంకరమయిన చోటు నుంచి బయటకు పోదామని ప్రయత్నించి చేతులు గాయపరచుకున్నాను. హఠాత్తుగా పరుగు తీశాను. ఇష్టంవచ్చినట్లు అడుగులువేసి ఆ వ్యూహంలో భూతలం క్రింద ఎప్పుడూ నివసించేవానివలె పైకీ క్రిందకూ పరిగెత్తాను. అరిచాను, కేకలు వేశాను, ఏడ్చాను, అడ్డుపడిన రాళ్లకు తగిలి క్రింద పడ్డాను, రక్తం కారుతున్నా లేచి ముఖంపైన రక్తం త్రాగి ఏదో ఒకగోడమీద తల పగలగొట్టుకుందామని ప్రయత్నించాను.

ఈ పిచ్చి పరుగు నన్నెక్కడకు తీసుకు వెళ్లినది? నాకు తెలియదు. కొన్ని గంటల తర్వాత, నాలో ఓపిక పూర్తిగా నశించిన తర్వాత గోడకి ఆనుకుని కుప్పగా కూలిపోయాను. స్పృహ తప్పిపోయినది.

(సశేషం)

"నా అభిమాన తారతో కలిసి ఒక తెప్పమీద పెద్ద సరస్సులో తెలిపోతున్నట్లు నిన్నరాత్రి కల వచ్చింది." చెప్పుకుపోతున్నాడొక కోతల కోనేటిరావు.

"ఇంతకూ తరువాత ఏమైందంటావు" పట్టలేక అడ్డుతగిలాడు వింటున్న మిత్రుడు.

"ఏమైందంటావా! పెద్దచేపనొకటి పట్టేశాను తెలుసా!" కోనేటిరావు సంతోషంతో తబ్బిబ్బయ్యాడు.

వి. రమణారావు (గుంటూరు)

ఏడుకొండలు

23-వ పేజీ తరువాయి

వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని స్థాపించి, నడిపే ఉద్యోగిగా రామవరం వచ్చాడు. అతనిని కాంతారావుగారూ, శ్యామ్‌బాబూ, మిస్టర్ దిన కర్ అని సంబోధిస్తారు. దినకర్‌కు శ్యామ్‌బాబ్ ఉద్దేశాలూ, సంభాషణా ఎంతో నచ్చాయి. కాంతా రావుగారు శ్యామ్‌బాబుతో తను చేసిన వ్యాపారాలూ, అవి నడిచినవిధం, అవి ఏవిధంగా దెబ్బతిన్నదీ, అన్నీ చెప్పుకొచ్చారు.

శ్యామ్‌బాబుకు అనేక వ్యాపారాల విషయం తెలుసు. వాటి మంచిచెడ్డల్ని గురించి చర్చ జరిగింది. కాంతారావుగారి వ్యాపారాలు దెబ్బతినడం ముఖ్యంగా, ఆయనమంచితనాన్ని ఆధారంగా చేసుకొని, ఆయున్ని వంచించి తాము బాగుపడ్డ మిత్రుల వలననే. ఆయున సులభంగా అందర్నీ నమ్ముతారు. ఆయునను కాస్త ఎవడైనా పొగిడి, ఫలానా వ్యాపా రంలో చాలా కొద్ది పెట్టుబడితో లక్షలు లక్షలు లాభాలు 'గణించవచ్చునని చెప్పినట్లయితే ముందు వెనుకలు ఆలోచించకుండా అందులోకి దిగి, వేల కొద్దీ డబ్బు మదుపుపెట్టారు. తరువాత ఆ మిత్రులు ఏం చెప్పినా నమ్ముతూ, వారిమీదే బాధ్యతంతా వదిలిపెట్టేస్తారు. ఈ అవకాశం చూసు కొని వారు, డబ్బంతా స్వంతంచేసుకొని, కాంతా రావుగారికి నష్టాలు చూపించేవారు. వాళ్ల తియ్యటి కబుర్ల మాయలో పడి, ఆయన వాళ్లవల్ల ఏమీ తప్పులేదనీ, ఒక్కొక్కప్పుడు నష్టం రావడం వ్యాపారంయొక్క సహజలక్షణమనీ అనుకుం టూండేవారు. ఒకరిద్దరి మోసం బాహాటంగా బయటపడినా, తా మింతకుముందు వారికిచ్చిన అధికారంవల్ల వారి నేమీ చెయ్యలేకపోయేవారు. ఆయన ఏభై అయిదేళ్ల జీవితంలోనూ సుమారు ముప్పై ఏళ్లు ఈవిధంగానే గడిచింది. చాలా ఆస్తి పొడవడమే కాకుండా, ఒక లక్ష రూపాయల దాకా అప్పు పెరిగి కూర్చుంది ఆయన నెత్తి మీద. ఆయనకు ఒక్కడే కొడుకు. ఇద్దరు కుమా ర్తెలు. కొడుకు మునసబు ఉద్యోగం చేస్తు న్నాడు కాకినాడలో. తండ్రికీ కొడుకుకీ పడదు: అసలు వ్యాపారమంటేనే కొడుకుకు గిట్టదు. కాంతారావుగారికిమట్టుకు ఈసారి ఏదైనా పెద్ద వ్యాపారం ప్రారంభించి, లక్షలు లక్షలు గణించా లని చాలా ఆతృతగా ఉంది. పేరుకుమట్టుకు కాంతారావుగారు కాని, ఆయనకున్న వ్యామోహ మంతా 'కనకం' మీదే. ఎవరైనా కొత్త వ్యక్తులు తటస్థిస్తే, వారి కేమాత్రం వ్యాపార జ్ఞానం ఉన్నా, వారిని ఏదైనా కొత్త వ్యాపారం గురించి సలహా అడుగుతూంటారు కాంతారావు గారు.

ఏ వ్యాపారానికైనా డబ్బు ప్రధానం. కాంతా రావుగారికి అది ముఖ్యంగా లోటు. ఉన్న డబ్బంతా ఎప్పుడో వ్యాపారాల్లో ఖర్చయిపోయింది. అదికాక లక్ష రూపాయలు అప్పుంది. అటువంటప్పుడు కొత్తవ్యాపారానికి డబ్బెక్కడ నుంచి వస్తుంది? కాని, అంతమాత్రాన కాంతారావుగారి వ్యాపార ఉత్సాహ మేమీ కొరతపడలేదు. కొత్తవ్యాపారం గురించి సలహా యివ్వదల్చుకున్న వ్యక్తుల్ని డబ్బు వచ్చేమార్గం కూడా సలహా అడుగు తూండేవా రాయన. అంటే ఎక్కడైనా, భారీ ఎత్తున అప్పిచ్చేవా రెవరైనా ఉన్నారా? అవీ, ఏవీ ఉపాయాలద్వారా ప్రభుత్వం దగ్గర్నుంచి అప్పు తేవచ్చో, ఇలాటి విషయాలుకూడా సలహా అడుగుతూండేవారు. శ్యామ్‌బాబును ఆయన అదే విధంగా సలహా అడిగారు. కాంతారావుగారి వ్యాపా రానుభవాల్ని విని, శ్యామ్‌బాబు ఆయన అమాయ కతకు ఆశ్చర్యపోయాడు. తనకు తోచిన సలహాలు కొన్ని వ్యాపారాలగురించి ఇచ్చాడు. కాని డబ్బు దొరికే మార్గంమట్టుకు తనకు తెలియదన్నాడు. కష్టపడి కూలీ పని చేసుకుని, వళ్లు వంచి పని చెయ్యడమో, లేక తనకున్న విజ్ఞానాన్ని విద్యార్థు లకు బోధించి, ప్రతిఫలంగా వా రిచ్చిన దానితో సంతృప్తి పడటమో తప్ప, సునాయాసంగా డబ్బు సంపాదించే ఉపాయా లేమీ తనకు తెలియవన్నాడు.

"అందాలరాణి" పోటీలో పాల్గొన్న సుందరి ముఖం ముడుచుకొని ఇంటికి తిరిగి వచ్చింది.

"ఏమే అలా ఉన్నావ్! పోటీ జోరుగా సాగిందేమిటి? స్నేహితు రాలు ఓదార్చింది.

"పోటీ సంగతి ఎలా ఉన్నా, ఆ జడ్జీలు మాత్రం చెడ్డ గడుసు వారే!" వాపోయింది సుందరి.

పి. ఎస్. రామనాథం (కాకినాడ)

కాంతారావుగారియం దేర్పడిన స్నేహభావంవల్ల, ఆయన కవసరమైతే తను తన శరీరాన్ని గాని, బుద్ధినిగాని, ఆయనకొరకు ఉపయోగించడానికి వెను దీయ నన్నాడు. చాలాసేపు యీ విషయాలు చర్చిం చినతరువాత దినకర్, శ్యామ్‌బాబూ ఇద్దరూ కాంతారావుగారివద్ద సెలవు తీసుకుని బయటకు వచ్చారు. దినకర్, శ్యామ్‌బాబును తన యింటికి రమ్మని పిలిచాడు. అప్పటికే తనకు చాలా కాలాతీత మైనదనీ, మరునాడు తప్పక దినకర్ యింటికి వస్తాననీ, శ్యామ్‌బాబు తనయింటికి వెళ్లి పోయాడు.

దినకర్ చాలా విజ్ఞానం గల వ్యక్తి. తన కాలేజీ కోర్సు పుస్తకాలే కాక, భౌతిక, రసాయనిక శాస్త్రాల గ్రంథాలనూ, హెచ్. జి. వెల్సు, హక్స్లే, బెర్‌ట్రెండ్ రసల్ మొదలైనవారి గ్రంథాలనూ కూడా చదివాడు. బాల్యంనుంచీ అతని మానస క్షేత్రంలో నాటబడిన భక్తి బీజాలు, పాశ్చాత్య విజ్ఞానం యొక్క ధోరణి తాకిడికి తట్టుకోలేక పోయి, అతని మనస్సును అత్యంత సందిగ్ధ స్థితి లోకి తెచ్చాయి.

అతని మనస్సు పాశ్చాత్యవిజ్ఞానానికీ, హైందవ మతానికీ సామరస్యం కుదుర్చుకోలేక బాధపడేది. 'సత్యం' అనేది ఏదో ఒకటే అయిఉంటుందనీ, ఈ రెండింటిలోనూ అది ఏదో తెలుసుకోవడం కష్టమనీ భావించేవాడు.

శ్యామ్‌బాబు మర్నాడు దినకర్ఇంటికి వెళ్లాడు. దినకర్ఇల్లు కూడా వూరికి వెలుపలగానే ఉంది. చుట్టూ పొలాలుండి, రోడ్డుకు నూరడుగుల దూరంలో ఉంది. దినకర్‌కు వివాహమైంది. ఇద్దరు పిల్లలుకూడా ఉన్నారు. రవి అనే నాలు గేళ్ల కుర్రాడూ, శశి అనే రెండేళ్ల అమ్మాయీ. దినకర్ భార్య శారద, ఇంటర్ దాకా చదివిన యువతి. వారిది చూడముచ్చటైన దాంపత్య మని శ్యామ్‌బాబు గ్రహించాడు. పిల్ల లిద్దర్నీ శ్యామ్‌బాబు చేరదీసి పలకరించాడు. వాళ్లకు తన జేబులోంచి బిస్కట్లు తీసి యిచ్చాడు.

ఆ పల్లెటూరికి వచ్చి దినకర్‌దంపతులు, మొదట్లో చాలా ఒంటరితనా న్ననుభవించేవారు. వారు వచ్చి రెండు నెల లయింది. క్రమంగా వారి కది అలవా టయింది. రాత్రిళ్లు, ఒక్కొక్కప్పుడు చుట్టూ చీకటి దట్టంగా వ్యాపించినప్పుడు, తమ ఒక్కరి యింట్లోనే లైటు వెలుగుతూ కన్ను పొడుచుకున్నా ఎక్కడా వెల్తురు కనిపించ నప్పుడు, పొలాల్లో దూరంగా నక్కల అరుపులూ, చుట్టూ కప్పల బెకబెకలూ వింటూ, దినకర్ "శారదా, అరణ్యవాసమంటే ఎలా ఉంటుందో మనకి తెలియజెయ్యడానికి మన ల్నిక్కడికి భగ వంతుడు పంపించాడేమో!" అనేవాడు శారదతో.

తమయింటికి, విద్యా సంస్కారం కలిగిన శ్యామ్‌బాబు రావడం శారదకూ దినకర్‌కూ ఇద్దరికీ సంతోషంగా ఉంది. అసలా పల్లెటూరులో తమతో తిరగగల మనుష్యులే వారికి కన్పించలేదు. దినకర్‌కు పనితో కొంత పొద్దు పోయినా, శారదకు అసలు తోచేదికాదు.

శారద యిచ్చిన టీ, బిస్కట్లూ తీసుకుంటూ, శ్యామ్‌బాబు వా రిద్దరితో చనువుగా మాట్లాడ నారంభించాడు. ముందర వాళ్ల సంభాషణ ఆ పల్లెటూరూ, అక్కడి మనుష్యుల అలవాట్లూ, తగిన సౌకర్యాలు లేకపోవడం మొదలైన విషయాల మీద సాగింది. ముఖ్యంగా, శారద అక్కడ పని మనుష్యులతో తను పడే అవస్థలన్నీ చెప్పసాగింది. వాళ్లకు పనులుచెయ్యడం చేతకాదనీ, ఒకటి చెప్తే ఒకటి చేస్తారనీ, నోటికి వచ్చినట్లు మర్యాదలేకుండా మాట్లాడతారనీ చెప్పింది. వాళ్లకు పని చెప్పేకన్నా అన్నీ మనమే చేసు కుంటే మంచిదనిపిస్తోందని అంది. ఆమెకు అక్కడి మనుషులూ, వాళ్ల ప్రవర్తనా ఏమీ నచ్చలేదు. దినకర్‌కూడా అక్కడి జనానితో తను పడే అవస్థలన్నీ చెప్పాడు. రైతులకు వ్యవ సాయంలో ఉపయోగకరమైన సలహా లేవైనా చెప్తే వాళ్లు వినిపించుకోరనీ, పైగా "ఈ సల హాలవల్ల లాభ మేందయ్యా? మాకు వానలు లేవు. వానలు కురిసే మార్గ మేదైనా చెప్పు" అంటారనీ చెప్పాడు.

ఏడుకొండలు

ఎందువలననో ప్రస్తుత విద్యావిధానం, చదువుకున్నవాళ్ళనీ పల్లెటూరి అమాయక ప్రజనూ ఒకరి కొకరు బాగా దూరమయ్యేట్టు చేస్తోందనీ, అది విద్యావిధానంలో ఒక ముఖ్య లోపమనీ శ్యామ్‌బాబు అన్నాడు. అందరిదీ ఒకే దేశం, ఒకే భాష. అయినా ఏదో కొద్ది చదువు చదువుకున్నంతమాత్రాన, సామాన్యప్రజకన్నా మనం అధికులమనుకోరాదనీ, అది చదువుకున్న వాళ్ళు గ్రహించాలని అన్నాడు. అదేవిధంగా ఉన్నత విద్య నభ్యసించినవారిని, ఏదో విచిత్రవ్యక్తిని చూసినట్టు చూడడం సామాన్యప్రజకు తగదన్నాడు.

అయితే ఆ విషయంలో సర్దుకోవలసినవారు విద్యావంతులేనని శ్యామ్‌బాబు అభిప్రాయం. తమ వేషభాషలలో వారు కొంత మార్పు తెచ్చుకోవాలి. సూటూ, బూటూ, హాటూ వెయ్యడం మానెయ్యాలి. హాయిగా, దేశీయపద్ధతిలో పంచె కట్టుకుని, లాల్చీగాని మామూలు చొక్కాగాని వేసుకొని, అందుకు అనువైన చెప్పుల్ని తొడుక్కుంటే, గ్రామీణప్రజలలో ఆ మనిషియందొక నమ్మక మేర్పడుతుం దన్నారు. స్వచ్ఛమైన మాతృభాషనే ఎక్కువగా వాడాలనీ, సామాన్య ప్రజముందు తమ గొప్పను నిరూపించుకోవడానికి అధికంగా ఇంగ్లీషు నుపయోగించడంవల్ల సాధించే దేమీ లేదనీ అన్నారు. పల్లెటూళ్ళను అభివృద్ధిచెయ్యడానికి ప్రభుత్వం అనేకమంది ఉద్యోగుల్ని నియమిస్తోంది. అందులో అందరూ చదువుకున్నవారే అయివుంటారు. అదీకాక కొంతమందికి పల్లెటూరిలో నివసించడం కష్టంగా ఉంటుంది. అట్టివారికి గ్రామీణప్రజలలో మెలిగి, వారికి అభివృద్ధిమార్గాలను బోధించటం సాధ్యం కాదు. వారి మాటలకు ప్రజలు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వరు. వారి యెడల గ్రామస్థులు సందేహాస్పద దృష్టిని కలిగిఉంటారు. ఇటువంటి విషయాలలో లోపం విద్యావంతులదే నన్నారు శ్యామ్‌బాబు.

దినకర్, శ్యామ్‌బాబుయొక్క మాటల్ని ఒప్పుకున్నాడు. ప్రతి అభివృద్ధికార్యక్రమంలోనూ 'వ్యక్తిగత ప్రవర్తన'వల్ల సాధించవలసిన దెంతైనా ఉందని గ్రహించాడు.

అదేవిధంగా పల్లెటూరిప్రజల బాహ్యప్రవర్తన ఎలా ఉన్నా, వారి ఆంతర్యాలలో ఉన్న మానవత్వాన్ని దర్శించి ప్రేమించాలని శ్యామ్‌బాబు అభిప్రాయం. వారిని ప్రేమించి సానుభూతితో చూసిననాడే వారికి సేవచెయ్య గలుగుతాం అన్నాడు.

తమ యింటికి తరుచు వస్తూండమని శారదా దినకర్‌లు శ్యామ్‌బాబును కోరారు. 'అలాగే, వస్తూంటానని' చెప్పి శ్యామ్‌బాబు తన యింటికి వచ్చేశాడు. రోజూ అతను సాయంకాలం ఇంటికి వచ్చాక టీ పెట్టుకొని త్రాగి, తరువాత వంట చేసుకుంటాడు. తనకు టీ కాచివ్వడంగాని, వంట చేసిపెట్టడంగాని ఎవరు చేసినా ఒప్పుకోడు. అతను ఆ యింటికి వచ్చిన మొదట్లో నారాయణి తను వచ్చి అన్నిపనులూ చేసిపెడతానంటే శ్యామ్‌బాబు ఒప్పుకోలేదు. అంతేకాక ఎప్పుడైనా లలిత, ఆయనకు వంటలోగాని, మరే పనిలోగానీ సాయంచేస్తానన్నా చెయ్యనిచ్చేవాడు కాదు. అందుకని లలిత, ఆయన వంటచేసుకుంటూంటే చూస్తూ వూరుకోవడమే గాని ఏమీ చేసేదికాదు.

అవాళ ఇంటికి వచ్చి, తలుపు తాళంతీసి లోపలికి వెళ్ళి మొఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కొని వచ్చి శ్యామ్‌బాబు వంట ప్రారంభించాడు. లలిత పాలు తీసుకొచ్చి, గ్లాసక్కడ పెట్టేసి గోడ కానుకొని నిల్చుంది. శ్యామ్‌బాబు ప్రొద్దుటి నుంచీ లలితను అంత పరీక్షగా చూడలేదు. తను దినకర్ ఇంట్లో టీ త్రాగాననీ, అందువల్ల పాలవసరం లేదనీ శ్యామ్‌బాబు చెప్పాడు. లలితేమీ జవాబు చెప్పకుండా నిల్చుంది. ఆమెమాట్లాడకుండా అలాగే నిల్చోడం చూసి, శ్యామ్‌బాబు ఆమె మొహంవైపు చూశాడు. ఆమె మొహం ఎందుకో చిన్నబోయి ఉంది.

"ఏం లలితా, అలా ఉన్నావ్ ?" అని అడిగాడు శ్యామ్‌బాబు.

"ఏంలేదు, బాబాయి" అంది లలిత. కాని, అందుకు ఏదో కారణం ఉందని శ్యామ్‌బాబు గుర్తించాడు. లలితమొహం ఎప్పుడూ ఉత్సాహంగా కలకలలాడుతూ ఉంటుంది. ఇంట్లో ఎన్ని చికాకులున్నా, ఇంట్లోవాళ్ళెవరూ దిగులుగా ఉండరు. అది ధర్మసూరిగారిలో ఉన్న ప్రత్యేకత. ఎన్ని కష్టాలలో ఉన్నా ఆయన నవ్వుతూ ఇంట్లోవాళ్ళందరికీ కథలూ, కబుర్లూ చెప్పి ఉత్సాహం కలిగిస్తారేగాని, దిగులూ, చిరాకూ, బాధా అనేవాటికి తావివ్వరు. అది, ఆయన ఆధ్యాత్మిక సాధనాఫలితం. పిల్లలందరికీ భగవద్భక్తి ఉంది. ఆ యింట్లో కోపతాపాలనేవి కన్పించవు. సాధారణంగా నవ్వులతో ప్రతిధ్వనిస్తూంటుంది. లేమి అనేది వారి నెక్కువ బాధించినట్లు కన్పించదు. ఎప్పుడైనా ధర్మసూరిగారికి కోపంవచ్చినా అది బహు కొద్దిక్షణాలు మాత్రమే నిలుస్తుంది. కొద్దిసేపటిలోనే మళ్ళీ నవ్వుతూ మాట్లాడుతారు. శ్యామ్‌బాబు ఇవన్నీ గమనించాడు.

"శంకర్ దగ్గరినుంచి ఉత్తరం వచ్చిందా ?" అని అడిగాడు శ్యామ్‌బాబు. శంకర్ దగ్గరినుంచి ఉత్తరంకోసం ధర్మసూరిగారి కుటుంబం చాలా కాలంనుండి ఎదురుచూస్తున్నారు.

"వచ్చింది బాబాయి" అని లలిత జవాబిచ్చింది.

"ఏం రాశాడమ్మా ?"

"బావ ఇక్కడకు వచ్చాడని, వాళ్ళ నాన్నగారు కేకలేశారుట. ఎవరో పదివేల రూపాయలు కట్నమిస్తామనీ, బావ ఎం. ఎస్ సీ. పాసయ్యాక విదేశాలు వెళ్ళేందుకు మరొక పదివేలు యిస్తామనీ వచ్చారట. ఆ పిల్లని బావ [illegible]ంటున్నా, ఆ అమ్మాయి ఫోటో చూపించి ఏమైనాసరే నువ్వు ఆ పిల్లను చేసుకోవలసిందే అంటున్నారట."

"అంతేనా ?" అన్నాడు శ్యామ్‌బాబు.

"ఆపిల్లను చేసుకోకుండా, మా సంబంధం చేసుకుంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటానందిట మా అత్త. పైగా మేమేదో బావకి మందుపెట్టేశామని కూడా అంటున్నారట."

"అయితే శంకర్ ఏమంటాడు ?"

"బావ వారంరోజుల్లో ఇక్కడి కొకసారి

వచ్చి నాన్నగారితో మాట్లాడతానని వ్రాశాడు."

"మంచిదేకదా! నువ్వు దాన్నిగురించి బెంగ పెట్టుకోవటమెందుకు? శంకర్ నిన్ను తప్పక వివాహం చేసుకుంటాడు."

"నన్ను చేసుకుంటే ఏం లాభం? మేం డబ్బులేనివాళ్లం. బావకు ముద్దూ ముచ్చటా మావాళ్లేంతీరుస్తారు? పైగా వాళ్ల తలిదండ్రులతో విరోధం తెచ్చుకొని, అతను ఏం సుఖం అనుభవిస్తాడు? లోకంకూడా అన్నివిధాలా మమ్మల్నే అంటుంది" అంది లలిత.

శ్యామ్‌బాబు లలితమొహంవేపు చూశాడు. హృదయంలోని బాధ నణచుకోవటం క్షణక్షణానికీ కష్టమైపోతున్న ఆ అమాయకురాలి మొహం చూసేటప్పటికి, శ్యామ్‌బాబు మనస్సు జాలితో నిండిపోయింది. కానీ ఈ మాటలు లలితవి కావని అతనికి తెలుసు.

"ఈమాటలన్నీ నువ్వే అనుకుంటున్నావా? ఎవరైనా అన్నారా?"

"ఎవరంటేనేం? నిజం అదేకదా బాబాయి. మానాన్న బావతో ఆ సంబంధమే చేసుకోమనీ నన్ను ఇవ్వననీ చెప్పేస్తారట." అని అంది. ఈ మాటలు అంటున్నప్పుడుమాత్రం లలిత కళ్లల్లోని నీరు మరి ఆగలేదు. అవి ఆమె చెక్కిళ్ల మీదనించి ప్రవహిస్తూనే రాలాయి.

"అదంతా వట్టి అబద్ధం లలితా. మీ నాన్నగారు అంత తెలివితక్కువగా ప్రవర్తిస్తారని నే ననుకోను. శంకర్‌కు నిన్ను చేసుకోవాలనుంది. అందుకు అతను తన తలిదండ్రుల్నికూడా ఎదిరించడానికి సిద్ధపడుతున్నాడు. అతనికి మీ బీదతనం తెలియక కాదు. కాని అతనిదృష్టిలో డబ్బుకు విలువలేదు. చిన్నప్పటినుంచి నువ్వే అతని భార్యవని అతని మనస్సులో ఏర్పడింది. ఇంకొక అమ్మాయిని చేసుకుంటే, అతను జీవితాంతం బాధపడతాడు. ఒకరిని మనస్ఫూర్తిగా ప్రేమించి, ఆమెను పెళ్లి చేసుకోలేక, మరొక స్త్రీని ఇతరుల బలవంతంమీద చేసుకుంటే, ఆ వ్యక్తి జీవితాంతం ఎంతో బాధపడతాడు. ఆ విషయం, రెండు వైపులా ఉండే పెద్దలు అర్థంచేసుకోవాలి. ఈ విషయం మీ నాన్నగారు అర్థం చేసుకొంటారనుకొంటాను" అన్నాడు శ్యామ్‌బాబు కొంత ఉద్రేకంతో. లలితమొహంలో విచారం అదృశ్యమై బాబాయి చెప్పిన మాటలు నిజం. తను ఎంత బాధపడుతూందో, బాబాయి ఒక్కడే గ్రహించాడు. పాపం బావకూడా చాలా బాధపడుతుంటాడు. లలిత కళ్లముందు శంకర్ మెదిలాడు. తనని చేసుకుంటానని స్పష్టంగా చెప్పేశాడు. తను బావకు కళ్లద్వారానే కృతజ్ఞత తెల్పుకుంది. అంత మంచిమనసుగలవాడు, ఎన్ని జన్మలు తపస్సుచేస్తే దొరుకుతాడు! అతని కాళ్లమీద పడి, ఆ పాదాలకి దండం పెట్టాలనిపిస్తుంది. తను అల్లా కాళ్లమీద పడినప్పుడు బావ తన రెండుభుజాలు పట్టుకుని లేవనెత్తి దగ్గరకు .... అంతకన్నా ఎక్కువ ఊహించుకోవడానికి లలితకు సిగ్గేసింది.

శ్యామ్‌బాబు లలితమొహం కొద్దిగా వికసించడం చూసి, "శంకర్ చాలా అదృష్టవంతుడు లలితా. నిన్ను వివాహం చేసుకున్ననాడు, అతను ఎంత భాగ్యవంతుడవుతాడో అతనికి తెలియదు" అన్నాడు.

లలి తేమీ మాట్లాడలేదు. శంకర్ బావ తనని వివాహం చేసుకుంటే ఆ అదృష్టం తనది. అతను ఇప్పటికే చాలా భాగ్యవంతుడు. తను చాలా పేద వారి కుమార్తె. బాబాయి మాటలన్నీ ఎలాగో ఉంటాయి. ఇంతలో తల్లి పిలవడంవల్ల లలిత వెళ్లిపోయింది.

ఆరోజు రాత్రి భోజనాలయ్యాక పనులు చేసుకుంటూ లలిత శ్యామ్‌బాబు అన్నమాట లన్నీ తల్లితో చెప్పింది. ఆఖరున తనని పెళ్లిచేసుకుంటే శంకర్ చాలా భాగ్యవంతుడవుతా డన్న మాట కూడా చెప్పి, "చూడవే అమ్మా. బాబాయి ఏమంటున్నారో" అని నవ్వింది.

ఆమాట విని జగదాంబ వెటకారంగా నవ్వుతూ "అవునేవ్. మీ బాబాయిగారో పదిలక్షల కధికార్తై, నిన్ను పెంచుకుని, నీ కా ఆస్తంతా అప్పజెపుతారేమో. అప్పుడు శంకర్ చాలా భాగ్యవంతుడౌతాడు" అంది నవ్వుతూ. తల్లీ, కూతుళ్లిద్దరూ నవ్వారు. వాళ్ల మాటలు వింటున్న రాము "అక్కా! అక్కా! నన్ను అప్పుడు మర్చిపోకేం. నా ఇంజినీరింగ్ చదువు కేమన్నా సాయం చెయ్యి" అన్నాడు.

"భలే! భలే! బావుందిరా. అప్పుడు మనందరికీ కారులూ, మంచి మంచి బట్టలూ అన్నీ ఉంటాయి కదూ!" అన్నాడు శీను.

"అయితే నీకేం కావాలే పద్మా?" అని అడిగింది, లలిత నవ్వుతూ చెల్లెల్ని. "నాకో సిల్కు పరికిణీ, సిల్కు జాకెట్టూ కుట్టించవే, అక్కా!" అంది పద్మ. ధర్మసూరిగారి ఇల్లంతా నవ్వులతో ప్రతిధ్వనించింది. లలితకు ఎంతో ఉత్సాహం వచ్చింది. పాపం! బాబాయికి డబ్బుంటే ఎంత బాగుణ్ను! ఇలాటి పల్లెటూరికి వచ్చి, ఇన్ని తిప్పలు పడవలసిన అవసరం లేకపోను కదా! అతనికి వచ్చే జీతంలో భార్యాబిడ్డల కేమైనా పంపిస్తున్నాడో లేదో! అస లతనికి భార్యాబిడ్డ లున్నారో లేదో కూడా తనకి తెలియదు. ఎప్పుడైనా ఆ విషయాలు తను ఎత్తబోతూంటేనే అందు కవకాశమిచ్చేవాడుకాదు బాబాయి. 'ఈసారి ఏమైనా వాళ్ల విషయం అడగాల్సిందే బాబాయిని' అని నిశ్చయించుకొంది.


శ్యామ్‌బాబు దినకర్ ఇంటికి తరుచూ వెళ్తుండేవాడు. ఒకొక్కప్పుడు డాక్టరు మిశ్ర వద్దకు వెళ్ళి బాతాఖానీ చేస్తుండేవాడు. డాక్టరు ఊళ్లోకి కేసులమీద వెళ్లినప్పుడు దినకర్ ఇంటికిగాని, కాంతారావు ఇంటికి గాని వెళ్తూండేవాడు. దినకర్‌కు శ్యామ్‌బాబు అంటే చాలా అభిమానం. అతనికికూడా శ్యామ్‌బాబు ఎందుకు ఇటువంటి స్థితికి వచ్చాడో ఆశ్చర్యంగా ఉండేది. ఇంత చదువుకున్నవాడూ, ఇంత తెలివైనవాడూ ఏ పెద్ద ప్రభుత్వోద్యోగమో ఎందుకు చెయ్యటంలేదు? లేకపోతే పెద్ద పెద్ద కంపెనీలలో నైనా ఇతని తెలివితేటలకు సరియైన ఉద్యోగం దొరుకునే! అవన్నీ వదిలేసి ఈ పల్లెటూరు ఎందుకు వచ్చాడు? అని దినకర్ అనుకుంటూండేవాడు. కాని, శ్యామ్‌బాబుదగ్గర ఆ విషయాలు ఎత్తలేకపోయాడు.

ఒక ఆశ్రమానికి శ్యామ్‌బాబు వెళ్లినప్పుడు అతను, అక్కడ రెండురోజు లుండదల్చుకుని, దగ్గరలో ఒక గది అద్దెకు తీసుకుందామని ప్రయత్నించాడు. ఒక మార్వాడీ, ఆ మహాత్ముని శిష్యులలో ఒకడు, ఒక యిల్లంతా అద్దెకు తీసుకుని మళ్లీ అందులోని గదులు ఇతరులకు అద్దె కిచ్చేవాడు, తను కొంతభాగంలో వుంటూ. ఆ మార్వాడీ పేరు బిహానీ. శ్యామ్‌బాబు ఆ మార్వాడీవద్ద నెలకు ఇరవై రూపాయల అద్దెమీద ఒక గది అద్దెకు తీసుకొన్నాడు. శ్యామ్‌బాబువలెనే ఇంకొక నలుగురు నెలకు ఇరవైచొప్పున నాలుగు గదులు అద్దెకు తీసుకొన్నారు. బిహానీ శ్యామ్‌బాబు, ఇంగ్లీషులో చాలా విద్వత్తు కలవాడనీ, మంచి శైలిలో చక్కగా రాయగలడనీ తెలుసుకొని అతన్ని మర్యాదగా చూస్తుండేవాడు. డబ్బు దగ్గర చాలా ఖచ్చితమైన మనిషనీ, ఖర్చుపెట్టిన ప్రతి దమ్మిడీ కూడా పద్దు వ్రాస్తాడనీ బిహానీగురించి శ్యామ్‌బాబు తెలుసుకొన్నాడు.

ప్రతిరోజూ తెల్లవారుజామున లేచి కాలకృత్యాలు తీర్చుకొని ఆశ్రమానికి వెళ్లడం, అక్కడ స్వామివారిని దర్శించి, ఆ మహాత్ముని బోధను వినడం, తరువాత ఆశ్రమ పద్ధతిప్రకారం జరిగే పూజలూ, నామ సంకీర్తనలూ, గ్రంథ పఠనా మొదలైన కార్యక్రమాలలో అందరూ పాల్గొంటుండేవారు. స్వామివారి బోధన లన్నింటినీ ఇంగ్లీషులోకి తర్జుమాచేసి శ్యామ్‌బాబు రాసుకుంటూండేవాడు, తన ఉపయోగార్థం. ఒక నెల రోజులైనతరువాత శ్యామ్‌బాబు ఆశ్రమాన్ని వదిలి వెళ్లిపోయేసమయంలో బిహానీ శ్యామ్‌బాబును తనతో భోజనంచెయ్యమని బలవంతం చేశాడు. అంతవరకూ బిహానీ భోజనానికి ఎవరికైనా ఒక కప్పు టీ యైనా ఇవ్వలేదు. తనను బిహానీ భోజనానికి పిలవడం శ్యామ్‌బాబుకు ఆశ్చర్యం వేసింది. సరే 'వస్తా' నని జవాబిచ్చాడు.

అవాళ బిహానీ చాలా డబ్బు ఖర్చుపెట్టి శ్యామ్‌బాబుకు పెద్ద విందు భోజనం ఏర్పాటు చేశాడు. అయిదారు రకాల తీపివస్తువులూ, పళ్లూ, పాయసం, చపాతీలతో శ్యామ్‌బాబు, బిహానీవిం దారగించాడు. బిహానీ, స్వామీజీ యొక్క ఆంతరంగిక శిష్యుణ్నని చెప్పి, స్వామీజీ పాదాల దగ్గర కూచొని తను తీయించుకొన్న ఫోటోను శ్యామ్‌బాబుకు చూపించాడు. బిహానీ ఉద్దేశంలో తను స్వర్గానికి వెళ్లడానికి ఆ ఫోటో 'పాస్‌పోర్టు'లా పనిచేస్తుందని. విందు అనంతరం ఏవో మాటలు మాట్లాడుతూ, బిహానీ, శ్యామ్‌బాబు ప్రతిదినం స్వామివారి బోధనల్ని ఇంగ్లీషులో రాసుకుంటున్న 'నోట్‌బుక్' ను ఒకసారి యిమ్మనీ, దాని కాపీ నొకదానిని తను తయారుచేసుకుని తిరిగి ఆ పుస్తకాన్ని శ్యామ్‌బాబుకు పంపించేస్తాననీ, శ్యామ్‌బాబును కోరాడు. అందు కంగీకరించి శ్యామ్‌బాబు అతని కా పుస్తకం ఇచ్చి శ్యామ్‌బాబు మద్రాసు వచ్చేశాడు. మద్రాసులో కొందరు స్నేహితుల ద్వారా బిహానీ నమ్మదగ్గ వ్యక్తి కాడని శ్యామ్‌బాబుకు తెలిసింది. అస లతను తమందరికీ,





ఏడుకొండలు

గదికి ఇరవై రూపాయల చొప్పున అద్దెకిచ్చి, మొత్తం తమవద్ద నూరురూపాయలు—తను ఉంటూ కూడా—వసూలుచేసిన ఇంటిని, అసలు యజమానివద్ద నుండి, మొత్తం ఇంటిని నెలకు పాతిక రూపాయల అద్దెకు తీసుకొన్నాడు. అంటే ఆ యింటిమీద బిహానీ నెలకు డెబ్బయి అయిదు రూపాయలు గణించేవాడు. అదీ స్వామి ఆశ్రమ పరిసరాలలో, స్వామిదర్శనార్థం వచ్చే జనంవద్ద బిహానీ కోటీశ్వరుడని ప్రఖ్యాతి. బొంబాయిలో పెద్ద నగలవ్యాపారస్థుడు. అటువంటివాడి పనిఇది.

కొన్ని నెలలదాకా తన 'నోట్‌బుక్' తిరిగి రాక పోయేటప్పటికి శ్యామ్‌బాబుకు అనుమానం వేసింది. ఇంతలో "స్వామివారి బోధనామృతం" రచన—రూప్‌కుమార్ బిహానీ—అనే పుస్తకం ఒక స్నేహితుడు తెచ్చి యివ్వగా చూసి, శ్యామ్‌బాబు నిర్ఘాంతపోయాడు. ఆ పుస్తకంలోని రచనంతా, తన నోట్‌బుక్‌లోదే. తనదగ్గర నుంచి నోట్‌బుక్ తీసుకుని, బిహానీ తనపేర అచ్చువేయించుకున్నాడు. అటువంటి వ్యక్తులు కూడా మహాత్ములవద్ద చేరుతూంటారని, శ్యామ్‌బాబు దినకర్‌కు చెప్పేవాడు. దినకర్‌కు, ఇది విని చాలా కష్టంకలిగి "బిహానీమీద తగుచర్య తీసుకోలేకపోయారా ?" అని శ్యామ్‌బాబు నడిగాడు. దానికి శ్యామ్‌బాబు నవ్వాడు.

"పోనీ, అతనైనా మంచిపనే చేశాడు కదా. నలుగురూ ఆ బోధ చదివి ఆనందిస్తారు. అయితే, అత నా విషయం నాతో చెప్పి చేస్తే నేను చాలా సంతోషించేవాణ్ణి. అబద్ధమాడి మోసం ఎందుకు చెయ్యాలీ ? కానీ, మన కా బాధ ఎందుకు ? వ్యక్తి యొక్క గుణం తెలిసింది. అంతే చాలు" అన్నాడు శ్యామ్‌బాబు.

దినకర్, దేశంలోని అన్ని ఆశ్రమాల గురించి శ్యామ్‌బాబును అడుగుతుండేవాడు. శారదకు, దినకర్‌కున్నంత ఉత్సాహం ఆధ్యాత్మిక విషయాల మీద లేదు. ఆమె శ్రద్ధ అంతా ఇంటిమీదా, భర్త మీదా, పిల్లలమీదే ఉండేది. దినకర్, శ్యామ్‌బాబూ మాట్లాడుకునే దైవవిషయాల్లో, ఆమె ఎక్కువ పాల్గొనేది కాదు. ఒకసారి దినకర్, శారదకు ఈ విషయాలయం దాసక్తి లేదని తనకి విచారంగా ఉందని అంటే, శ్యామ్‌బాబు "ఇంట్లోవాళ్లందరూ వేదాంతులే అయితే మరి వంటా, పనులు ఎలా జరుగుతాయి ? అందరూ ధ్యానంలోనే కూచుంటారు. మరి తిండీ వగైరా కైలాసము నుంచి తెప్పించుకునే శక్తి ఇంకా రాలేదుగా" అనేవాడు నవ్వుతూ. మళ్ళీ తనే "ఆమె తన స్వధర్మాన్ని చక్కగా నిర్వహించుకొంటోంది. నీ గురించీ, పిల్లల గురించీ ఆమె చూపించే శ్రద్ధ ఎంతైనా మెచ్చుకోవచ్చు. అయినా, దినకర్, పరీక్షకు నిలబడవలసినరోజే వస్తే, ఆమె నిల్చినట్టు, మనం నిలవలేమేమో అనిపిస్తోంది నాకు" అనికూడా అనేవాడు.

శ్యామ్‌బాబు, శారదతోకూడా అప్పుడప్పుడు బాతాఖానీ వేస్తూండేవాడు. నాలుగేళ్ళ రవిని కూడా పలకరిస్తూండేవాడు. శశిని ఎత్తుకుంటూండేవాడు. రవి, శ్యామ్‌బాబుమొహం పరీక్షగా చూసేవాడు. వాడి కళ్ళు పెద్దవి. జుత్తు గిరజాలు తిరిగి ఉండేది. వాడిది చాలా ముభావంగా వుండే స్వభావం. ఎక్కువ మాట్లాడే వాడు కాదు. అయినా శ్యామ్‌బాబు రాగానే నవ్వేవాడు. వాడికి, మాట్లాడటం బాగా రాలేదు. చిన్నచిన్న మాటలు మాట్లాడుతాడు. ముఖ్యంగా తన భావాన్నీ, కళ్ళల్లోనూ, కనుబొమలు ఎగరెయ్యటంలో చూపించేవాడు.

దినకర్‌కు రవి అంటే ప్రాణం. రవి అల్లరికి శారద ఎప్పుడైనా విసుక్కునేదిగాని దినకర్ అసలు విసుక్కునేవాడు కాదు. రాత్రిపూట రవిని దినకర్ తన పక్కలో పడుకోబెట్టుకొనేవాడు. ఒకరోజు సాయంకాలం దినకర్ చాలా పొద్దుపోయేదాకా ఇంటికి రాలేదు. శారద వంటింట్లో పనిచేసుకుంటూంటే రవి వచ్చి "అమ్మా ! భయమేత్తోందే" అని ఏడ్చాడు. శారదకు మనస్సు గతుక్కుమన్నట్లయి, చేతిలో ఉన్న నేతిసీసాను జార్చేసింది. అది పగిలి ముక్కలై నెయ్యంతా నేలపాలయింది. రవి మరింత భయపడ్డాడు. శారద తన కోపాన్ని రవిమీద కొంత చూపించింది. "ఎప్పుడూ లేనిది భయమెందుకు నీకు ? వెళ్ళి ఆడుకో !" అని కసిరింది. రవి కదలకుండా అక్కడే నిల్చున్నాడు. శశి మంచంమీద కూర్చొని ఉంది. గది శుభ్రంచేసి, గాజుపెంకులన్నీ పారేసి, బిక్కమొహం వేసిన రవిని ఎత్తుకుంది శారద. అప్పుడు వాణ్ణి లాలించి, భయం లేకుండా చేసింది. ఇంతలో దినకర్ వచ్చాడు. తరువాత ఈ విషయం అంతా మర్చిపోయారు.

మరునాడు రాత్రి నిద్రపోతున్న రవి కెవ్వుమని కేక వేశాడు. శారదా, దినకర్ ఇద్దరు లేచి చూశాటప్పటికి, రవి, తల వెనక్కి వేలేసి కొట్టుకుంటున్నాడు. నోటివెంట నురగ వస్తోంది. అది 'ఫిట్సు' అని తెలిసి వాణ్ణి చేతుల్లోకి తీసుకొంది శారద. కొద్దిసేపు అలా కొట్టుకొని, తర్వాత ఆగాడు. వళ్ళు చాలా వేడిగా ఉంది. అప్పటికి రాత్రి పన్నెండయింది. ఏంచెయ్యాలో వాళ్ళకు తోచలేదు. దగ్గరలో మంచి డాక్టరు లేడు. పారుగూరికి పోయి డాక్టర్ని పిల్చుకురావాలి. అది తెల్లవారితేనేగాని జరిగేపని కాదు. మరొక గంట పోయాక మళ్ళీ రవికి ఫిట్సువచ్చింది. వాడు, "అమ్మా, భయం ! భయం !" అని, ఇంటి కప్పువేపు చూస్తుండగా ఫిట్సువచ్చింది. ఫిట్సులో కూడా వాడు కప్పుకేసి చూస్తూ, అక్కడేదో భయంకరమయిన దృశ్యాన్ని చూస్తున్నట్టు మొహం వికారంగా పెట్టసాగాడు.

దినకర్‌కు పిల్లవా డెందుకు భయపడుతున్నాడా ? అని ఆలోచనగా ఉంది. జ్వరం తీవ్రంగా వచ్చేసింది. రవినుదురుమీద తడిగుడ్డ వేశారు. ఉడుకోలోన్ వాడారు. కానీ, వాడి భయం సంగతి వాళ్ళ కర్థంకాలేదు. ఇద్దరూ చెరొకప్రక్క కూచొని, రవిని పలకరిస్తూ, ధైర్యంచెప్పసాగారు. ఎలాగో తెల్లవారేవరకూ అలాగే గడిపారు. రవిని ఎత్తుకుని చాలాసేపు దినకర్ తిప్పాడు. రవి నెలాగయినా పడుకోబెట్టాలని శారద ప్రయత్నించింది. కాని, వాడు కన్నుమూసి ఒక నిముషం కాగానే మళ్ళీ త్రుళ్ళిపడి "భయం! భయం!" అనికేకలేస్తూ లేచేవాడు.

(సశేషం)

ఆనాడు శ్రీనాథుడు ధౌతవస్త్రములు ధరించి యుండెను. బంగారుచాయగల ఆతని శిరస్సునుండి పాదములవరకు సువర్ణదీనారములు ధారలు కట్టుచుండ, చూపరులకు మేరునగముపై కనకధారాభిషేకము జరుగుచున్నట్లే నేత్రపర్వము కావించెను. శ్రీనాథుని ముఖమున గర్వముగాని, సంతోషము కాని కనిపింపలేదు. ఆతడు సర్వాత్మనా బ్రహ్మధ్యాన తత్పరుడై, ఆ కనకాభిషేకము తన ధ్యేయమూర్తియగు భారతీదేవతకు జరుగుచున్నట్లే భావనచేసెను.

కనకాభిషేకానంతరమున దేవరాయల యనుజ్ఞతో రాజపురోహితుడును, సభాపతియు అరుణగిరినాథ డిండిమభట్టును చంద్రభూషక్రియాశక్తియు ఒక్కొక్కరు ముమ్మారు వరుసగా "శ్రీనాథభట్టు కవిసార్వభౌముడుగా నభిషిక్తుడయ్యెను!" అని సభలో నుద్ఘోషించిరి. పురోహితాది వేదవిదులు పృథివిని అంతరిక్షమును దివమును దిక్కులను, అప్పులను, ఓషధులను, వాక్కును, ఋగ్యజుస్సామములను సమస్తదేవతలను సంబోధించుచు శ్రీనాథుని కవిసార్వభౌమునిగా నభిషేకించితిమని సమస్తలోకములకు ప్రకటించు వైదిక మంత్రములతో కలశోదకముల నాతని నభిషేకించిరి. వేదవిధుల యాశీర్వచనములతో కనకాభిషేకము పరిసమాప్తమైనది. శ్రీనాథుడు దేవరాయల నిట్లు కీర్తించెను.

"ఖండేందుమౌళిపై గలహంస పాళిపై
గర్వారథూళిపై గాలు ద్రవ్వ
మిన్నేటితెరలపై మించు తామరలపై
మహిమంచు నురులపై మల్లరించు
జంభారిగజముపై జంద్రికారజముపై
జందనధ్వజముపై జౌకళించు
ముత్యాల సరులపై మొల్ల క్రొవ్విరులపై
ముదికల్పతరువుపై మోహరించు
వెండిమలయొక్కి శేషాహి వెన్నుదన్ని
తొడరి దుగ్ధాబ్ధితరగలతోడ నడరి
నెరతనంబాడి నీకీర్తి నిండె నహహ,
లక్షణోపేంద్ర, దేవరాయక్షితీంద్ర!"

అంతట నభిషేకించిన దీనారటంకాల నన్నిటిని ముత్యాలశాలముంగిట కాచుకొనియున్న అశేషదీనానాథజనములకు రాజసేవకులు వెదజల్లి పంచిపెట్టిరి.

*　　　*　　　*

మూడుదినముల పిమ్మట రాయలు కవిసార్వభౌముని దన యేకాంతమందిరమునకు పిలువనంపెను. అప్పుడు ప్రధానితప్ప, మరి ఎవ్వరు నక్కడ లేరు. సంభాషణము ముఖ్యముగా ప్రధానియే సాగించెను. పెదకోమటి వేమప్రభువును యువరాజా రాచవేమనను సింగనప్రధానిని గూర్చి ప్రస్తావించి, అక్కడి విద్వాంసులనుగూర్చికూడ ప్రశ్నించిరి. వేమప్రభువులు తమకేమైన ప్రత్యేక సందేశము పంపియున్నచో ప్రభువు లాలకింప సావధానచిత్తులై యున్నారనిరి. శ్రీనాథుడు తనచే నట్టి సందేశమేదియు పంపలేదని సూచించి, 'తమరు రహస్య సందేశ మేమైన పంపదలచినచో నందీయగల'ననెను.

ప్రధాని కొంత తటపటాయించి రాయల కనుసన్న గ్రహించి ఇట్లనెను—"మీబోటి విద్వాంసుల నభిమానించుచున్నందున రాయలవారికి వేమప్రభువులపై సదభిప్రాయ మతిశయించినది. వారి

కవిసార్వభౌముడు

16వ పేజీ తరువాయి

రాజ్యము అన్నివైపుల ఒత్తిడిపడుచున్నది. వారు నామకః రాయలవారి సామంతులగుటకు అంగీకరించునెడల, వారి ప్రస్తుత రాజ్యమునకు వినుకొండ కందుకూరు రాజ్యములు కూడ కలిపి, కొండవీటిరాజ్యమును వృద్ధిచేయుటకు రాయలవారు సుముఖులుగా నున్నారు. మరి వారి కిది రుచించునో లేదో! మీరే ఇట్టి శుభవార్త చేర్చుటకు యోగ్యులని తోచినది."

శ్రీనాథుడు గంభీరముగా "దేవరవారి సందేశము పరమగోప్యముగా మా ప్రభువులకు స్వయముగాగాని, సింగనప్రధానిముఖమునగాని చేర్చెద" నని మాట యిచ్చెను.

పిమ్మట రాయలే సంభాషణ మారంభించెను. "కవి సార్వభౌమా! విద్యామల్లునకు పర్వతమల్లునకు మల్లయుద్ధ మేర్పాటుచేసి, వినోదింప నిచ్ఛ గలిగినది. మీరు అవధానములో విద్యామల్లున కిచ్చిన సమాధానమువలన ఏదో విశేషమున్నదని గమనించి, అప్పు డాప్రస్తావమునుండి విరమించితిమి. అందులోని ధర్మరహస్యము మేము వినదగునా?"

వెంటనే శ్రీనాథు డిట్లనెను: "మహాప్రభువులగు తమకు తెలుపగూడని ధర్మమేముండును! తమకంటె దేహబలము ఎన్నోరెట్లు అధికముగా నున్నవారిని జయించుటకు గోపవిద్యా సంప్రదాయము వెలసియుండెను. ఆ రహస్యము గర్గాచార్యులవలన బలరామకృష్ణులు గ్రహించి, అవలీలగా కువలయాపీడమును చాణూర ముష్టికులను సంహరించిరి. ఆ రహస్యము మరి ఎవ్వరికి నుపదేశింపగూడదని బలరామకృష్ణులు శపథములు చేసికొనిరి. దుర్యోధనమహారాజు బలరాముడు మదిరాపానమత్తుడైయున్న సమయమున మోసముచే ఆ రహస్యము సంపాదించెను. కురుక్షేత్రసంగ్రామములో దుర్యోధనుడు బహుపర్యాయములు ప్రయోగించినను, వెంటనే భీమసేనుని వజ్రకాయమును నొప్పింపలేకపోయెను. తుదిగదాయుద్ధములో భీమసేనుని వజ్రకాయము జముకుచుండుట గమనించియే, శ్రీకృష్ణుడు ఊరుభంగము సూచింపజేసెను. ఆగ్రహించిన బలరామునికి దుర్యోధనుని మోసము తెలిపి, శ్రీకృష్ణుడతని శాంతింపజేసెను. యుధిష్ఠిరుడు చక్రవర్తియై గోపవిద్యను నిషేధించుచు శాసనము చేసెను. తదాది భరతఖండములో నీ విద్య విస్మృతప్రాయమైనది. అప్పుడు నిష్కాసితులైనవారివలన విదేశములలో నక్కడక్కడ నిలిచి ఈమధ్య పారశీకమునుండి విద్యామల్లునకు సంక్రమించినది.

"ఈ గోపవిద్యలో మల్లవిద్యా నైపుణ్యము లేదు. ఏదోవిధముగా ప్రత్యర్థి ఆయువుపట్టు నొక్కి మూర్ఛిల్లజేయుటే దాని రహస్యము. దీనికి ప్రతిక్రియగా దేహమునకు వజ్రలేపము పూసికొనుట కూడ అధర్మమే. గోపవిద్యచే మల్లక్రీడ మల్లురకు ప్రాణాంతకమగును."

దేవరాయ లాలకించి విద్యామల్లుతో మల్లయుద్ధము ప్రస్తావన వదలి పర్వతమల్లు విద్యాప్రదర్శనము చూడవలెనను కోరిక కలదనెను. అందులకు శ్రీనాథుడు, "పర్వతమల్లువంటి భీమ



కవిసార్వభౌముడు

బలులు లోకములో అరుదుగా జన్మించుచుందురు. ఆతనిని ప్రతిఘటింపగల మల్లురు ఉండరు. ఆతని బలప్రదర్శనముచూచి తాము వినోదింపవచ్చును" అనెను.

దేవరాయలు త్వరలోనే పర్వతమల్లు బలప్రదర్శన సభ కావించెను. దానికి పెద్దలతోబాటు విద్యానగరములోని ప్రధానమల్లులందరు విచ్చేసిరి. విద్యామల్లు కూడ వచ్చెను.

ఆసభలో రంగములోనికి వచ్చి పర్వతమల్లు ముందు శ్రీనాథుని ప్రస్థానసమయమున వేమ ప్రభువుకు చూపిన ప్రదర్శనములన్నియు ప్రదర్శించెను. ఆ పిమ్మట బండి యొకటి తెప్పించి, యందులో పట్టినంతమంది బలాఢ్యులను కూర్చుండజేసి, దానికి బలిష్ఠములగు నాలుగు వృషభములు పూన్చిరి. దానివెనుక పల్లెకు కట్టిన మోకు పర్వతమల్లు నడుముకు కట్టుకొని, చేతులతో పూని నిలుచుండెను. ఎంత అదలించి తోలినను ఆరెండుజతల యెడ్లును అడుగైన ముందుకు వేయ లేకపోయెను. అంతట కొంతవడికినవ్వుచు ఆ బండిని పర్వతమల్లే వెనుకవెనుకకు కీడ్చుకొనిపోయెను.

ఆతడంతట ఏనుగుపాలెము దారిలో పట్టిన ఎలుగుబంట్లను తెప్పించి, రెండుచేతులతో రెంటిని పిల్లికూనలను పట్టినట్లు పట్టి, రెండు బాహువులు చాపి నిశ్చలముగా నిలిచెను. అది చూచి మల్లురందరు విభ్రాంతి నొందిరి.

ఆతడు చివరకు కావించిన ప్రదర్శనము విద్యానగరప్రజలు కొన్ని తరములవరకు మరచిపోలేదు. పర్వతమల్లు నేలపై బోర్ల పడుకొనెను. వీపున మెడవద్ద మూరెడు మేర బలిష్ఠమైన పలకయు దానిపై మెత్తలును పెట్టించుకొనెను. ఆ మెత్తలమీద సూటిగా నడుచుటకు సుశిక్షితమైన గజమెంతటిదైనను నడిపింపుడనెను. దేవరాయలది ప్రాణాంతకమగునని అనుమతించుటకుముందు వెనుకాడెను. అడుగు ప్రక్కకుతప్పనిచో ప్రమాదము రాదని పర్వతమల్లు ప్రతిజ్ఞ చేసినమీదట చిన్న గజమును పోనిచ్చుటకు రాయలు సమ్మతించెను. రాయల గజశిక్షకుడు ముందొక చిన్న గజమును నడిపించెను. ప్రమాదము రాలేదు. రెండవసారి అంతకంటె పెద్దగజమును నడిపించెను. పర్వతమల్లు చెక్కు చెదరలేదు. మూడవమారు మహాగజమును తెచ్చిచూపగా పర్వతమల్లు నడిపింపుమనెను. చూచువారికి కన్నులుతిరిగెను. అప్పుడు రాయల రాజదూత ప్రభుశాసన మీరీతి ప్రకటించెను:

"ఈ మహాగజమును గూడ దూదిపింజవలె ఈ మల్లుడు భరింపగలడు. ప్రేక్షకులకు మూర్ఛ రాగలదు గనుక దీనిని రాయలవారు నిషేధించుచున్నారు—పర్వతమల్లు నేడు చూపిన శక్తిప్రదర్శనములతో సమానముగా మరి ఎవరైన ప్రదర్శింపగలవారున్నారా?"

ఎవ్వరు ముందుకు రాలేదు. దేవరాయలు పరమానందభరితుడై పర్వతమల్లు నగ్గించి, 'అప్రతిమల్లమల్లశేఖర' అను బిరుదమునసభాముఖమున ప్రకటించి, పట్టపత్రికలు ఆ మరునాడే ప్రసాదింతుమని తెలిపి పుష్కలదన మొసగి పంబావించెను. (సశేషం)



పద్మశ్రీ పిక్చర్స్ 'సిరిసంపదలు'లో చలం.

సినీ విహారం

13వ పేజీ తరువాయి

కొత్త కథను ఎన్నుకోవడంలోని సెన్సార్ అవరోధాలను ఎదుర్కోలేక ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారు ఒక కథను తుంగలో తొక్కి మరొక మంచి కథను ఎన్నుకుని నిర్మాణరంగంలోకి దిగారు. ఈ చిత్రంలో తారగణం, సాంకేతికబృందం "భార్యా భర్తలు" యూనిట్టే! ఒక కామెరామన్ విన్సెంట్ "ఇల్లరికం" యూనిట్‌లో వ్యక్తి ఈ కొత్త చిత్రానికి తిరిగి నియమింపబడ్డాడు. కొండేపూడి లక్ష్మీనారాయణ మాటలు వ్రాశాడు. దర్శకుడు ప్రత్యగాత్మ. సంగీతం : ఎస్. రాజేశ్వరరావు. నాగేశ్వరరావు, కృష్ణకుమారి ఈ చిత్రంలో హీరో హీరోయిన్లు. ఈ నెలలో షూటింగ్ ప్రారంభమై జులై నెలలో పూర్తవుతుంది. ఆగస్టు మొదటి రెండు వారాల్లో మీకీ కొత్త చిత్రాన్ని చూపే సదవకాశం కలుగుతుంది. ఐదు నెలల గడువులో చిత్రం షూటింగ్ పూర్తిచేయటానికి సర్వసన్నాహాలనూ పూర్తిచేసిన వివరాలు నిర్మాతనుంచి తెలుసుకుని మా అభినందనలు అందజేశాము. గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం, సూర్యకాంతం, సంధ్య నటిస్తున్నారని, కొసరాజు, శ్రీశ్రీ లే కాక కొత్త కవులు నారాయణరెడ్డి, దాశరథి పాటలు వ్రాస్తున్నారని కూడా ఆయన తెలియజేశారు.

"నీసావాసం కచ్చి"

ఒక ఏడాదిక్రితం ఎనిమిది రీళ్ళ చిత్రం తయారైనపిదప సాంకేతికబృందం కలసికట్టుగా నవశక్తిగా తయారు చేస్తున్న రెండవ చిత్రం షూటింగ్ ఆగి, తిరిగి ప్రారంభమైనదన్న వార్త వినగానే విజయ వాహినీ స్టూడియోకి వెళ్ళాను. ఈ చిత్రాన్ని ప్రేక్షకలోకానికి మే నెలలో సమర్పిస్తున్నామనే శుభవార్తను ముందుగా నిర్మాత జయదేవ్ అందించాడు.

61—వ పేజీ చూడండి

"గాలిమేడలు"

"మానవుడు ఆశాజీవి" అన్నారెవరో. 'ఆశాదీపం ధరించి నేడు,' ఏదో చేసేస్తానన్నాడో సినీ కవి. ఆశ దీపంలాంటిది. దీపం తన వెలుగులతో చీకట్లను తొలగించి లోకానికి మార్గ దర్శకమైనట్లే ఆశకూడా మానవుడిలో నిరాశ నిస్పృహలను దూరంచేసి, నిత్య నూతన చైతన్యంతో ముందుకు సాగిపోవటానికి హేతువవుతుంది. వచ్చే చిక్కల్లా ఒక్కటే. జ్యోతి ప్రదీప్తమైనకొద్దీ మార్గం మరింత విస్పష్టంగా కన్పిస్తుంది. కానీ, ఈ అధికాశాజ్యోతిని వెలిగిస్తే దూరాలోచనలుపోయి దురాలోచనా, శాంతికిబదులు క్రాంతి కలిగి అధఃపతనానికి హేతువవుతుంది. మానవుడి పేక మేడలు గాలికి కూలిపోతాయి. ఈ ఉద్దేశ్యాన్ని నిరూపించేందుకు భారీ తారాగణంతో చదునైన పదునైన హాస్యంతో పద్మినీ పిక్చర్సు వారు నిర్మించిన "గాలిమేడలు"ను ఇటీవల విడుదలకు పూర్వం ప్రత్యేకంగా ప్రదర్శించారు.

క్షయవ్యాధితో బాధపడుతున్న రంగనాథం (నాగయ్య) అనే ఆసామీ వైద్యానికి పరస్థలంపోతూ ఎందుకైనా మంచిదని తనకొడుకును కొంత ఆస్తితోసహా, పానకాలస్వామి (రంగారావు) అనే మిత్రుడి చేతులో పెట్టివెళ్తాడు. పానకాలస్వామి తన భార్య శాంతమ్మ (యం. వి. రాజమ్మ)తో బయల్దేరి వైజాగ్ ప్రాంతం చేరుకుంటాడు. స్వంత సేద్యం ప్రారంభిస్తాడు. రంగనాధంకొడుకు కృష్ణుడనే పేరుతో పెరుగుతూంటాడు.

రంగనాథం ఆస్తితో పానకాలస్వామి తన కుమారుడు మోహన్‌కు (జగ్గయ్య) డాక్టరీ చెప్పిస్తాడు. హక్కుదారు కృష్ణుడు (యన్. టి. రామారావు) మాత్రంఆవుపేడ ఎత్తివేసుకుంటూ గడుపుతూ తోటిరైతు నాగన్న (విశ్వనాథం)కుమార్తె లక్ష్మి (దేవిక)ని ప్రేమిస్తాడు. లక్ష్మిని మోహన్ (జగ్గయ్య)కు వివాహం చేద్దామని సంకల్పించిన పానకాలస్వామి కృష్ణుడిని వెళ్ళగొడ్తాడు. ఈలోగా బోలెడంత కథ—మోహన్, కనపడ్డ అమ్మాయినల్లా "లాంట్రబెట్టా"గా భావించే ఓ 'ప్లాట్‌ఫారం' (రమణారెడ్డి) సాయంతో జమీన్‌దార్ సింహాచలం (రాజనాల)గారి అమ్మాయి నిర్మల, ఉరఫ్ నిమ్మి (జయంతి ఉరఫ్ కమలకుమారి) నిప్రేమించటం, వళ్ళు బాగై తిరిగి వచ్చిన రంగనాథం కొడుకుకోసం కొన్ని రీళ్ళు పూళ్ళు తిరిగి కోటీశ్వరుడై కోట్లేసుకురావటంలాంటివి—గూడ్సింజన్‌తో పరిగెత్తే ఎక్స్‌ప్రెస్‌లాగా జరిగిపోతుంది. కృష్ణుణ్ణే వెతుక్కుంటూ లక్ష్మి హైదరాబాద్ చేరుకుంటుంది. కృష్ణుడు రంగనాథంగారి ఇంట్లో ఆశ్రయం సంపాదించుకుంటాడు.

జమిందారు సింహాచలం తన అల్లుడు భాగ్యవంతుడు కాదని, పానకాలస్వామి కుమారుడని తెలుసుకొని అవమానిస్తాడు. వియ్యాలవారి తయ్యారాలకు తూగాలనే ఉద్దేశ్యంతో అస్తాంతా అమ్మేసిన పానకాలస్వామి గాలిమేడలు కూలిపోగా బూట్‌పాలిష్ చేసుకు బ్రతకవలసి వస్తుంది. రంగనాధంగారి అనాధాశ్రమ నిర్మాణంలో కూలిమనిషి గావచ్చిన శాంతమ్మను గుర్తించి కృష్ణుడు తన ఇంటికి తీసుకుపోతాడు. కృష్ణుణ్ణి వెదుక్కుంటూ లక్ష్మి ప్లాట్‌ఫారం, కనకరు పంచజేరుతుంది. పానకాలస్వామికూడా లక్ష్మివద్దకు వెళ్తాడు. రంగనాధం కొడుకును తానే అని మోహన్ వంచించ ప్రయత్నించగా కృష్ణుడు పానకాలస్వామి ప్రభృతులు రావటం, కృష్ణుడే తన కుమారుడని రంగనాధంగారికి తెలియగా మోహన్ క్షమాపణలు. ఆ తరువాత 'లక్ష్మీకృష్ణుల కళ్యాణ వైభోగమే.'

'పిచ్చిపుల్లయ్య,' 'కిష్టయ్య'గా ఎన్. టి. రామారావు నటన మళ్ళీ ఒకసారి చూద్దామనిపించేలావుంది. 'ప్లాట్‌ఫారం' కళ్ళకు'లాంట్రబెట్టా'లా కనిపించే లక్ష్మిగా దేవిక నటనా, ఆకారమూ, ఉచ్చారణతో కలిపితే "డబుల్ స్ట్రాంగ్, సింగిల్ ఛా" గా వుంది. వెర్రిబాగుల సింహాచలయ్య — సారీ—సింహాచలయ్యగా రాజనాల నటన కొత్త పద్ధతిలోవుంది. ఇంక రంగారావూ, యం. వి. రాజమ్మ, రమాదేవి, నాగయ్య, తమ నటనలు పునాదిగావేసిన 'గాలి మేడలకు' జయంతి (కమలకుమారి— జగదేకవీరుడుకథ ఫేమ్) ప్రత్యేక అలంకరణ.

సంభాషణలు గూడా పేరుకుతగ్గ స్థాయిని పడిచాయి. అందుకే కవి (డి. వి. నరసరాజు)గారి 'లాంట్రబెట్టా', గాలిలో తేలిపోతూ రావటాలుం హద్దు వదిలి పుట్‌పాత్‌లా ప్లాట్‌ఫారాయా రిఫార్మ్ చేసిందనుకోవాలి.వాస్తవికతకు ఎంతదగ్గరగావున్నా రచనలో కొంత నిగ్రహం చూపాల్సిన అవసరం ఎంతో కన్పిస్తోంది. సెన్సారు స్వారీ ఎక్కువవని మనం ఎంతగా అనుకున్నా ప్రయోజనం ఉండదు.

సూక్ష్మంగా చెప్పాలంటే ఈ చిత్రం ప్రేక్షక హృదయమానంగావుంది. కథ ఏకంచికిపోతే మనకేమనుకుంటే చాలు, ఈ సంతలో అన్నీ దొరుకుతాయి. సంగీతం కావాలనుకున్నవారికి పాత బాణీలైనా పరవాలేదనిపించే సంగీతం, హాస్యం కావాలనుకున్నవారికి సూటిగా హృదయానికి తగిలి రగిలించే 'ప్లాట్‌ఫారం' హాస్యం, సినీ మార్కు శృంగారం వగైరాలన్నీ గైర్ హాజరు కాకుండావున్న యిందులో కృష్ణుడు, శాంతమ్మల పాత్రలు కాస్త కరుణ కూడ కల్గిస్తాయి.కాదుకూడదు'ఏడ్వనీ నన్ను'అన్న వాళ్ళసంగతంటారా—ఏంజేస్తాం. వాళ్ళకర్మ—కథ సంగతాలో చించమనండి. ఏడుపు రాకపోతే రెండు మూడు తెలుగు సినిమాలు ఒకేసారి చూచినంత ఒట్టు! ★

'నాగరాజ్'

ఆంధ్రస చిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి



సినీ విహారం

కామెరాముందు సుబ్బయ్య ఇల్లు, అంతర్భాగం. హావడిలోని కుర్చీల దగ్గర విమల ఒక అబ్బాయి రాకకు విస్మయాన్ని ప్రదర్శిస్తూ నిలబడి ఉంది.

"విమలా! బాగున్నావా?" అని ఆ అబ్బాయి పలకరించగానే "అమ్మయ్య! ఇదీ కొంతవరకూ మెరుగే! నే కొకర్తెనున్నాననీ, నాపేరు విమల అనీ తమరింకా మరచిపోలేదు" అని ఆమె అతన్ని ప్రేమ అనే పంచదార కలిపి వెక్కిరించింది.

"పనుల తొందరమీద రాలేకపోయాను. విమలా! నాన్న ఎక్కడ?" అని అమాయకంగా అతని సముదాయింపునీ, అతని చివరి ప్రశ్నతో తోసి పారేసి, "అయితే ఇప్పుడేనా నాన్నకోసం వచ్చావన్నమాట" అంటూ దెప్పి పొడుస్తూ, "వెళ్లు వెళ్లు" నీ సావాసం కచ్చి......కా......కా......" అని కన్నె మనసు కోపాన్ని ఆరాటాన్నీ, స్వార్థాన్నీ అబ్బాయిమీద ప్రయోగిస్తూండగా కూతురు వరుసకు మందహాసం చేస్తూ, తండ్రి సుబ్బయ్య అక్కడకు వస్తూండగానే అమ్మాయి తుర్రుమని ఇంట్లోకి పారిపోయింది.

"రా రాజా! కూర్చో—" అని సుబ్బయ్య ఆప్యాయంగా అబ్బాయిని కూర్చోబెట్టి "వ్యాపారం ఎలా వుంది?" అని కుశల ప్రశ్న వేశాడు.

"నీకు తెలియందేముంది మామా!" అని దిగులుతోనే జవాబిచ్చాడు రాజా.

"తెలుసు.....తెలుసు......తెలిసే —ఉండబట్టలేక అన్ని విషయాలు ముఖాముఖీగా మాట్లాడదామని రమ్మనమన్నాను" అని మొసలి కన్నీళ్లు కార్చనున్నట్లు సూచించే ధోరణిలో జవాబిచ్చాడు. సుబ్బయ్య.

ఈ సన్నివేశం నవశక్తి పిక్చర్స్ రెండవ చిత్రంలోనిది. రాజాగా నాగేశ్వరరావు, విమలగా కృష్ణకుమారి, సుబ్బయ్యగా మిక్కిలినేని నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు రామినీడు. కామెరా ఎస్. కె. రాజు. కథ మద్గుల్కర్. మాటలు గోపీచంద్. కళ: శేఖర్. సంగీతం: అశ్వత్థామ. ఈచిత్రంలో గుమ్మడి, జి. వరలక్ష్మి, రమణారెడ్డి, పద్మనాభం, సి. ఎస్. ఆర్. సురభి బాలసరస్వతి, ప్రభాకరరెడ్డి నటిస్తున్నారు.

భూపతి దబాయింపు

ఆ గుండమ్మ ఇంట్లోకి ఆ రౌడీ భూపతికి ప్రవేశం ఎలా దొరికిందోననిపించింది. గుండమ్మకి సలహాదారుడైన గంటయ్యకు సుపుత్రుడు భూపతి. ఇంక అతనికి అడ్డేముంది? ఆ క్షణంలో అతడు తిన్నగా గుండమ్మ భవనంలోకి చొరబడి తాను బెదిరించగల జీవిని ఎన్నుకుని ఆమె దగ్గరికే వచ్చాడు. ఆమె పేరు దుర్గమ్మ. ఆమె గుండమ్మ కోడలికి మేనత్త. గుండమ్మ ఇంట్లో తిష్టవేసిన రాకాసి.

భూపతి జోరుగావచ్చి దుర్గమ్మనుకోర చూపు లతోనే నమిలివేస్తూ, "ఏయ్! నీపెట్టె తీసుకురా! డబ్బు కావాలి?" అని శాసించాడు.


"డబ్బా? నాదగ్గ రెక్కడుంది?" అని నంగనాచిలా కబుర్లు చెప్పింది దుర్గమ్మ.

"గుండత్త నాకంతా చెప్పిందిలే......తీసుకురా!" అంటూ కంఠస్వరం శృతిని పెంచటంతోబాటు చాకులాంటి బాకును చూపించాడు భూపతి.

దుర్గమ్మ దిగజారిపోయింది. "అబ్బే! తీసుకో బాబూ! నీ కంటేనా!" అని కాళ్ల బేరానికివచ్చి ఆ రౌడీకి ఒక టెనర్ (పదిరూపాయల కాగితం ముక్క) అందివ్వబోయింది మహద్భాగ్యంగా. దానిని భూపతి చీపురుపుల్లలా తోసేస్తూ, "పది చాలదు......వంద కావాలి" అని హుకుం జారీ చేశాడు.

"వందా! తెస్తాను" అని దుర్గమ్మ భద్రంగా ఇంట్లోకి వెళ్లింది.

ఈ సన్నివేశం విజయావారి కొత్త చిత్రం "గుండమ్మకథ"లోనిది. భూపతిగా రాజనాల, దుర్గమ్మగా ఛాయాదేవి నటించారు. ఈ చిత్రానికి నిర్మాతలు నాగిరెడ్డి అండ్ చక్రపాణి. కథకుడు : చక్రపాణి దర్శకుడు : కె. కామేశ్వరరావు. మాటలు : డి. వి. నరస రాజు. కామెరా: మార్కస్ బార్ట్లే, సౌండ్: శివరామ్. కళ గోఖలే అండ్ కళాధర్. ఈ చిత్రంలో నాగేశ్వరరావు, రామారావు, సావిత్రి, జమున, రంగారావు, సూర్యకాంతం, రమణారెడ్డి, విజయలక్ష్మి, హరనాథ్, మిక్కిలినేని, బాలకృష్ణ, వై. వి. రాజు నటిస్తున్నారు. ★



నేషనల్ - ఎక్కో రేడియో అండ్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ టెక్నికల్ మేనేజర్ శ్రీ హెచ్. ఎం. భట్‌నగర్‌ను సన్మానించే నిమిత్తం కంపెనీ అధ్యక్షుడు శ్రీ ఎ. డి. ష్రాఫ్ అధ్యక్షతన ఫ్యాక్టరీఆవరణలో ఇటీవల సభ జరిగింది. శ్రీ భట్‌నగర్ కొత్త రకం రేడియో సర్క్యూట్ కనిపెట్టి, చౌకగా రేడియో పెట్టె తయారుచేసేందుకు తోడ్పడ్డారు.

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!

మనమూ మనరాష్ట్రం

11-వ పేజీ తరువాయి

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్న విషయం. అన్ని పార్టీలలోకి కొంచెం మెరుగ్గా కనిపిస్తున్నది కమ్యూనిస్టుపార్టీ. అయితే తమ స్థితి కొంత బాగవుతుందని తప్ప, ఇన్ని స్థానాలు వస్తాయని ఉజ్జాయింపుగానైనా వారు చెప్పడంలేదు. కారణం 55 లో 169 స్థానాలకు పోటీ చేసి 100 స్థానాలకు పైనే లభిస్తాయని ప్రగల్భాలు పలికి తీరా 15 స్థానాలు మాత్రం రావడంతో తలవంపులైంది. అందుకని ఈసారి జాగ్రత్త పడ్డారు. ఈ పార్టీకి ప్రస్తుత శాసన సభలో 35 స్థానా లున్నవి. ఇవికాక ఇంకో. 20 స్థానాలైనా అధమం రావచ్చుని విషయజ్ఞుల అంచనా. తెలంగాణాలో నల్గొండ, ఖమ్మం మొదలైన కమ్యూనిస్టు కంచుకోటలలోపాగా వేయలేకపోయామని కాంగ్రెస్‌వారే అంగీకరిస్తున్నారు వరంగల్ జిల్లాలో కూడా కాంగ్రెస్ ముఠా తగవుల వల్ల కమ్యూనిస్టులది పైచేయి కావచ్చు. బలం ఉన్న కరీంనగర్,ఖమ్మం, వరంగల్, నల్గొండజిల్లాల్లో కమ్యూనిస్టులు 36 స్థానాలకు (మొత్తం తెలంగాణాలో 50) పోటీ చేస్తున్నారు. అధమం 20 స్థానాలు రావచ్చుని అంచనా. ఇక ఆంధ్ర ప్రాంతంలో ఈ పార్టీ 70 స్థానాలకు పోటీ చేస్తున్నది. ఉభయ విశాఖలలో రెండు మూడు ఉభయ గోదావరులలో ఏడెనిమిది, కృష్ణా, గుంటూరులలో పదిహేనూ వరకూ, నెల్లూరులో నాలుగు చేజిక్కించుకోవచ్చునని, రాయలసీమలో పోటీచేస్తున్న 15 సీట్లకు కడపలో ఒకటి అనంతపురంలో రెండు రావచ్చుని అనుకొంటున్నారు. (ఇదివరకూ రాయలసీమలో ఒక్కటికూడా రాలేదు) ఈవిధంగా సుమారు 60 స్థానాల వరకూ వారి వశమైతే ఆశ్చర్యపడవలసిన దేమీలేదు.

స్వతంత్రపార్టీవారు తమకు 50 స్థానాలు ఖాయమని ఆశిస్తున్నారు. వీరు అధికారం చేపట్టగలమన్నకున్న మూడు రాష్ట్రాలలో ఆంధ్ర ఒకటి. అధికారం సంగేతేమోకాని నిలబెట్టిన అభ్యర్థులలో గెల్చేవారు. వారి అంచనా ప్రకారమే మూడోవంతుకు దిగజారారు ఈ పార్టీ సర్కార్ జిల్లాలలో 89, రాయలసీమలో 27, తెలంగాణాలో 23 మందిని నిలబెట్టింది. తెలంగాణాలో ఈ పార్టీ గెలిచే స్థానాలు ఆట్టేలేవని, రాయలసీమలో కూడా రెండు మూడు కన్నా ఎక్కువ రావని పరిశీలకుల భావం. పోతే వీరు ఆశించే స్థానాలు సర్కారు జిల్లాలలోనే రావాలి. వీరికి బలంగల మూడు జిల్లాలలో శ్రీకాకుళం, గుంటూరు, చిత్తూరు కొంతవరకు నెల్లూరు వీటిని సాధించాలి. ఉభయ విశాఖలలో 10, ఉభయ గోదావరులలో నాలుగు, కృష్ణా, గుంటూరులలో 12 చిత్తూరులో 2, నెల్లూరు తతిమ్మా జిల్లాల్లో ఆరు ఏ రకంగా లెక్కవేసినా 30 స్థానాలకన్న ఎక్కువ లభించే సూచన కన్పించడంలేదు.

ప్రజాపార్టీ విషయం. ఆపార్టీ అధ్యక్షుడు శ్రీ విశ్వనాథంగారి గెలుపు ఖాయమని, కాంగ్రెస్ నాయకులే అంగీకరిస్తున్నారు గనుక సందేహించే పనిలేదు. పోతే ఆయన నిలబెట్టిన 10 మంది అభ్యర్థులలో ఎందరు నెగ్గుతున్నారన్నదే ప్రశ్న. గెలిచేవారి సంఖ్య మూడు మొదలు 8 దాకా వేస్తున్నారు. మిగతా చిల్లర పార్టీల విషయం ఎవరూ ఎలాంటి అంచనాలు వేయడం లేదు. కాని వాళ్లలో ముఖ్యంగా స్వతంత్రులలో గెలిచేవారి సంఖ్య ఎక్కువే ఉంటుందనుకోవచ్చు.

ఇక కాంగ్రెస్‌పార్టీ సంగతేమిటి? కాంగ్రెస్ గెల్తుందికాని మెజారిటీ ఎక్కువ రాదన్న సంగతి ఎన్నికలముందే తేలిపోయింది. ఆ వచ్చే స్థానాలెన్ని అన్నదే రకరకాలుగా ఉంది. మంత్రి పట్టాభి రామారావు నూటికి 80 స్థానాలు (అంటే 240) వస్తాయని అంచనా వేయగా, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పళ్లంరాజుగారు నూటికి 75 స్థానాలు వస్తాయంటున్నారు. ఇవి ప్రచారంలో చెప్పిన మాటలు గనుక విలువలేదు. నిష్పాక్షికంగా అంచనావేసే కాంగ్రెస్ నాయకులు మొత్తం 180—200 కన్నా ఎక్కువ రావన్నారు. ఇప్పుడీ అంకె 180—200 నుంచి 150—160 కి దిగజారింది.

కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం శాసనసభలో 240 స్థానాలవరకూ ఉన్నవి. 55 ఎన్నికలలో ఐక్య సంఘటనలో ప్రధాన భాగస్వామిగా 119 స్థానాలు గెల్చుకున్నది. 57 ఎన్నికలలో తెలంగాణాలో 68 స్థానాలు గెల్చుకుంది. సంస్థ నెదిరించి నెగ్గిన తిరుగుబాటు కాంగ్రెస్‌వాదులు సోషలిస్టుపార్టీ సభ్యులు ప్రజాసోషలిస్టులు మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరడం వల్ల శాసనసభలో కాంగ్రెస్‌బలం తిరుగులేనిదైంది. ఇప్పుడా పరిస్థితి మారిపోయి ప్రభుత్వం ఉనికి అస్త వ్యస్తమయ్యే ప్రమాదం గోచరిస్తోంది. ఆనాదినుంచి కాంగ్రెస్‌కు అండగాఉన్న రాయలసీమ జిల్లాలలో కూడా కాంగ్రెస్‌కు లాభం లేదని 55 ఎన్నికలలో 46 (మొత్తంసీట్లు 57) రాగా'' ఈసారి 25 లేక 30 కన్న ఎక్కువరావని చెబుతున్నారు. వెనుక అన్ని స్థానాలు గెల్చుకున్న అనంతపురం జిల్లాలో కూడా స్వతంత్ర అభ్యర్థుల రద్దీ వల్ల, పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. ఇక తెలంగాణాలో పూర్వం గెల్చుకున్న 68 స్థానాలు నిలబెట్టుకోలేదని 50 లేక 55 కన్నా ఎక్కువ లభించవని చెబుతున్నారు. ఇక మిగిలినవి సర్కార్ జిల్లాలో. 55 ఎన్నికలలో నెల్లూరు సహా మొత్తం ఈ 7 జిల్లాలో కాంగ్రెసుకు 72 స్థానాలు వచ్చాయి ఇప్పుడు ఆ అన్నిస్థానాలు వచ్చినా (రాయలసీమ తెలంగాణాలలో వచ్చిన మార్పు వల్ల) లాభంలేదు. లోగడ కాంగ్రెస్‌లో చేరిన స్వతంత్రుల స్థానాలు కాంగ్రెస్‌వే అని లెక్కవేసినా, కాంగ్రెస్‌ను ఎదిరించి స్వతంత్రులైనవారి మూలంగా కొన్ని స్థానాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కనుక సర్కార్లలో మొత్తం 137 సీట్లలో అదమం 90 స్థానాలైనా వస్తేగాని రాయలసీమ, తెలంగాణా జిల్లాలో వచ్చే నష్టాన్ని భర్తీచేసుకుని ఒకమాదిరి మెజారిటీ సాధించవీలులేదు. కాని సర్కార్ జిల్లాలో అది సాధ్యమా?

ఏమైనా వోటర్ల మనస్తత్వం ఎలా ఉంటుందో తెలియదు. ఈ అంచనాలు లెఖలుఅన్నీ తారుమారు కావచ్చు. పోలింగ్ పూర్తి అయి ఫలితాలు వెలువడిన తరువాత గాని కాంగ్రెస్‌ప్రభుత్వం సుస్థిరమో అస్థిరమా తేలదు. ★

హరివంశం

14-వ పేజీ తరువాయి

అంతరము. ఆ కుమారుడు నిజముగా నడవికిపోయెను. నేను నీకు జీవితమునే అడవిగా చేసివైచినాను....''

మహారాజు విచలితుడై విలపించెను. సుదక్షిణ మాటాడలేదు. తండ్రిని ఓదార్చలేదు. తలఎత్తి ఆయనవంక నొక్కసారి చూచి, తిరిగి తలను వంచుకొన్నది. మహారాజు మరల ఇట్లులనినాడు :


''తల్లీ! ఒక్క మాట మాటాడరాదా! నాకు శాంతికల్గును.''


''ఏమి మాట్లాడమందురు. ఎందులకు మిమ్ములను మీ రట్లు ఉపాలంభనము చేసికొందురు. నేను పౌండ్రకుని చిన్నప్పటినుండియు ప్రేమించితిని. ఈ శరీర[illegible]తనిది. దీనిని మీరు ఆయనకు ఎప్పుడో సమర్పించినారు. మరి నామనస్సు సంగతియా? నా ఆత్మసంగతియా! అవి నావి. నేను పౌండ్రకుని ప్రేమచేయుచున్నాననగా, అతనికోసము చేయుచున్నానా! నా కోసము చేయుచున్నాను. అతడును అట్లులనే. నా ఆత్మను నేను ప్రేమించుకొనుచున్నందు వలన పౌండ్రకునియందు నేను ప్రేమచేయుచున్నాను. ఒకవిధముగా మీరును అంతియే. అసలు విషయము ఇది. అందుల కింత ఆరాట మెందులకు!''


మహారాజు అప్రతిభుడై పోయెను.

''సుదక్షిణ! తల్లీ! నీవు సుదక్షిణవేనా! నన్ను కన్న తల్లివేనా! నా కడుపున పుట్టిన కుమార్తెవేనా! తల్లీ! తల్లీ! నీమాటలు వినుచుండగా నాకు మైత్రేయియు, యాజ్ఞవల్క్యుడును జ్ఞాపకమునకు వచ్చుచున్నారమ్మా! ఇక నాకు దుఃఖములేదు. నేను నిశ్చింతగా ఈ దేహమును వదలెదను. తల్లీ! ఒక్కసారి ఆచార్య సాందీపనిని మన మందిరములకు రమ్మని కబురు పంపు. ఆయన నాకు బాల్యమిత్రుడు. చూచి చాలకాలమైనది.''

సుదక్షిణ సరియేనన్నది. ★


ఐ టెక్స్
కా టు క
(ఆయుర్వేద శాస్త్ర
పద్ధతిన తయారైనది)
చంటిపిల్లలకుకూడా
వాడవచ్చును.
అరవింద్ లేబరేటరీస్,
పి. బి. 1415, మద్రాసు – 17.
హైదరాబాద్ మినహా ఆంధ్రప్రదేశ్ నకు
ఏజెంట్లు: ప్రగతి ఏజెన్సీస్, విజయవాడ–1.


అమ్మా, రాజా వాళ్ల అమ్మ మాకు ఏదో తమాషా రుచిగల దోసెలు పెట్టింది. నీవుకూడా దోసెలు అట్లాగే చేయకూడదా, అమ్మా!
నేను చేసిన వంట అంటేనే నా పిల్లలకు నచ్చటం లేదు. నేను వంట చేయటానికి తగనని పిస్తున్నది.
అది వంటకళ్ల అయి వుండదు, బహుశః, నీవు వాడే నూనెవల్ల కావచ్చు. ఇంకోసారి వండేటప్పుడు తుషార్ వనస్పతి వుపయోగించి చూడు.
మాలతి స్నేహితురాలి సలహా తీసుకున్న తర్వాత
ఇంత కమ్మటి దోసెలు నేను యింతకు ముందెప్పుడూ తినలేదు. నిజంగా నీవు వంటలో "అందెవేసిన చెయ్యి" వమ్మా!
రుచిగల వంటకాలు తయారు చేయటంలోని రహస్య మేమిటో మాలతికి తెలిసిపోయిందిప్పుడు అదే తుషార్, పుష్టికరమైన, రుచికరమైన వనస్పతి.
తుషార్
విటమినులు కలిగియున్న వనస్పతి
అర్హీకరించిన తుషార్ మార్కె


పార్టీ భేదాభిప్రాయాలుండినను సరే
శ్రేష్ఠమైన
మిఠాయిలు
ఎన్నుకొనే
శక్తి
వచ్చినప్పుడు
కుటుంబములో అందరి
ఓట్లు న్యూట్రైన్ కే
Nutrine
Sweets
న్యూట్రైన్ కన్‌ఫెక్షనరీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్.

మనమూ—మనదేహస్థితీ

15-వ పేజీ తరువాయి

ఇన్సులిన్ అనే పదార్థమును ఉత్పత్తి చేస్తావని చెప్పాను. బొగ్గులు ఉన్నా నిప్పు లేకుండా అవి కాలనట్లు ఇన్సులిన్ లేకుండా, ధాతువులు, గ్లూకోజును దహించే శక్తిని ఉత్పన్నం చేసుకోలేవు. ఈ ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గినప్పుడు మామూలుగా తీసుకున్నట్లుగా భోజనంలో పిండిపదార్థములు తీసుకొన్నప్పుడు, వాటినుండి తయారయిన గ్లూకోజు శరీరంలో దహింపబడక, రక్తంలో దాని పరిమాణం అత్యధికమై, మూత్రం ద్వారా అది బయటికి పోతుంది. ఆ స్థితిని మధుమేహము అంటారు ఆయుర్వేదంలో. మూత్రమును ఉత్పత్తిచేసే మూత్రాశయమునుండి మూత్ర ద్వారం చివర దాకా ఉన్న అవయవములను వ్యాధి గ్రస్తములు చేసే పరిస్థితిని 'మేహము' అంటారు. మధుమేహము, సహామేహము, శ్వేతమేహము, శుక్లమేహము ఇటువంటి మాటలు యిల్లా ఏర్పడ్డవే.

ఉదరంలో లివరుకు క్రిందుగా, ఉదర మధ్య రేఖకు, రెండు ప్రక్కలా, రెండు మూత్రాశయము లున్నవి. ఇవి జీడిగింజ ఆకారం కలవి. అందులో కుడివైపున ఉన్న మూత్రాశయము పై కొమ్ము లివరు క్రింది వైపుకు అంటి ఉంటుంది. ప్రతి మూత్రాశయం పైకొమ్ముమీద ఒక అనాళికా గ్రంధి (Ductless gland) ఉంది. దీని స్యందనం నాళం ద్వారా కాకుండా, సరాసరి రక్తంలోకి ప్రవేశిస్తుంది. దీనిని పూర్వం ఎడ్రినల్ గ్రంధి (Adrenal) అనేవారు. ఇప్పుడు ఎపినెఫ్రిన్ అంటారు. నెఫ్రోస్ (Nephros) అంటే గ్రీకు భాషలో మూత్రాశయము అని అర్థము. 'ఎపి' (Epi) అన్న ఉపసర్గకు 'పైన ఉన్న' అని అర్థము. మూత్రాశయముపైన ఉన్నందున దీనికి ఎపినెఫ్రాన్ అనే పేరు ఉన్నది. అల్లాగే "రీనా" (Rena) అంటే లేటిన్ భాషలో మూత్రాశయము అని అర్థము. "సూప్రా" అంటే 'మీద ఉన్న' అని అర్థము. ఆ కారణంచేత యీ గ్రంధికి సూప్రారీనల్ గ్రంధి అని వేరే పేరున్నది. దీని స్యందనమును 'ఎడ్రినలిన్' అనీ, 'ఎపినెఫ్రిన్' అనీ అంటారు. ఉబ్బసంతో బాధపడే వా రందరికీ 'ఎడ్రినలిన్' అనే ఔషధం సంగతి తెలిసే ఉంటుంది.

ఇన్సులిన్ లేకపోతే రక్తంలో ఉన్న గ్లూకోజును, జీవకణం తనలోకి తీసుకోలేదు. ఇన్సులిన్ తీసుకున్నప్పుడు రక్తంలో గ్లూకోజు అధికంగా ఉంటే, లివరులో గ్లయికోజన్ ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. రక్తంలో గ్లూకోజు తక్కువగా ఉంటే లివరులో ఉన్న గ్లయికోజన్ నిలవలు, గ్లూకోజుగా మారిపోతవి.

ఎడ్రినలిన్ (Adrenalin) ప్రభావం అల్లా కాదు. దీని ప్రభావం వల్ల నెత్తురులో గ్లూకోజు అధికమై లివర్‌లో గ్లయికోజన్ తగ్గిపోతూ ఉంటుంది. ★

బంగారు తండ్రి

8–వ పేజీ తరువాయి

లాడింది. ఆమె అటు చూసింది. అతను వస్తున్నాడు.

అతను నికార్సయిన పెద్దమనిషిలా ఆమెకేసి ఒక్కగా నొక్కసారి చూసి, తన రూముకు వెళ్ళిపోయాడు. కాత్యాయని చేతిలో ఉత్తరాలకేసి చూసుకుని 'హ్రే' అని నాలిక కరుచుకుంది.

"మ్వా—అతనే వస్తాడు ఉత్తరాలు కావలిస్తే" అం దామె మనస్సు. కాత్యాయని ఆ ఉత్తరాల్ని సావిట్లో టేబులుమీద పెట్టి కుర్చీలో కూర్చుని అతని రూము వైపు చూడసాగింది. ఓ రెండు నిముషాలు సాగేసరికల్లా ఆ రూముతలుపులు తెరుచుకున్నాయి. అతను ఇవతలకు వచ్చి, వీధి తలుపు గడియవేసి, ఇంటిగలవా రింటివైపు వచ్చాడు. కాత్యాయని అతన్ని చూడనట్లు పటేస్తూ ముఖం పేపరుచాటున వేసుకుంది.

"అమ్మడుగారూ" అన్నా డతను.

కాత్యాయని పేపరు టేబులుమీద పడేసి, ఇవతల కొచ్చి, "నా .... నాపేరు అమ్మడూ, ముక్కుతిమ్మడూ అని మీ కెవరు చెప్పారు ?" అంది — ఆ పేరు నచ్చక. అతను తల గోక్కున్నాడు. "అదీ దినపత్రికలో మీ పేరు అలా అని పడిందిలెండి. అందుకని పిల్చాను .... అసలు పేరు శలవివ్వండి" అన్నాడు తను నవ్వుతూ.

"కాత్యాయని" అందామె పైటచెంగు సవరిస్తూ.

"ఉమా, కాత్యాయనీ, గౌరి ...." అనుకున్నాడు అతను మనస్సులో. వెనువెంట ...' 'కాత్యాయని ... మంచిపేరు. చాలా బావుంది" అన్నాడు. ఆమె సిగ్గు అభినయించలేక, దగ్గిరగా ఉన్న స్తంభాన్ని పట్టుకుని ఊగిసలాడింది.

"చూడండి" అన్నా డతను.

"చూశాను" అం దామె.

"అది కాదు—పంచదార—కొంచెం కావాలి .... ఉంటే ఇస్తారూ .... కొంచెం" అన్నా డతను.

"లేకపోతే ?"

"ఫరవాలేదు .... మొహమాటపడకండి. డబ్బా దులిపితే కొంచవయినా వస్తుంది. చీమలున్నా ఫరవా లేదు....ఆ పంచదార—ఓ గ్లాసులో వేసి, ఏమనుకోకుండా ఆ గ్లాసులో కొంచెం నీళ్ళు పోసి ఇస్తారూ..." అన్నాడతను గుక్కతిప్పుకోకుండా. కాత్యాయని మారు మాట్లాడకుండా లోపలికెళ్ళి పంచదార నీళ్లతో గ్లాను పట్టుకొచ్చి అతనికి అందిస్తూ "ఎందుకండీ" అంది. అతను నవ్వాడు.

"మేహశాంతి — తరుణోపాయం" అన్నాడు అతను ఆ పానకం తాగుతూ. కాత్యాయని కా పదాల అర్థం తెలీలేదు. గ్లాను అందిస్తూ అతను నవ్వి, "వాటి అర్థం అడక్కండి. నాకూ తెలీదు. మా బామ్మ వారాని కోసారి అలా తాగమంది." అని చెప్పి వెళ్లిపోయాడు. కాత్యాయని చిన్నగా నవ్వుకుంటూ కుర్చీలో కూర్చుంది. టేబిలు మీద ఉత్తరాలు కనుపించాయి. "పోన్లే పాపమ్ని ఇచ్చి రావోయ్ !" అం దామె మనస్సు. కాత్యాయని వాటిని చేతొత్తి పుచ్చుకుని, అతని రూము

వైపు వెళ్ళి, వేసున్న తలుపును తట్టింది. నెమాళానంగా తలుపులు తెరుచుకున్నాయి. గది మధ్యలో చాపమీద కూర్చుని రేడియో తయారుచేస్తున్న అతను గమ్మున లేచి, తలకి తగిలించుకున్నది లాగి పారేసి, "రండి, రండి, అలా కూర్చోండి" అన్నాడు. ఆమె కుర్చీలో కూర్చుంది.

"చూద్దామని వచ్చారా" అన్నాడు తను నవ్వుతూ.

కాత్యాయిని, చిరునవ్వును దాచుకుంటూ, "లే... లేదండి. ఉత్తరాలు వచ్చాయి. ఇవిగో ...." అంటూ వాటిని అతనికి అందిచ్చింది. అతను అంది పుచ్చుకుని చదువుకున్నాడు.

"రేడియో చేస్తున్నా రనుకుంటాను" అం దామె. అతను నవ్వేసి "మరే .... ఆహా .... ప్చ్. ఏదో .... హాబీలెండి, వింటారా .... పాట వస్తోంది" అంటూ తన తల నున్నది తీశాడు. కాత్యాయిని ఆ వస్తువు కేసి భయంగా చూస్తూ, "పాట వినాలంటే అది నెత్తిన పెట్టుకోవా లేప్పి ?" అంది. అతను మరోసారి నవ్వి "భయపడకండి, దీన్ని హెడ్ ఫోన్ అంటారు. ఇలా తలకు పెట్టుకోడవే" అంటూ లేచాడు. కాత్యాయిని తత్తరపడుతూ, "ఎబ్బే ఇలా ఇవ్వండి. నేను పెట్టుకుంటాను" అంది. దాన్ని అతను ఆమెకు అందించి, మరోసారి రేడియో అమరికను సరిచేశాడు. ఓ రెండుంపావు నిముషాలు గడిచాయి.

"వినబడుతోందా ?" అన్నా డతను.

కాత్యాయిని నవ్వుతూ "బడుతోందిగానీ, ఇదిల్లా నెత్తినపెట్టుకునే, వినాలా, మీ రేడియో" అంది. అతనుకూడా ఆ నవ్వుకు వంతపాడుతూ "ఎబ్బేలేదు—లేదు—లేపటెల్లుండి దీని ఖ్యాతి మించు తుంది" అన్నాడు.

"మించి— రా గా న్ల పడుతుందన్నమాట" అం దామె నవ్వుతూ.

పాట అయిపోంగానే కాత్యాయిని "రేడియో" అతనికి ఇచ్చేస్తూ, "నా పేరు అడిగి తెలుసు కున్నారు గానీ ...." అంది. "హో" అన్నా డతను నవ్వుకి నాందిగా.

"నాపేరు చి. ఎన్. ప్రసాదరావు."

"యన్నంటే ?"

అతను చెప్పాడు.

"చీ అంటే ?"

"చిరంజీవి లెండి. చాలాకాలం బతకాలని ఊహ. అందుకు ఆపేరు తగిలించుకున్నాను." అన్నా డతను చొక్కా కాలరు సర్దుకుంటూ. కాత్యాయిని నవ్వు నాపుకోడానికి ప్రయత్నించి ఓడిపోయింది. ఆనక తల గోక్కుంటూ, "మీ పేరు ఎక్కడో విన్నట్టు గుర్తుంది" అంది. ప్రసాదరావు మడిచేసిన కాలరు నిలపెట్టి, సరిచేశాడు. "ఓహో ! కథలు చదివే వాళ్ళందరూ నా పే రు వినిఉండాల్సిందే" అన్నాడు. ఆమె పైటచెంగు చూపుడువేలుకి చుట్టింది.

"అదీ. మీ కథలన్నీ చదువుతాను సుమండి" అంది నవ్వుతూ. ప్రసాదరావులో హుషారు ఎక్కువయ్యి, లేచి నించుని, మళ్ళీ కూర్చుంటూ "ఎలా ఉంటాయి మీకు?" అన్నాడు.

"ఏడిసినట్టుంటాయి !"

"ఆ ...." అన్నా డతను నీళ్ళు కారుతూ.

"అయినా వాటిలో ఓ విశేషం ఉంది."

"ఏవ్వది ? వినబడలేదా ?"

"ఎబ్బే"—అంటూ ఆమె కిలకిలా నవ్వింది. అతనూ తన నవ్వుని కలిపాడు. ఇంతలో "అమ్మడూ" అన్న కేక వీధి తలుపు కుదిపింది. "వచ్చే, వచ్చే" అంటూ కాత్యాయిని రివ్వున పరుగెత్తింది.

* * *

ముందుగదిలో కూర్చుని, పాత పత్రికలన్నీ మేటుగా వేసుకుని, అతని రచనల న్నీ చింపి, పొగుగా పోసి, ఆనక పుస్తకంగా కుట్టి, ఒళ్ళో పెట్టుకుని, నవ్వి, నవ్వుకుని, జడ ముందుకు వేసుకుని, గిరగి రాడించింది. వెనువెంట "హ్రే— తలలో సంపంగి లే" దనుకుంది. "ఎక్కడ— పోయిందీ, ఒహవేళ అతని రూములో పడిందేమో! ఏమో ! అమ్మో" అనుకుంటూ గది దాటి అరుగు మీదకొచ్చి అతని రూమువంక చూసింది. ఆ రూము కిటికీలోంచి అతని చెయ్యీ, చేతిలో పువ్వూ కనుపించాయి. వెంటనే మాయమయ్యాయి. ప్రసాదరావు రివ్వున పువ్వుతోసహా వచ్చి, గది ఇవతల నించున్నాడు. "నా సంపెంగిపువ్వు — నా కిచ్చెయ్యండి" అన్నట్టు ఆమె అతనికేసి చూసింది. అతను ఆ పువ్వులోంచి ఓ రేకు తుంపి, కళ్ళ నద్దుకుని క్రాపులో పెట్టుకుని, పువ్వు తిరిగి ఆమెకు ఇచ్చేసి, రూములోకి వెళ్ళిపోయాడు.

"హమ్మ పిల్లాడా ! బంగారు తండ్రీవీ, బాబాలి కొండవీ అనుకున్నాను—గడుగ్గాయివన్నమాట" అనుకుం దామె ముక్కుమీద వేలేసుకుంటూ.

* * *

బంగారు తండ్రి

ఆ మర్నాడు అతను లేచేవేళకన్నా ముందు లేచి, వేపపుల్ల నోట్లో పెట్టుకుని కూర్చుంది ఆమె. ఓ రెండు మూడు నిముషాలు పోయాక అతని తలుపులు తెరుచుకున్నాయి. ఆమెకళ్ళు గిరగిర లాడాయి. అంతకంటె ముందు "అమ్మడూ" అన్న కేక వినిపించింది. 'ఎవరా అమ్మడూ' అని విసుక్కుంటూ ఆమె ప్రక్కకి చూసింది. పక్కింటి బామ్మగారు తివ్వన వచ్చి, "అమ్మడూ, రాత్రనగా మెడనరం పట్టింది. కాస్త మంత్రం వేసిపెడుదూ —చచ్చి నీకడుపున పుడతా .... హబ్బ—ఏం, జానకమ్మా, ఏంచేస్తున్నావూ ...." అంటూ వంటింట్లోకి దూరింది. కాత్యాయిని కసిగా ఆవిడ కేసి చూసి, ముఖం కడుక్కుని, వచ్చి మంత్రం వేసి, ఆవిణ్ణి సాగనంపి, "హబ్బా! పాడు మంత్రం. మెడలోతు చన్నీళ్లల్లో నించుని నేరకపోయి నేర్చుకున్నా బాబూ," అని విసుక్కుంది. వంటింట్లో జానికమ్మగారి కా మాట వినపడి, "హయ్యో! పిల్లా— మంత్రాలూ, అవీ అదృష్టం వుంటే కానీ రావమ్మా—అలా అనకూడదు" అంది. 'కామోసు' అనుకుంది కాత్యాయిని, మూతివైపు చూస్తూ.

* * *

ఓ నాలుగు రోజులు గడిచాయో లేదో, ఐదోనాటి కల్లా అతను స్నానానికి రాలేదు. పాపుగంటసేపు చూస్తూ ఆలోచించినా, ఆమెకు కారణం అంతు పట్టలేదు. చాలాసార్లు బుర్ర గోక్కుంది. ప్చ్— చూపుడువేలు కొరుక్కుంది—ప్చ్ ప్చ్. ఆరోనాడు రివాజైన సమయానికి ఆమె అతనికోసం చూస్తుండేవేళ, "అమ్మడూ—పాపం" అంటూ జానకమ్మగారు కూతుర్ని సమీపించింది. "పాపం— అమ్మడూ ఏమిటి" అంది కాత్యాయిని అర్థంకాక. జానకమ్మగారు ఫక్కున నవ్వి, "అది కాదే .... పాపం .... ముందుగదిలో అబ్బాయి లేడూ .... అరే .... అలా చూస్తావేమిటి ? .... ఆ కుర్రాడికి మెడ యిరుకుపట్టిందట — నిన్నటల్లా మొండిగా తిరిగాడుట. రాత్రి సలపరంకూడా తగిలిందట. పాపం—కాస్త విసుక్కోకుండా మంత్రంవేసి పెడుదూ .... ఊ .... ఇదిగో అట్లకాడ .... నాకు అవతల ఎసరుకాగిపోతోంది ..... అతనలా వస్తున్నాడు" అనేసి, వంటింట్లోకి వెళ్ళిపోయింది. కాత్యాయిని గుండె వేగంగా కొట్టుకుంది. ఆనందంతో పెదిమలు వణకాయి. చేతిలో ఉన్న అట్లకాడకేసి చూసుకుంది. అది పూలమాలగా మారినట్లు కనుపించింది. ఇంతలో అలా వచ్చిన అతను ఆమెస్థితిని మార్చడానికి గట్టిగా దగ్గాడు. కాత్యాయిని సీతాదేవిలా—అతన్ని సమీపించింది. ప్రసాదరావు ఆమెచేతిలో అట్లకాడ కేసి చూస్తూ, "అది ఎందుకు" అన్నాడు. ఆమె నవ్వును దాచుకుంటూ, "మాట్లాడకూడదు. మెడ వంచండి" అంది.

"మెడమీద పొడవడానికా ? మా అమ్మా నాన్నలకు నే నొక్కణ్ణే కొడుకును. బహు కుటుంబీకుణ్ణి" అన్నా డతను. ఆమెకేసి 'చిలిపి' గా చూస్తూ,

"మీ పేరు ?"

"ఎందుకు ?"

"ఆడకూడదు. చెప్పారి. మంత్రం పట్టివ్వదు."

"అహా—ఫలావా"

"ఏం చదివారు"

"యుస్సెల్సి తప్పాను."

ఆశ్చర్యంతో ఆమె చేతిలో ఉన్నఅట్లకాడ అతని మెడ ముద్దుపెట్టుకుంది. "బ్రాబో" అన్నాడతను.

"ఉస్స్ ! అబద్ధం ఆడరాదు."

"నా కది హాబీ !"

"అయితే మంత్రం పట్టివ్వదు. రేపీపాటికి మెడ గమ్మున విరిగి ఊరుకుంటుంది."

"అహా !—అయితే మీ అట్లకాడతో— బీకావ్ అని చెప్పండి" అంటూ అతను తల వంచాడు. మంత్రం పూర్తయినతర్వాత "సాయంత్రం, రేపు ఉదయం—మొత్తం మూడు వమంత్రాలు—ఉల్ఫా కాదు. ఛార్జీ అవుతుంది." అందామె అట్లకాడ గిర్రున తిప్పుతూ.

"హబ్బో! ఛార్జివే. ఎంత, ఎప్పుడు, ఎవరికి కట్టాలి" అన్నా డతను నవ్వి, నవ్వబోయి, మెడ నొప్పివల్ల ఆగిపోతూ.

"నాకే కట్టాలి సమయంవచ్చినప్పుడు" అందామె అట్లకాడ పొట్లపొదుకైపు విసిరేస్తూ.

*　*　*

కీలకం కనిపెట్టిన రాజారావు, కాళ్ళూ, కీళ్ళూ, మెడ వారానికి ఓభాగం చొప్పున వంతులు వంతులుగా యిరుకుపట్టడం నేర్చుకున్నాయి. ముందు ముసాపుకల శరీరంమాత్రం పది పది హేనురోజుల కోసారి జబ్బుపడడం నేర్చుకుంది. స్వతహాగా పరోపకారి అయిన జానికమ్మగారు, అపన రానికి ఆదుకోడం చూసి, అతని కాళ్ళూ గట్రా మరీ విజృంభించాయి.

దశరథరామయ్యగారు ఈవిషయం క్రీగంట చూసి, చూసి, కన్ను నొప్పెట్టి, అసక తన పుస్తకాలకొట్టు ఓ నాల్రోజులు మూసేసి, తీరు బడిగా కూర్చుని మరీ చూశాడు. ఇక చ్పూడలేక, ఒకనాడు భార్యని కేకేసి కూకలేసేపద్ధతిలో "కానే జానీ, ఆ పిల్లాడికి ఇటీవల మరీ ఒళ్ళంతా యిరుకువట్టుతోందిటగా. ఏమ్టది. పోనీ పట్టిం దనుకో. నువ్వు అతనికి ఆ వెట్టి చాకిరీ ఏవిటే, పోనీ, చేశావయ్యా. నీ వెనకాల అమ్మడెందుకూ. ఆ... ఏవిటిది, నాకేం నచ్చలేదు !" అన్నాడు. జానకమ్మగారు ఫక్కున నవ్వి, ఆపైన చిన్నగా నవ్వి, దాని కారణం భర్తచెవులో చెప్పింది. రామయ్యగారు అంతా విని, చప్పగా నవ్వేశాడు. నవ్వు అయిపోయాక, "ఓసి, పిచ్చిదానా, అతను బ్రహ్మచారి కాదే!" అన్నాడు.

"ఆ ! ఆ !" అందామె భర్త నోట్లోపెట్టబోయిన తమలపాకులు తననోట్లో పెట్టుకుంటూ.

"ఆ—ఆ !" అన్నా డాయన అది చూస్తూ.

ఇదంతా చాటునుంచి విన్న కాత్యాయిని పరుగున తన రూముకు వెళ్ళి, మంచంమీద పడుకుని వలవల ఏడ్చింది.

*　*　*

మరో నాలుగురోజులు పోయేసరికల్లా, కార్యక్రమం తెలిసిన అతని మెడ తెల్లవారుతూనే గమ్మున యిరుకుపట్టి కూర్చుంది. ప్రసాద రావు నవ్వుకుంటూ మెడపుచ్చుకుని, జానకమ్మ గారిదగ్గరికి వెళ్ళి తను వచ్చిన కారణం చెప్పాడు. కానీ, ఈసారి ఆవిడ లోగడపద్ధతుల్లో చిరునవ్వు నవ్వలేదు, సరికదా ఉలకలేదుకూడా. ముఖం ఖండాయించుకుంటూ, "ఈ వీధిచివర చాకలాడు ఒకడున్నాడు. అతన్ని వెళ్ళి అడుగు మాటకుముందు ఒళ్ళంతా యిరుకుపట్టడం, బెణకడపూనూ—వేళాకోళమా, వెక్కిరింతా" అనేసి లోపలకు వెళ్ళిపోయింది. ఆ మాటతో అతని మెడ నిజంగానే బెణికింది. "హబ్బా" అనుకుని రూముకేసి నడిచాడు.

*　*　*

రూముకి నడిచినవాడు ఈవిషయం ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఓ వారం గిర్రున తిరిగొచ్చినా అంతుపట్టలేదు. "జానికమ్మగారు సుముఖి కాలేదు, కాత్యాయిని దుర్ముఖి కాదు"

"నీవు ఇక్కడి కెందు కొచ్చావ్?" పిచ్చాస్పత్రి చూడటానికి వెళ్ళిన పెద్దమనిషి ఒక రోగిని అడిగాడు.

"ఏముందీ ! జనానికి పిచ్చెక్కిందని నేనన్నాను. నాకు పిచ్చెక్కిందని వాళ్లన్నారు.

"అంటే...?"

"వాళ్ళమాటే నెగ్గింది."

కె. జి. రావు (మద్రాసు)

అనుకున్నాడు. ఒంటిమీద చెయ్యివేసుకుని చూసుకున్నాడు. ప్చ్—ఒళ్ళు చల్లగా ఉంది. బుర్ర గోక్కున్నాడు. ఊహలు పొడుచుకురాలేదు.

కాలేజీనుంచి వస్తూ వాళ్ళ గుమ్మంముందు కళ్ళు తిరిగి పడిపోతే బావుణ్ణనుకున్నాడు. కళ్ళు తిరగలేదు. తిరిగినవాడు ఎలాపడతాడో తెలీలేదు. ప్చ్—ప్చ్. లాభంలే దనుకున్నాడు. మరో రెండ్రోజులు కాలేజీకి శలవుపెట్టి ఆలోచించాడు. రూములో పదేపదే పచార్లు చేశాడు. "ఛఛ్—వెంటనే అంప కంపాలతో జ్వరం వచ్చితీరాలి" అనుకున్నాడు. "ఒళ్ళు వేడెక్కాలన్నమాట. వేడి వేడి" అని మనన చేసుకుని గదంతా పరకాయించి చూశాడు. ఓ మూలగా ఉన్న 'స్టౌ' ఫక్కున నవ్వింది. ప్రసాద రావు ఎగిరి గంతువేసి "హ్హాద్దీ" అని అరుస్తూ స్టౌ వెలిగించాడు. భగ్గుమని మంట వచ్చింది. ముఖం దానిమీద పెట్టుకున్నాడు. మంట తాకిడికి 'హబ్బ' అనుకున్నాడు. ముఖం వేడెక్కింది. "రైట్—ఇక అంపకంపాలతో ఉష్ణం వచ్చేసి నట్టే అనుకుని, కిటికీతలుపులు ఓరగా తెరిచి చూశాడు. దశరథరామయ్యగారు అరుగుమీద కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. రైట్ అనుకుని, మూల్గు ప్రారంభించాడు.

"హా—హ్హా—హ్హాబ్బా .... హాయ్యోవ్స్."

అరుగుమీద దశరథరామయ్యగారి పేపరూ, వంటింట్లో జానకమ్మగారి (చేతిలో) గరిటా నట్టింట్లో కాత్యాయిని (చేతిలో) జడా ఎగిరి పడ్డాయి. రామయ్యగారు పేపర్ని వదిలేసి, వంటింటితో సంప్రతించాడు. "నాకేం తెలీదు. మీరేగా వెళ్ళొద్దన్నదీ, కావాల్సొస్తే మీరెళ్ళి చూడండి" అంది ఇల్లాలు.

"ఛప్—చూద్దాంరా" అని, గద్దించి, బయల్దేరి,బయల్దేరదీశాడు. కిటికీగుండా చూసిన ప్రసాదరావు ఆఖరిసారిగా నుదురూ, ముఖం, చేతులూ, వేడి చేసుకుని, ఒంటినిండా దుప్పటి కప్పుకుని రెడీగా కూర్చున్నాడు. మరో రెండు నిముషాల్లో తలుపు చప్పుడయింది. ప్రసాదరావు ఎగిరి గంతేసి, మరోసారి ముఖం వేడిచేసుకుని 'ఊ' అని మూల్గుతూ తలుపు తెరిచాడు. తీస్తూనే "ఎబ్బే! జ్వ—జ్వరవండి. అంతే" అన్నాడు. 'అలాగా' అంటూ రావయ్యగారు అతని నుదురు ముట్టుకుని, "హబ్బా—పెనంలా కాలుతోందే" అన్నాడు. "కాలి కేంచేస్తుందీ" అనుకున్న ప్రసాద రావు కృతజ్ఞతాపూర్వకంగా స్టౌకేసి చూసి, అదింకా వెలుగుతూ ఉండడం చూసి, నాలిక్కరుచుకుని "హబ్బా" అన్నాడు బాధగా. జానికమ్మగారు తత్తర పడుతూ అతని నుదురు పట్టుకుని చూసి, "అవునుస్మండీ—పెనంలా కాలుతోంది. ఎప్పట్నుంచోయ్ జ్వరం ? కాస్త మాకు చెప్పకూడదూ...." అంది. రామయ్యగారు బుర్ర గోక్కుని, 'ఒళ్ళూ గట్రా నొప్పికూడా వుందా, లేక వుత్తి జ్వరమేనా" అన్నాడు. ప్రసాదరావు ఏవంటే, ఏం తప్పో అని తల తాటించాడు. "అయితే—నే నెళ్ళి మాత్ర పట్టుకొస్తా. కాస్త కాఫీ పెట్టవే" అంటూ ఆయన నడిచాడు—గదవతలకి, ఎందుకైనా మంచిదని తలిచి, "నేనే కాఫీ పెట్టుకుందావని స్టౌ రాజేశాను" అన్నాడు ప్రసాదరావు జనాంతికంగా. "పాపం" అంటూ జానకమ్మగారు వాపోతూ మరోసారి అతని నుదురుమీద చెయ్యి వెయ్యపోయింది. రామన్న ఆపద గ్రహించి "ఫర్లేదండి" అంటూ ప్రసాద్రావు వెనక్కి రెండడుగులు వేశాడు. కానీ ఫలితం లేకపోయింది.

"హర్రే, ఏదీ, ఛళ్ళి బోండాం అయిపోయిందేవిటి" అంటూ జానకమ్మగారు అతని నుదురు మీద చెయ్యి టకటక — తిరగమరగేసి చూసింది. 'చల్లారక ఏమవుతుందీ" అనుకున్నాడు ప్రసాదరావు ఏడుపుముఖం పెట్టి "ఇక ఆటకట్టు లాభంలేదు. కాండలో పడాలి" అని ఆలోచించి ప్రారంభించాడు.

"మరీ—మరండీ. నిన్న—నిన్నే—మా నాన్నగారి దగ్గిర్నించో ఉత్తరం వచ్చింది. అప్పట్నుంచీ మనసు అదోలా ఉందండీ" అన్నాడు.

"హో—హో—ఆ—మీవాళ్లంతా క్షేమమేనా" అంది జానకమ్మగారు గమ్మున. ప్రసాదరావునవ్వేశాడు.

"అబ్బెబ్బే—అదికాదు. మరీ—మరండీ—మరీ నా విషయం ...."

"నీ విషయమంటే—అమ్మడూ—కాస్త కుంకటి మీద పిల్లల్లో కాఫీపొడేసి, దించిపెట్టు. ఏం .... ఆ .... ఏమన్నావ్—నీ విషయమా .... అంటే ...." అంది జానకమ్మగారు స్థిమితంగా కూర్చుంటూ.

"అదికాదండీ! నాకు—అదే — నాకు ఈ యేడు పెళ్ళిచేస్తారట. మా నాన్నగారో పిల్లని చూశారు. ఆపిల్ల నాకు నచ్చలేదు ......

" .... ఆ .... ఆ .... నీకు అయితే పెళ్ళి కాలేదూ .... మరి ఆయనతో అలా చెప్పావన్నారు ..." అందావిడ ఆశ్చర్యాన్ని కక్కేస్తూ.

"అదా .... మరండి. అలా చెప్తేగానీ, పట్నాల్లో రూములు దొరకవుకదండీ — అందుకు."

"సొన్లే .... " అందావిడ స్థిమితంగా.

"ఆ సంగతే—రాశానండీ. అయితే నీకు నచ్చిన పిల్లని చూసుకుని రాయి. వారంరోజులు గడువు లేకపోతే నేను ఎంచిన పిల్లను చేసుకోవాలి అమటాని మా నాన్నగా (రాశారండి. అదీ సం....గ ...తి" అంటూ ఆగాడు.

"ఊ—అయితే మరీ మంచిదిగా, నువ్వు ఓ మంచి పిల్లను ఏరుకుని, మీ నాన్నగారికి రాయి" అందావిడ అతనివంక పరీక్షగా చూస్తూ. ప్రసాదరావు సిగ్గుతో కుదించుకుపోయి, అందుబాట్లో ఉన్న దువ్వటే దారంపోగులు పీకి, పోగు పొయ్యడం ప్రారంభించాడు.

ఇంతలో రామయ్యగారు అదరా బాదరా వచ్చి, మాత్ర అతని చేతికిచ్చి "ఊ కాఫీ ఏదీ" అన్నాడు. ప్రసాదరావు మాత్ర చక్కగా జేబులో వడేసుకున్నాడు. ఆశ్చర్యంతో రామయ్యగారి కనుబొమ్మలు పైకి ఎగిరాయి. గమ్మున అతని ముదురుమీద చెయ్యివేసి చూశాడు. ఈసారి కనుబొమ్మలు ఇంకా పైకి వెళ్ళి — ్రాపులో కూర్చున్నాయి. జానకమ్మగారు సాఫీగా నవ్వి విషయమంతా

బంగారు తండ్రి

పూసలు పూసలుగా భర్తకు అందిచ్చింది. దశరథ రామయ్యగారు ఆ పూసలన్నీ గుచ్చి చూస్తే అది 'కల్యాణహారం' లా కనుపించింది. 'ఆహా' అని తల తాటించాడు. జానకమ్మగారు లేచి, "ఇప్పుడే వస్తాన్నాయినా" అంటూ వెళ్ళిపోయింది. మిగిలిపోయిన రామయ్యగారికి లోకంలో ఆడపిల్లల తలిదండ్రులు కట్నాలూ గట్రా ఇవ్వలేక పడే గాథ సినిమాలా కళ్ళకి కనిపించింది. తల ఎత్తి ప్రసాదరావువంక చూశాడు. అసరికి ప్రసాదరావు తుంపిన దారంముక్కలన్నీ బంగచుట్టి, కొన్నిను బంతిలా తయారుచేసి, ఊహు మురిసిపోతున్నాడు. రామయ్యగారు హుందాగా, గాలి పీల్చి వదిలేశాడు.

"హ్హా— అయితే అంతమాత్రానికే జ్వరం తెప్పించుకోవాలటోయ్" అన్నాడు. ఆ మాటతో ప్రసాదరావు కొయ్యబారిపోయి "ఎబ్బే. తెప్పించుకో లేదండీ! ఆ—అదే—వచ్చింది" అన్నాడు.

"అదేలేహోయ్" అన్నా డాయన నవ్వుతూ. ఆనక "ఊ—పోనీ. ఎలాటి పిల్ల కావాలో, కట్నం ఎంత కావాలో చెప్పు. నా ఎరిక నేమైనా ఉంటే చూస్తా" అనేసి చూశాడు. ప్రసాదరావు సిగ్గుతో చేతిలో దారపుండ వోట్లో పెట్టుకోపోయి, పట్టక వదిలేశాడు. అందాకా వేచివున్న జానికమ్మగారు గమ్మున నవ్వూ. "ఊ—చెప్పవోయ్" అంటూ కూర్చుంది.

"మా నాన్న — ఇప్పు డాయన లేరనుకోండి .."

"అదేవిటి" అన్నారు దంపతులు.

"అవునండి. మా నాన్నగారు పోయి చాలా కాల మయ్యింది. నెప్పల్లిలో మా అమ్మగారు ఉంటున్నారు. మాకు బోలెడు ఆస్తి, అవీ ఉన్నాయి. ఈ ఏడు నాకు పెళ్ళిచేసితీరాలని మా అమ్మగారు పట్టు పట్టారు. నా ఇష్టంవున్న పిల్లని ఎన్నుకో మన్నారు ...." అని గుక్కతిప్పుకోకుండా అనేసి ఇద్దరివంకా చూశాడు. రామయ్యదంపతులు ఒకళ్ళముఖా లొకళ్ళు చూసుకున్నారు.

"అందుకని, మా అమ్మగారు రేపు—అహ—రేపులే డెల్నుండి వస్తున్నారు" అని చూశాడు. ముందు చూపుతో.

"నిజమే ?" అంది జానకమ్మగారు.

"మరేనండి. మీరు ఒప్పుకుంటారో .... లే.. లే.

"భలేవాడివయ్యా—ఏవిటి" అంది ఆవిడ.

"రేపో వస్తుంటా" అన్నా డాయన.

'మా పిల్లదానిక్కూడా ఈ యేడే చేసేద్దామ అనుకున్నాం. వదినగారు రానీ" అంది జానికమ గారు వరసలు కలిపి, భర్తకేసి చూస్తూ. రామయ గారు హుందాగా తల వంకించి, "అయి అమ్మాయి నీకు ......

" .... న్హ .... రే ..... నంకి" అన్నాడు తను సిగ్గుగా.

"అమ్మా ! కాఫీ" అంది గుమ్మం.

"ఆ—ఆ—రా అమ్మడూ" అంది ఆవిడ.

అమ్మడు రాలేదు.


"మా యింటికి రావోయ్. కాఫీ తాగుదాం పద" అన్నారు రామయ్యగారు. తలుపుచాటున వింటుని అంతా విన్న కాత్యాయిని గమ్మున ఇంట్లోకి పరిగెత్తి ఆనందంతో రేడియో పెట్టింది.

.... టి అబ్బాయి బంగారు తండ్రి—డి—డి" అంది రేడియో.

"కాదు. పక్క రూములో అబ్బాయి—బంగారు తండ్రి" అని పాడబోయి లోపలకు వస్తున్న అబ్బాయిని చూసి మరో గదిలోకి పరిగెత్తింది.

★


గళ్లనుడికట్టు - 92



అడ్డం

1. పక్షి ఇల్లేనా?
3. సామానులు ఉంచేది అట. కల్పనకాదు!
5. మొదటి.
6. ఆలయమే.
8. అమ్మిన సొవములో ప్రేమము కావలెను·
9. కోర్కు.
11. కోసే పరికరం.
13. యోగాభ్యాసానికి అవసరములు!
16. 8 అడ్డం ఆధారంలోని మాట మధ్య తీసేస్తే వృక్ష విశేషము. చిత్తము.
17. శోక భయాదులచే కలిగెడి ధ్వని, వికారము. కారకుడవు; వెదుకు!
19. కప్పెది.
21. ఆరడంకంటే అవరోధం ఎక్కడ?
24. మాయని గాయములో పాడేవారు!
26. మాటలోనే వెళ్ళు!
27. నిద్ర వచ్చేముందు ఇది వస్తుంది!
30. మంచి రకం వస్త్రం తిరగబడింది.
32. మాట.
34. త్రాగుడుకి సంబంధించినది!
35. దేశ ద్రిమ్మరిలో ఉన్మాదం.
37. కంపితమయిన కోకిల ఇక్కడ.
38. పెట్టె.
39. శ్రేణిని సరిచేస్తే పైకీ క్రిందకీ వెళ్ళవచ్చు!

91-వ గళ్ల నుడికట్టుకు జవాబు



నిలువు

1. వరాహం.
2. వర్ణము.
3. విక్రయించి!
4. కచ్చ, పోటి.
5. ఆ కంఠాభరణం తినవచ్చునా?
7. శబ్దం తల క్రిందులయింది!
8. సాకు.
10. నిండినట్లయితే ఒంటె లేక కంచర గాడిద!
12. గాలికి ఉపకరణము.
13. గోవు.
14. ఆభరణము.
15. తల క్రిందులయి గుచ్చుకుంటుంది.
16. కడుపులోనిది.
18. కోడి.
20. సుడి యమునలో, అయితే తమలపాకుల బరువునందు సగము.
21. ఆ దగ్గులో విచారం తప్పదు.
22. గద్దించు, తిట్టు. శునకం, కుక్క పదాలలో ఒక్కొక్క అక్షరం కావాలి.
23. నల్లని పక్షి.
24. దెబ్బ.
25. అతనిట్లుల యుపవాసము కావలెననిన?
26. సర్వనామంవలె ఉండే గుణము.
28. నెమ్మది. (చివర ఉదారగుణం.)
29. పాత కాపరిలోపలే ఇంద్రుడు.
31. ఎన్నికల . . . . అంటారు.
33. బృహన్నల తిరగబడ్డాడు!
34. వర్షశాల.
36. దానిమ్మలోనే మరొక జాతిచెట్టు నిలువుగా లేదు.
37. చివరలో సగం మార్చినా అర్థం మారదు. ★

న్యూఢిల్లీ లేఖ

7-వ పేజీ తరువాయి

ఈ ధనాన్ని మురికివాడల నిర్మూలనకో, కటిక దరిద్రుల పరిస్థితులను బాగుపరిచేందుకో వినియోగించిఉంటే దేవతలు ఇప్పటికంటే అధికంగా సంతోషించేవారు. కాని నిస్సంకోచంగా డబ్బు తీసుకువచ్చి మంటలో పోసిన మహనీయులు మురికి వాడల నిర్మూలనకుగాని, ఆస్పత్రుల నిర్మాణానికిగాని, విద్యా వ్యాప్తికిగాని, ఆ డబ్బు ఉదారంగా ఇచ్చేవారాఅంటే అనుమానమే!

హిందూ మతాధికారుల కక్కుర్తి ఇక్కడే కనిపిస్తుంది. భగవత్ కైంకర్యానికి భక్తులర్పించిన ధనాన్ని ఏనాడూ వారు బుద్ధిపూర్వకంగా ప్రజల శరీర, మానసిక అభ్యున్నతికోసం వినియోగించలేదు. ఆ ధనాన్ని వారివద్దనుంచి బలవంతంగా స్వీకరించవలసి వచ్చింది. అష్టగ్రహకూటమి సంభవించిన వారంలోనే రాజస్థాన్‌లోని నాద్‌ద్వారా అధికారి దేవాలయం ఆస్తి విషయమై ప్రభుత్వంమీద వేసిన దావా గెలిచాడు. ఇతడి తండ్రి ఢిల్లీలో ఒక వేశ్యకోసం రు. 10 లక్షలు తగలేసిన కథ అందరికీ తెలిసిందే. హిందూ మతాధికారుల వరస ఈ తీరుగా ఉంటే, క్రైస్తవ మతప్రచారకులు చేసిన సేవ ఎంత ప్రశస్తంగా ఉన్నదో పరిశీలించండి. క్రైస్తవ మత ప్రచారసంస్థ ఒకటి సుమారు రు. 50 లక్షలు పెట్టి పాతఢిల్లీలో రెండు హొటళ్ళ భవనాలు కొని వాటిలో ఒక ఉన్నత పాఠశాలను, ఒక కళాశాలను నెలకొల్పింది. క్రైస్తవేతరులు క్రైస్తవ మతం పుచ్చుకుంటారని గట్టిగా నమ్మలేకపోయినా ఈ విద్యా సంస్థల్లో వారిని కూడా చేర్చుకుంటారు. హిందూమతాధికారులు వీరివలె వైద్య, విద్యా వసతులు ఏర్పాటుచేయరు సరికదా, వీరు చేస్తున్నందుకు ఆగ్రహిస్తారు కూడాను! దేశంలోఉన్న కుష్టువ్యాధి చికిత్సాలయాలలో ఒకటితప్ప మిగిలినవన్నీ క్రైస్తవ మత ప్రచార సంస్థల నిర్వహణలోనే ఉన్నాయంటే విడ్డూరంగా ఉంటుందేమో!

మన దౌర్భాగ్యమేమోకాని దేవాలయ ఆదాయం మీద బ్రతికే ఆలయాధికారి, ఆలయం మెట్లు మరమ్మతు చేయించవలసివచ్చినా భక్తుల సహాయం ఆశిస్తాడు.

స్వాతంత్ర్యంవచ్చి బ్రాహ్మణ మతాన్ని పునరుద్ధరించిందిగాని, హిందూ దేవాలయాధికారులలో మాత్రం ఏవిధమైన మార్పూ తేలేకపోయింది. జన బాహుళ్యానికి వారు ఇంకా అజ్ఞానం, మూఢనమ్మకాలు కర్మకాండ మాత్రమే అందజేస్తున్నారు.

*   *   *

భారత—నేపాల్ సంబంధాలు ఇరుకునబడ్డాయి. కంపాలను లొంగదీసేందుకు నేపాల్ భూభాగంలో ప్రవేశించవలసిందిగా చైనీయులను నేపాలీ విదేశాంగ మంత్రి బాహాటంగా ఆహ్వానించాడు. కంపాలు టిబెట్ దేశస్థులు. వీరికి విదేశీ సహాయం లభిస్తున్నదని ఆరోపించారు. అక్కడ (టిబెట్‌లో) వీరు చైనీయులతో నిరంతరమైన పోరాటం జరుపుతున్నారని నేపాల్ మహారాజు స్వయంగా ధృవపరచారు. ఈ వార్తలవల్ల భారత దేశానికి నిజమైన ప్రమాదం ఏర్పడిందని విదితమవుతున్నది. నేపాల్ చైనాకు లొంగిపోయే సూచనలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీని అర్థం భారత ప్రభుత్వ దౌత్యనీతి విఫలమైందని. ఈ సందర్భంలో చారిత్రక అంశాలు కొన్ని మనవి చేస్తాను.

1947 లో భారతదేశం స్వతంత్రమైనప్పుడు నేపాల్ పరిపాలన రాణాల అధీనంలో ఉన్నది. మహారాజు వారి ఖైదీఅయ్యాడు. సుమారు ఏడు సంవత్సరాలక్రితం రాజసౌధంలో తిరుగుబాటు వచ్చింది. మహారాజు ఆ సౌధంనుంచి బయటపడి భారత రాయబారి కార్యాలయంలో తలదాచుకున్నాడు. ఆ తరువాత ఆయన ఢిల్లీ వచ్చాడు. రాణాలు వెంటనే ఆయన మనుమణ్ణి సింహాసనంమీద ఉంచారు. ఈ నూతన మహారాజును బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే గుర్తించింది. భారత ప్రభుత్వం మాత్రం గుర్తించక, వెనుకటి మహారాజుకే సింహాసనం అప్పగించాలని పట్టుబట్టింది. చివరకు ఎట్లాగైతేనేమి భారత ప్రభుత్వం మాటే నెగ్గింది. ఢిల్లీకి పారిపోయివచ్చిన రాజే మళ్ళీ నేపాల్ సింహాసనం అధిష్ఠించాడు. దీని అర్థం నేపాల్‌మీద భారత ప్రభుత్వ సార్వభౌమాధికారాన్ని గుర్తించినట్లేకదా. భారత ప్రభుత్వం గుర్తించకపోతే నేపాల్ రాజ్యానికి అవకాశం ఎవరికీ లేదని కూడా స్పష్టమవుతున్నది.

బ్రిటిష్‌వారు భారతదేశానికి పొరుగునఉన్న దేశాలతో చేసుకున్న ఒప్పందాలన్నీ భారత ప్రభుత్వానికి వారసత్వంగా సంక్రమించాయి. 1925 లో భారత—నేపాల్ దేశాలు కుదుర్చుకున్న ఒప్పందం "ఈ ఉభయ పక్షాలవారు తమ తమ భూభాగాలను రెండవ దేశం భద్రతకు హానికరమైనవిధంగా వినియోగపడకుండా తగు చర్యలు తీసుకోవాలి" అని నిర్దేశించి ఉన్నది.

ఈ ఒప్పందానికి ఇప్పుడు మంగళంపాడారు. ఎందువల్ల? నేపాల్ మహారాజుకు మళ్ళీ సింహాసనం కట్టబెట్టించినవెంటనే అక్కడ (నేపాల్‌లో) పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టమని భారత ప్రభుత్వం ఆయనపై వత్తిడి తెచ్చింది. నేపాల్‌కొక ప్రధాన మంత్రి నియుక్తుడయ్యాడు. ఆయన తనకు తాను ప్రాతినిధ్యం వహించటమేకాక, సొంత పార్టీ ఒకటి ఉండేది. అక్షరజ్ఞానంలేని జన బాహుళ్యం, రవాణా వసతుల కొరతల దేశంలో ఎన్నికలు అంటూ జరిపారు. మహారాజు పరిపాలనా యంత్రాంగాన్ని స్వాధీనం చేసుకునేవరకు దుస్తంత్రాలు యథేచ్ఛగా సాగాయి. ఆయన చర్యను భారత దేశం నిశితంగా విమర్శించింది.

కనుక నేపాల్‌లో భారతదేశానికి ప్రతికూలమైన వాతావరణం ఏర్పడిందంటే ఇతరులను నిందించవలసిన పనిలేదు.

*   *   *

ఢిల్లీ నగరవాసులు, ముఖ్యంగా కాందిశీకులమని చెప్పుకుంటున్నవారు ఎన్నికలవల్ల కలిగే ప్రయోజనాలు పూర్తిగా సాధిస్తున్నారు. ఖాళీ స్థలాలు ఉన్న చోటల్లా గుడిసెలు వెలుస్తున్నాయి. జనపథ్‌లోని దుకాణదారులు తమ దుకాణాలను పెద్దవి చేసుకుంటున్నారు. నగర పాలక సంఘం ఇన్నాళ్ళుండి ఉర్దూను అధికారభాషగా గుర్తించింది. జనసంఘం కూడా ఇందుకు ఆమోదించింది. ★

యువ ప్రపంచం

దివ్య పురుషులు

ఎన్నికలు సమీపిస్తున్నాయేమో ఏ రాజకీయవాదినోట విన్నా మహాత్మా గాంధీ పేరే! తమ తమ వాదాలకు అనుగుణంగా 'గాంధీజీ'ని వాడుకుంటున్నారు. ప్రతిపక్షం వారు చేసిన పనులు 'గాంధీజీ' ఖండించి ఉండేవారని ప్రచారం చేస్తున్నారు. అంటే మహాత్మాగాంధీ మరణించి పధ్నాలుగు సంవత్సరాల చిల్లర అయినా అప్పుడే ఆయన పేరుకి 'పవిత్ర మత గ్రంథాల' తో సమానమయిన ప్రాముఖ్యం ఏర్పడిపోతోంది.

[పెద్దైన చోటల్లా గాంధీతాత బొమ్మలు ఆవిష్కరిస్తున్నారు. అసహ్యంగా వేసిన దేవుళ్ళ బొమ్మలతో పాటు గాంధీ, నేతాజీల వర్ణ చిత్రాలు ప్రతి ప్లాటుఫారంమీదా అమ్ముడుపోతూ ఉంటాయి.]

ఇది ఏ పరిణామానికి దారి తీస్తున్నదో ఊహించటం కష్టమైన పనికాదు. మహాత్మా గాంధీ సైతం దివ్యపురుషుడైపోయే ప్రమాదంలో ఉన్నాడు. అసలే ఒకవైపు పారిశ్రామికాభివృద్ధి గాంధీసిద్ధాంతాలకు వ్యతిరేకమని ప్రచారం జరుగుతున్నప్పుడు ఈ పరిణామంయొక్క ఫలితాలెటువంటివో కూడా ఊహించటం కష్టమైన పనికాదు. ఇది యువ ప్రపంచానికి ఎంతో ముఖ్యమైన విషయం. పైన చెప్పిన వైఖరి ఎందరి మన స్సులను కమ్ముకొని అస్పష్టంగా కనిపిస్తున్నదో చెప్పలేము.

సి. వి. ఆర్. ఎస్. (మద్రాసు)

* * *

నిరుద్యోగ సమస్య

'నేటి యువప్రపంచాన్ని బాధించే సమస్యల్లో నిరుద్యోగసమస్య ఒకటి. నూటికి తొంభైమందివిషయంలో ఈ సమస్య పరిష్కారమైతేనేగాని యితర సమస్యలను గురించి కనీసం ఆలోచించటాని క్కూడా వీల్లేకుండా వుంటుంది. హైస్కూలునుంచో కాలేజీనుంచో బయట పడిపడటంతోటే ముందుగా యెదరయ్యే సమస్యయిదే! చదువయిపోగానే "ఎక్కడైనా నాలుగు రాళ్ళు తీసుకొచ్చిపడేస్తాడేమో, చెల్లెళ్లకు పెళ్ళిళ్ళు తోడుగా...." అని కలలు కంటూ వుంటారు తలిదండ్రులు. వాళ్లసంగతెలావున్నా, చదువైపోగానే తలిదండ్రులమీద ఆధారపడకుండా తన కాళ్ళమీద తాను నిలబడాలని ప్రతివారికీ వుంటుంది, ఏ ఒకరిద్దరికో తప్ప!! స్థితిమంతులైనవారికీ, ఆర్థికబాధలు లేనివారికీ ఇదొక సమస్య కాకపోతే కాకపోవచ్చు — వాళ్లకు ఉద్యోగం చెయ్యకపోయినా గడుస్తుంది; చెయ్యాలనుకుంటే ఎక్కడో ఒకరికమెండేషన్ దొరక్కపోదు; దొరక్కపోయినా ఇవ్వాళకాకపోతే రేపు, రేపు కాకపోతే యెల్లుండి...ఏదో ఒకనాటి కొక ఉద్యోగం సంపాదించుకోలేకపోరు; అందుకు కొంత కాలం పట్టినా అంతకాలంకూడా "దొరికినప్పుడే దొరుకుతుందిలే" అని కాలుమీద కాలువేసుకు కూర్చోగలరు. వారిని గురించి కాదు మన మిక్కడ ఆలోచించవలసింది.

ప్రతిసమస్యకీ ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవటం అలవాటైపోయింది మనకి. ఎంత చేసినా ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించలేకపోయిందన్నమాట నిజమేకావచ్చుకాని అంత మాత్రంచేత అంతా ప్రభుత్వాని కంటగట్టేసి మనం ఇంట్లో కూర్చుని వేడివేడి నిట్టూర్పులు విడుస్తుంటే ప్రయోజనమేమిటి?

అప్పొసప్పొచేసి,నాలుగు వేలు ఖర్చుపెట్టి,పట్నంలో నాలుగేళ్ళుండి, ఓ కాగితముక్కచ్చుకొస్తే, వచ్చి రాగానే 'రెడీగా' యెక్కడోక్కడ యేదో ఓ గుమాస్తా వుద్యోగం దొరికిపోతుందనే నమ్మకం కొంతకాలం క్రిందట నిజమేగాని, యిప్పుడుమాత్రం మూఢనమ్మకమైపోయింది. ఆరోజుల్లో చదువుకున్నవాళ్లు తక్కువే, ప్యాసయినవాళ్లూ తక్కువే! ఇప్పుడైతే యేటా మార్చినెలలో కొన్నివేలమంది సెప్టెంబరు నెలలో కొన్నివేలమంది డిగ్రీలు మాత్రం చేతబుచ్చుకుని వీధులవెంటబడవలసి వస్తోంది. ఎంతమంది కుద్యోగాలు దొరుకుతాయి? "దేశాని క్కావలసింది బియ్యేలు; ఎమ్మేలు కాదు; సాంకేతిక విద్యగడించినవారు. అట్టి వారికెందరికైనా ఉద్యోగాలు చూపించగలశక్తి దేశానికున్నది" అని ప్రభుత్వం ఇచ్చేసమాధానం—నిజమేనేమో!!

ఎక్కడ చూసినా రికమండేషన్లుంటేనే ఉద్యోగాలు దొరుతున్నాయనీ, మెరిట్ (Merit) కెక్కడా ప్రాధాన్యం యివ్వబడటంలేదనీ, అంతా అన్యాయమే జరుగుతోందని మనం రోజూ వింటూనే వుంటాం. ఇది కూడా నిజమేకాని— అన్ని చోట్లా ఇలాగే జరుగుతోందంటే మాత్రం నమ్మశక్యంగాని విషయం. పూర్తిగా మెరిట్‌మీదనే ఆధారపడి ఉద్యోగాలిచ్చే సంస్థలు అధికారులూ లేకపోలేదు. అటువంటిచోట్లకూడా విఫలులైనవారు తమనుతామే నిందించుకోవాలి.

హైస్కూల్లోనూ, కాలేజీలోనూ నేర్చుకునేదంతా ఒకటి! ఉద్యోగం అంటూ దొరికితేఆఫీసులో కూర్చుని చేయువలసిన పని వేరొకటి!! ఈ మధ్యలో దరఖాస్తు (Application) పెట్టుకున్న తర్వాత ఇంటర్వ్యూ (Interview) లలో అడిగే ప్రశ్నలూ వాటి కీయువలసిన జవాబులూ అటూ ఇటూ చెందకుండా చిత్రవిచిత్రాలు!!! ఇందులో ఒకదానికి వేరొకదానికీ వున్న సంబంధమేమిటో (నాబోటి) సామాన్యులకు బోధపడదు (అంటారు పెద్దలు). అసలు వాటికి సంబంధమంటూ వున్నా లేకపోయినా, యీ విచిత్రద్వారాలన్నీ దాటుకొస్తేగానీ మనకు మోక్షంలేదుగనుక, మానవమాత్రులంగా మనం సాధించవలసినదంతా ఇక్కడే వుంటుంది:

ఇంటర్వ్యూల తీరు

పరీక్ష ప్యాసవట మెలాగూ తప్పదు. ఉద్యోగమంటూ వచ్చింతర్వాత అక్కడచేయవలసినదాన్ని గురించి ముందుగా విచారించవలసిన అవసరం కూడ లేదు. ఎటొచ్చీ ముఖ్యమైన ద్వారం ఇంటర్వ్యూ (Interview). నాకుతెలిసిన ఒకాయన యీ ఇంటర్వ్యూని వైకుంఠ పాళీలోని పెద్ద పాము (116వగడి అనుకుంటా)తో పోల్చాడు. మనం వేసే తప్పటడు గెక్కడంటే, ఒక ఉద్యోగానికి దరఖాస్తుపడేసి, అప్పైన ఒక (General knowledge Book) కోసం వెళ్లి అప్పు తెచ్చుకుని, ఇంటర్వ్యూకు రావలసిందని పిలుపు వచ్చాక (రెండు మూడ్రోల క్రింతం వార్తాపత్రికలుకూడ తెచ్చుకుని) ముందు యేదిచదవాలో, యేది చదవకూడదో, ఏలాఅర్థం చేసుకోవాలో, యేలా జ్ఞాపకం పెట్టుకోవాలో తెలియక, రాత్రింబవళ్లు నుంచుని, కూర్చుని, పడుకుని, జార్లగిలబడి, నానా అవస్థా పడుతుంటాం. ఉన్న కాస్త పుణ్యకాలంలో మన కర్థమయ్యేదే కాస్తాయి, అందులో మర్చిపోయేది కొంతయితే,తీరా ఇంటర్వ్యూలో వాళ్లడిగేది మనం చదవకుండా వదిలేసిందన్నా అవుతుంది, లేకపోతే చదివి మర్చిపోయిందన్నా అవుతుంది. అదీఇదీగాకపోతే కనీసం, మనం ఇంగ్లీషులో వివరించి చెప్పలేనిదన్నా అవుతుంది. ఫలితం : ("We regret very much)...." ఒక కార్డుముక్క మనవెనకాలే ఇంటికొస్తుంది.... అవుస్తకాలూ, వార్తాపత్రికలూ, ఇంటర్వ్యూకోసమే అనుకోకుండా విజ్ఞానంకోసమనో, వినోదంకోసమనో కనీసంసరదాకోసమనో,విద్యార్థిదశలో వున్నప్పుడే ఎప్పుడైనా తీరిగ్గా ఉన్నప్పుడు చదువుకుంటూ, కాస్త ఇంగ్లీషు సరిగ్గా మాట్లాడ్డం అలవాటు చేసుకుంటే (ఇంకామనం యింగ్లీషు భాషతోనే బ్రతుకుతున్నాంగనుక), న్యాయంవున్నచోట ఈ ద్వారాన్ని సులభంగా దాటవచ్చునని నా నమ్మకం.

ఏది యేమైనా, మనదేశంలో ఉద్యోగాలిచ్చే అధికారులలోకూడ చాలా మార్పురావలసి వుంది. సిఫార్సులను త్రోసిపుచ్చి పూర్తిగా ప్రావీణ్యానికి ప్రాముఖ్యమివ్వగలిగిన మంచితనం, ధైర్యం వారిలో ఉద్భవిస్తేగాని యీ సమస్య పరిష్కారంకాదు. అంతవరకూ యువప్రపంచం ఈసమస్యకు తల యొగ్గి ఉండక తప్పదు.

పి. ఎస్. శాస్త్రి, (గుల్బర్గా). ★

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street Madras-1, Chief Editor: S. Sambhu Prasad.



గాంధిజీ

Regd. No. M 4479 ANDHRA SACHITRA VĀRA PATRIKA.

